తెలుగు పుస్తకాలయం

# వికాస ధాత్రి

Download Telugu Books from
www.vikasadhatri.org

Vikasa Dhatri
1-122, Shivalayam Street
Zampani Post, Vemuru Mandal
Guntur District, Andhra Pradesh
India 522266
Ph:9440994244, vikasadhatri@vikasadhatri.org

Download Telugu Books from www.vikasadhatri.org

Telugu kathalu kadhalu Navala

Navalalu naatakaalu Natakam

Balala kathalu literature stories

novels plays essays Andhra Pradesh

literature Sahityam Free

Telugu e Books Pustakaalu

Grandham Grandhaalu Grandhalu

Pustakam Sametalu puranalu shatakam

satakalu Free Vikasa Dhatri

Download Telugu Books from www.vikasadhatri.org



మనీ ప్లాంట్

# మనీ ప్లాంట్

(అనువాద కథల సంకలనం)

కొల్లూరి సోమశంకర్



కస్తూరి ప్రచురణలు

హైదరాబాద్

2006

# మనీ ప్లాంట్

**రచయిత**

కొల్లూరి సోమశంకర్

సర్వహక్కులు రచయితవే

**ప్రథమ ముద్రణ : అక్టోబర్ 2006**

**ప్రతులకు**

కస్తూరి పద్మ
ప్లాట్ నెం. 32, దమ్మాయిగూడ
నాగారం పోస్ట్, ఈసిఐఎల్ పోస్టాఫీస్
హైదరాబాద్ - 500062

**విశాలాంధ్ర అన్ని శాఖలు**

**సాహిత్యనికేతన్**

3-4-852, కేశవనిలయం,
బర్కత్‌పురా, హైదరాబాద్- 27
ఫోన్ : 27563236

**అక్షరాల కూర్పు**

**జాగృతి గ్రాఫిక్స్**

3-4-228/4/1, లింగంపల్లి,
కాచిగూడ, హైదరాబాద్-27
ఫోన్ : 27562625

**కవర్ డిజైనింగ్ & ముద్రణ**

విప్ల కంప్యూటర్ సర్వీసెస్
మల్టీకలర్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్
నల్లకుంట, హైదరాబాద్ -44
ఫోన్ - 040-27676910, 55348445

**MONEY PLANT**

(An Anthology of translated short stories)

Kolluri SomaSankar

© Author

For copies
Kasturi Padma
Plot no.32, Dammaiguda,
NagaramPost,
ECILpost office, Hyd-62

All branches of Visalandhra

**SAHITYANIKETAN**

3-4-852, KesavaNilayam
Barkathpura, Hyderabad-27
Ph:27563236

**DTP**

Jagriti Graphics
Hyderabad-27

COVER DESIGN & PRINTING

Vipla Computer Services
Nallakunta
Hyderabad-44
Ph: 040-27676910
Price : Rs.40/-

**వెల : రూ. 40**

# కృతజ్ఞతలు

ఈ కథలను తెలుగులో అనువదించడానికి అనుమతించిన మూల రచయిత/ రచయిత్రులకు

ఈ కథలను ప్రచురించిన వివిధ పత్రికలకు, వాటి యాజమాన్యానికి – ముఖ్యంగా జాగృతి వారపత్రిక సంపాదకులు రామమోహన్‌రావుగారికి, నవ్య సంపాదకులు శ్రీ రమణగారికి, సబ్–ఎడిటర్ మహర్షిగారికి, ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధం ఇన్‌ఛార్జి వసంతలక్ష్మి గారికి, విపుల ఇన్‌ఛార్జి యార్లగడ్డ రాఘవేంద్ర గారికి, సాహిత్య ప్రస్థానం ఎడిటర్ తెలకపల్లి రవిగారికి

ముందుమాట రాసి వెన్నుతట్టి ప్రోత్సహించిన సుప్రసిద్ధ పాత్రికేయురాలు డా.కె.బి.లక్ష్మి గారికి, వార్త ఆదివారం అనుబంధం ఇన్‌ఛార్జి గుడిపాటి గారికి,

అందంగా డిటిపి చేసిన వినోద్ కుమార్‌గారికి, స్వప్న గారికి,

సాహితీ మిత్రులకు, కుటుంబ సభ్యులకు

నా కథలను చదివి ప్రోత్సహిస్తున్న పాఠకులకు

**కృతజ్ఞతలు**

ఈ పుస్తకంలోని కథలపై మీ అభిప్రాయాలను తెలియజేస్తారని ఆశిస్తూ...

**కొల్లూరి సోమశంకర్**

30–2/9, తిరుమల నగర్,

కానాజిగూడ, సికింద్రాబాద్ – 500015

somasankar@gmail.com

గమనిక : మూల కథలను ప్రచురించిన కొన్ని వెబ్‌సైట్లు ఇప్పుడు ఇంటర్‌నెట్‌లో లేవు. సైట్లు ఉన్నా, కొన్ని కథలను తొలగించి ఉండవచ్చు.

# అనువాద 'కదం'బం

ప్రకృతిలో ఏ పువ్వు ప్రత్యేకత ఆ పూవుదే. పూలతో పోటీపడి పరిమళాల్ని వెదజల్లే మరువం, ధవనం వంటి పరిమళ పత్రాల సొగసూ తక్కువది కాదు. రంగురంగుల పూవుల మధ్య హరిత పత్ర వర్ణాల హంగులు కూరుస్తూ అల్లిన కదంబమాల చూడ సుందరమేగాక సురభిళము కూడా. మాలని చేతిలోకి తీసుకుని ఆఘ్రాణించినప్పుడు విడివిడిగా ఏ పూవుకాపూవు, ఏ పత్రానికా పత్రం తమదైన మృదు, గాఢ సుగంధాలతో పలకరిస్తాయి.

మాల అల్లేవారికి పూల భాషే కాదు ఏ రంగు పుష్పం పక్కన ఏ రంగును జతచేయాలి, సువాసనలు సమ్మిశ్రితం అయిపోకుండా మృదు, గాఢతల్ని ఎంతెంత దూరంలో ఎక్కడెక్కడ పంచాలో, ఎక్కడ ధవనాన్ని, మరువాన్ని వుంచాలో కూడా తెలియాలి. అందుకు అభిరుచి, అభినివేశం, సౌందర్య స్పృహలతో పాటు ప్రకృతి పరిశీలన కూడా ఉండాలి.

అనువాద కథల సంకలనం కూడా కదంబమాల వంటిదే. అనువాదకుడు పుష్పలావికుడే. కొన్ని కథలు మృదువుగా, ఆర్ద్రంగా, కరుణతో హృదయాన్ని తాకితే, కొన్ని గాఢంగా ఆలోచింపజేస్తాయి.

అనువాదకుడికి అభిరుచి, అవలోకనం, ఆలోచన, ఆసక్తితో పాటు మానవ ప్రకృతి పరిశీలన, పరిశోధన తప్పనిసరి. అనువాదకుల ప్రతిభకి మూలకథ ఎంపికే గీటురాయి.

సోమశంకర్ choice of original story is inimitable. అతని అనువాద శైలి, భాష, చదివించే గుణం, ఒరిజినాలిటీని పోగొట్టని నేటివిటి, ఫ్లస్ షార్ట్ స్టోరీ నిర్వచనానికి, సంక్షిప్తతకు తగినట్లు కథల ఎంపిక అద్భుతంగా కుదిరాయి. మూలభాష ఏదైనా ఎన్నుకున్న ఇతివృత్తాలు, వాతావరణం సార్వజనీనం కావడం విశేషం. సార్వకాలీనం కావడం కాకతాళీయం.

'No matter how great your words may be, you will be judged by your translation' అన్నట్లు తర్జుమా, స్వేచ్ఛానువాదం, భాషాంతరీకరణ, అనుసృజన, అనువాదం – పదం ఏదైనా సాంస్కృతిక, వైజ్ఞానిక వినిమయ సాధనం అయిన అనువాద విద్య కలంతోసాము లాంటిది. ఆ సాము గారడీ తెలిసినవాడు కొల్లూరి.

వాగ్రూప సంకేతాలు ఒకే భాషలో ఉన్నట్లు ఇంకో భాషలో ఉండవు. కానీ ఆ సంకేతాల వెనుక ఆలోచనల్లో సారూప్యత ఉంటుంది. ఆ ఆలోచనల్ని, భావాల్ని అందుకుని సాంస్కృతిక సమస్యల్ని, భాషాగతమైన ఇబ్బందుల్ని తన దుభాషిత్వంతో, అనువాద సామర్థ్యంతో అధిగమించి, ఏకోన వింశతి (19) కథల్ని ఇవి మన (భాషా) కథలేనేమో! అన్నట్లు తెలుగు 'వెలుగు'లోకి తెచ్చిన 'సోమ'శంకర్ అనువాదరీతి ప్రశంసనీయం. ఇందుకు అన్ని కథలూ ఉదాహరణలే అయినా 'చెరువు' కథకి జాబితాలో ప్రథమస్థానం.

మూలభాష ఒకటి, లక్ష్యభాష ఒకటి అయినప్పుడు పాత్రల అభిప్రాయ ప్రకటనల్ని అనువదించినట్లు ఉద్వేగాల్ని ప్రకటితం చేయడం అంత సులభం కాదు. దాదాపు కథల్లో అది సాధించి చూపించినా 'మనీప్లాంటు', 'ఓ మనిషీ ఎందుకిలా?', 'బాకీ', 'వృత్తిధర్మం', 'ఆత్మావలోకనం'లకి అగ్రతాంబూలం.

పైకి అప్లిక్ వర్క్ చేసిన అందాల కోకలా కనిపించే ఆడపిల్లల జీవితాలెంతటి జీర్ణవస్త్ర సదృశ్యాలో చెప్పే 'మిగిలిపోయినవి', 'కట్టుకథ', 'లాటరీ' కథలు వాదాలకతీతమైన అక్షరభాష్యాలు.

స్నేహాలు, రాగద్వేషాలు, ఈర్ష్యాసూయలు, కలిమిలేములు, కష్టసుఖాలు, వినోద విలాసాలు వగైరాలు విశ్వ మానవులందరికీ సమానమే. ఏ భాష వారు ఆ భాషలో ఘోషిస్తారు. ఆయా భాషల్లోని నుడికారాల్ని, ఇడియమ్స్‌ని మధ్యభాష (Middle Language) అయిన ఆంగ్లం ద్వారా పట్టుకుని తెలుగు ఒడియాల్లా మార్చి అనువాదాల విందు చేసే చేయి తిరిగిన వంటివాడు కొల్లూరి సోమశంకర్. అందుకే ప్రతి కథా హాయిగా రుచి(చదివి)స్తుంది.

వాన నీళ్ళల్లో కాగితం పడవలు చేసి, అమ్మ పెట్టే తాయిలాలు తింటూ, ఇసుకలో పిచ్చుక గూళ్లు కడుతూ, లక్క పిడతల్తో, బొమ్మల్తో ఆడుకునే పిల్లలు సోమశంకర్ అనువాదాల్లో ఎంతలా పెద్దవాళ్లని పసిపిల్లల్ని చేసి ఎదలోతుల్లోకి తొంగి చూస్తారో 'పెరుగన్నం', 'బొమ్మ', 'అమ్మ వస్తే బావుండు' కథలు చదివితే అర్థమవడమే కాదు చాలాసేపు బైటికి రాలేనంత బరువైన ఆశ్చర్యం కలుగుతుంది.

సరదాగా సాగుతూనే జీవిత సత్యాలను ఆవిష్కరించే 'హస్తలాఘవం', 'యమరాజు', 'సెల్‌ఫోన్', 'సందేశము × అనుభవము' కథలు–విద్యార్థుల వెన్నెముకలు ఆత్మవిశ్వాసంతో ఎంత నిటారుగా వుండాలో చెప్పే 'సున్నాగాడు' – అమ్మని ఆమె కన్నపిల్లలు ఎప్పటికి అర్థం చేసుకుంటారు? చేసుకునీ నటిస్తారా? అని ప్రశ్నించే 'ఆశా నిరాశేనా?' కథ – ఈ అష్టాదశ కథలకి భిన్నమైన పందొమ్మిదో కథ 'వలయం నుంచి బైటపడాలంటే దాంట్లోనే తిరగకూడదు. దాన్ని ఛేదించాలి' అని చెప్పే 'విషవలయం' –

ఏ కథా మరో కథని పోలకుండా ఎక్కడెక్కడ వెతికి తెచ్చాడో ఈ కథాముత్యాలన్నట్లు, తాను చదివిన మంచి విలువైన కథలని తన పాఠకులకు అందించాలన్న తపనతో, ఆర్తితో, అనువాద తృష్ణతో, అత్యంత శ్రద్ధగా, అమిత నిజాయితీతో, ఏక'సూత్ర'త పాటిస్తూ అందించిన కొల్లూరి సోమశంకర్ అనువాద కథారచనా దిశానిర్దేశకుడు.

ఈ సంకలనంలోని అనువాద కథలు పఠితకు పఠనానందంతో పాటు సందేశాన్నీ, ఆలోచనల్ని, సంతృప్తిని అందిస్తాయి. Each Expression will leave an impression.

శుభాభినందనలతో
**లక్ష్మి**

**డా॥ కె.బి.లక్ష్మి**
భాగ్యనగరం
ఫోన్ : 9949593335

# వికసించిన అనువాద సృజన

ఆదాన ప్రదానాలు సాహిత్య వికాసానికి దోహదం చేస్తాయి. ముఖ్యంగా వచన సాహిత్యానువాదాలు ఇతర భాషల్లోని సాహిత్యాన్ని, జీవనరీతుల్ని పరిచయం చేస్తాయి. సృజనాత్మకత సాహిత్య ప్రక్రియల్లోని వైవిధ్యాన్ని ఆకళింపు చేసుకోవడానికి తోడ్పడతాయి. కొల్లూరి సోమశంకర్ చేస్తున్న కథల అనువాదాలు సరిగ్గా ఈ కోవలోకి వస్తాయి. కొంతకాలంగా వివిధ భాషల్లోని చిన్నచిన్న కథల్ని అతను తెలుగులోకి అనువాదం చేస్తున్నాడు. ఈవిధంగా చేసిన అనువాదాల్ని ఒక దగ్గర చేర్చి పుస్తకంగా తీసుకురావడం ముదావహం. ఈ కథలు చదవడం ఒక వినూత్న అనుభవం. ఆయా భాషల్లోని రచయితల ఊహాశాలిత, సృజనాత్మకత నైపుణ్యం విస్మయం గొల్పే రీతిన వున్నాయి. ఇంగ్లీషు భాషలో వచ్చిన కథల్ని ఎక్కువగా అనువాదం చేశారు. ఆ తరువాత హిందీ, కాశ్మీరీ, తమిళం భాషల్నించి చేసిన కథల అనువాదాలు వీటిలో ఉన్నాయి. జీవిత వైశాల్యం, విస్తృతిని అనుభవంలోకి తీసుకువస్తాయి ఈ కథలు.

ఆంగ్ల సాహిత్య ప్రపంచంలో ఈతరం రచయితలు తీసుకుంటున్న ఇతివృత్తాల్లో వైవిధ్యం ఉంది. తెలుగు పాఠకలోకానికి పరిచయం లేని జీవన పార్శ్వాల చిత్రీకరణ కారణంగా ఈ కథలన్నిటా ఒక కొత్తదనం కనిపిస్తుంది. పిల్లల మనోభావాలు, సున్నితమైన స్పందనలు, వారి మానసిక సంచలనాలు ఈ కథల్లో రికార్డయ్యాయి. గ్లోబలైజేషన్ క్రమంలో దూరాలు చెరిగిపోతున్నా మనుషులు మరుగుజ్జుగా మారిపోతున్నారు. వస్తువ్యామోహ సంస్కృతిలో మానవీయ విలువలు లుప్తమవు తున్నాయి. జీవిత నమూనాల్లో వచ్చిన మార్పులు ఉన్నత సంస్కారాన్ని అందించకపోగా కుత్సితంగా ఆలోచించే స్థాయికి మనుషుల్ని దిగజారుస్తున్నాయి. అభివృద్ధి ఫలితాలు అందరికీ సమంగా అందకపోవడం వల్ల 'లాటరీ' రూపంలో అదృష్టం వెతుక్కుంటూ వస్తుందన్న ఆశలు సామాన్యుల్ని నడిపిస్తున్నాయి. ఇలాంటి వాస్తవాల్ని రికార్డు చేసిన కథలివి. అభివృద్ధి, టెక్నాలజీ హానికరం కావు. కాని వాటివల్ల ఏర్పడే ప్రతికూల ఫలితాలు జీవితాల్నీ, ఆలోచనల్నీ ప్రభావితం చేస్తున్నాయి. ఒక్క 'సెల్‌ఫోను' తీసుకువచ్చిన ప్రభావం, ప్రమాదం చిన్నదేం కాదు. ఇలా రోజువారీ జీవితంలో మనం చూస్తున్న సంఘటనల్నీ, విషయాల్నీ కథారూపంలో చూసినప్పుడు ఆశ్చర్యానికి లోనవుతాం. ఈ కథలు చదివినప్పుడు కూడా అలాంటి భావం కలుగుతుంది. ఇలాంటి ఇతివృత్తాలతో కూడిన కథలు తెలుగులో కన్నా ఇతర భాషల్లో ఎక్కువగా రావడం గమనార్హం. ఆధునిక జీవితపు ఒత్తిళ్ళ

ప్రతిఫలనం ఈ కథల్లో ఉంది. జీవితం అందరికీ ఒకేలా ఉండదు. మనుషులు తార్కికంగా, హేతుబద్ధంగా ప్రవర్తించరు. సహేతుకంగా ఉండాలని ఆశించడం తప్పుకాదు. కానీ ఉండలేక పోవడమే జీవిత వాస్తవం. తమలా ఎదుటివారు ఆలోచించాలని, నడుచుకోవాలని మనుషులు ఆశిస్తుంటారు. కానీ అలా ఎవరూ ఉండలేరు. నిజానికి తాము ఎలా ఉండాలనుకుంటున్నామో అలా కూడా ఉండలేరు. కారణాలేమైనా మనుషుల్ని ఉద్వేగాలే నడిపిస్తాయి. అందుకే ఒక తీవ్రతలోంచి మరో తీవ్రతలోకి ప్రయాణిస్తారు. ఈ మనిషి చచ్చిపోతే బావుండును అనుకున్న మనిషి పట్లనే అవ్యాజమైన ప్రేమ కలుగుతుంటుంది. ఇదెలా సాధ్యమని ప్రశ్నకు హేతువు సమాధానం చెప్పదు, జీవితమే దానికి సరయిన జవాబు. ఇలాంటి జీవితసత్యాన్ని చెప్పే కథలు ఈ పుస్తకంలో ఉన్నాయి.

సోమశంకర్ ఎంచుకున్న కథలు చాలా చిన్నవి. అదే సమయాన విషయాన్ని గాఢంగా చెప్పగలిగే కథకుల దృష్టి కారణంగా ప్రతి కథ కళాత్మకంగా వచ్చింది. అనువాదమనగానే క్లిష్టంగా ఉంటుందన్న అపప్రథ ఒకటి ఉంది. అది ఈ కథలకి వర్తించదు. సోమశంకర్ తెలుగువాక్యం సులువుగా ఉంటుంది. భాషలోని సారళ్యం, సంభాషణల్లో సూటిదనం, స్పష్టత కథలకి అందాన్ని ఇచ్చాయి. అనువాదం సృజనాత్మకంగా ఉండాలన్న సూత్రానికి అనువుగా ఉన్నాయి ఈ కథలు. భావానువాదం కావాలేగానీ భాషని యథాతథంగా మరోభాషలోకి తీసుకురావడం అనువాదం కాదు. అనువాదం సృజనాత్మకంగా ఉన్నప్పుడే చదివిస్తుంది. సోమశంకర్‌కి ఈ అవగాహన ఉందని ఈ కథలు తెలియజేస్తాయి. కనుక వీటిని హాయిగా, సులువుగా చదువుకోవచ్చు. పాఠకుడి అనుభవ పరిధిని, ఆలోచనా పరిధిని విస్తృతం చేసే అనువాదప్రక్రియలో సోమశంకర్ ముమ్ముందు మరింతగా రాణించడం తెలుగు సాహిత్య సంపన్నతకు దోహదం చేస్తుంది.

**గుడిపాటి**

# కథాక్రమం


| | | |
|---|---|---|
| 1. | పెరుగన్నం | 9 |
| 2. | సెల్‌ఫోన్ | 13 |
| 3. | హస్తలాఘవం | 18 |
| 4. | ఓ మనిషీ, ఎందుకిలా? | 22 |
| 5. | చెరువు | 27 |
| 6. | బాకి | 34 |
| 7. | బొమ్మ | 38 |
| 8. | అమ్మ వస్తే బాగుండు | 42 |
| 9. | లాటరీ | 45 |
| 10. | మిగిలిపోయినవి | 51 |
| 11. | సున్నాగాడు | 55 |
| 12. | వృత్తిధర్మం | 58 |
| 13. | సందేశము × అనుభవము | 65 |
| 14. | మనీప్లాంట్ | 70 |
| 15. | యమరాజు | 78 |
| 16. | ఆశా నిరాశేనా | 81 |
| 17. | కట్టుకథ | 88 |
| 18. | ఆత్మావలోకనం | 93 |
| 19. | విషవలయం | 100 |

# పెరుగన్నం

**తమిళం : వరలొట్టి రంగసామి**

"ఆ దిక్కుమాలిన న్యూస్‌పేపర్ ఇంకా ఎంతసేపు చదువుతారు? కాస్త ఇక్కడికి వచ్చి మీ గారాల కూతురు ఏదైనా తినేటట్లు చూడొచ్చుగా? సింధు అన్నం తిననని మొండికేస్తోంది. వస్తున్నారా? లేదా?" అంటూ మా ఆవిడ లోపల్నించి అరిచింది. 'చేసేదేముంది' అని అనుకుంటూ పేపరుని మడిచి పక్కనపెట్టి లోపలికివెళ్ళాను. మా ఏకైక కూతురు సింధు బిక్కుబిక్కుమంటూ కూర్చునిఉంది. ఆమె కళ్ళనిండా నీళ్ళు. నాకు జాలేసింది. పాపముందు అంచులదాకా పెరుగన్నంఉన్న ఓ గిన్నె ఉంది.

మామూలుగా సింధు చాలా మంచిపిల్ల. తన వయసుకన్నా, ఎక్కువ తెలివితేటలు ఉన్నాయి. ఆమెకి ఈమధ్యే ఎనిమిదేళ్ళు నిండాయి. వాళ్ళ టీచర్లంతా సింధుని తెగ మెచ్చుకుంటుంటారు. కాని సింధుతో ఉన్న ఒకే ఒక సమస్య ఆమె ఆహారపు అలవాట్లు. సింధు అన్నం తినాలంటే మేమెన్నో కథలు, కబుర్లు చెప్పాలి. 'నీ కది చేస్తాం. ఇది చేస్తాం' అంటూ ఎన్నో ఒట్లు వేయాలి.

ముఖ్యంగా సింధుకి పెరుగన్నం అంటే అయిష్టం. పప్పన్నం, చపాతీలు బాగా ఇష్టంగా తింటుంది. అయితే పెరుగన్నంతోనే చిక్కంతా. కావాలంటే రోజంతా ఖాళీ కడుపుతో అయినా ఉంటుంది కానీ, పెరుగన్నం తినడానికి మాత్రం ఇష్టపడదు. "దానికి పెరుగన్నం తినడం ఇష్టం లేకపోతే, వదిలేయండి. బలవంతం చేయొద్దు. మిగతా పదార్థాలతో కడుపునిండా తింటోంది కదా..." అని నేను నా భార్య మాలతికి, మా అమ్మకి ఎన్నోసార్లు చెప్పాను.

కాని మాలతి, మా అమ్మ ఆ విషయాన్ని అంత తేలిగ్గా తీసుకోలేకపోయారు. "పెరుగు చేసే చలవ ఇంకేదీ చేయదు. ఒంట్లో వేడిని తగ్గిస్తుంది. పెరుగన్నం తినకపోతే, అదే బాధ పడుతుంది...." అంటూ నా నోరు మూయించేవారు. ఆ వాదనలో నిజమెంతో నాకు తెలియదు. వాళ్ళు మొండివాళ్ళు కాబట్టి వాళ్ళ మాటే నెగ్గేది.

నేను నా గొంతు సవరించుకుని, చేతిలో పెరుగన్నం గిన్నె తీసుకుని సింధు దగ్గరికి వెళ్ళాను. బలవంతంగాగాని, శాసించిగాని పాపకి పెరుగన్నం తినిపించలేనని నాకు తెలుసు. ప్రేమతోను, మృదువుగాను ప్రయత్నిస్తే తినిపించవచ్చు.

"చిట్టి తల్లీ, నా కోసం, రెండు ముద్దలు తినమ్మా. నువ్వు పెరుగన్నం తినకపోతే, అమ్మ నన్ను తిడుతుంది. కొట్టినా కొడుతుందికూడా. ప్లీజ్... నాకోసం తినమ్మా...." అని సింధుతో అన్నాను బ్రతిమాలుతూ.

నా మాటలకి మాలతి ముఖం చిటపటలాడడం గమనించాను. కానీ ఏం చేస్తాం? మాలతిని ఉమ్మడి శత్రువుగా చేస్తేకాని సింధు పెరుగన్నం తినేలాలేదు. నా వ్యూహం ఫలించింది. సింధు కళ్ళు తుడుచుకుని, నాతో మాట్లాడసాగింది.

"సరే నాన్నా, నీకోసం... నీకోసమే పెరుగన్నం తింటాను. రెండు ముద్దలు కాదు, మొత్తం గిన్నెంతా తింటాను. కాని నువ్వు... నువ్వు..." అని చెబుతూ సందేహించసాగింది.

"ఓహో. మళ్ళీ ఏదో పెద్ద కోరిక కోరబోతోంది" అని అనుకున్నాను. "నాన్నా. ఈ పెరుగన్నం మొత్తం తినేస్తే, నాకు కావాల్సింది ఇస్తావా?" అని అడిగింది సింధు.

"తప్పకుండా తల్లీ. నీకేం కావాలంటే అదిస్తా" అన్నాను నేను.

"ఒట్టు" అని అంది సింధు చేయిచాపుతూ.

"ఒట్టు" అంటూ నేను సింధు చేతిలో చేయివేసి మాటిచ్చాను. మా ఒప్పందం ఖరారైంది.

"అమ్మని కూడ ఒట్టేయమను" అని అంది సింధు. నేను మాలతికేసి చూసాను. ఆమె విసుగ్గా వచ్చి, సింధు చేతిలో చెయ్యేసి 'ఒట్టు' అని అనేసి, ముఖంలో ఏ భావము కనిపించకుండా వెళ్ళిపోయింది.

మా ఇద్దరి దగ్గర మాట తీసుకుందంటే ఏదో పెద్ద కోరికే కోరబోతోందని నాకు అనిపించింది. 'జాగ్రత్తగా ఉండాలి' అని అనుకున్నాను.

"సింధుపాపా, నీకు కంప్యూటర్ కావాలనిలేదా మీ ఫ్రెండ్ నిత్యకి ఉన్న కీ-బోర్డుకావాలని మాత్రం అడగకూడదేం. అవన్నీ చాలాఖరీదైనవి. నాన్నదగ్గర ప్రస్తుతం అంత డబ్బులేదు. తెలిసిందా?" అన్నాను.

"లేదు నాన్నా. నేను ఖరీదైన వస్తువులేవి అడగను. సరేనా?" అని అంది.

"అయితే సరే, నేనూ నా మాట నిలబెట్టుకుంటాను..." అన్నాను నేను.

"నాన్నా, పెరుగన్నం పెట్టేయ్" అంది నా కూతురు నోరు తెరిచి. నేను ఓ చెంచా నిండా పెరుగన్నం తీసి పాప నోట్లో పెట్టాను.

ఒక్క ముద్ద పెరుగన్నం తినడం కూడ పాపకెంత కష్టమో నా కళ్ళారాచూశాను. ఆమె ముఖం ఎర్రబడింది. కళ్ళలో నీళ్ళు తిరిగాయి. బహుశా తినడం మానేస్తుందేమో అని నాకనిపించింది. కాని సింధు ఎంతో ఓర్పుతో, ఆ ముద్దని మెల్లిగా నమిలి మింగింది. ఈ దృశ్యం చూశాక ఇంత అందమైన పాపకి తను అసహ్యించుకునే పదార్థాన్ని బలవంతంగా తినిపిస్తున్నందుకు-నాకు మాలతి పైనా మా అమ్మ మీదా కోపం వచ్చింది. ఇబ్బంది పడుతూనే, మెల్లగా మొత్తం పెరుగన్నం తినేసింది సింధు.

తర్వాత నా ఒళ్ళోకూర్చుంది. ఆమె కోరిక ఏమిటో తెలుసుకోవాలని నేను తహతహలాడి పోతున్నాను. ఎంత కష్టమైన కోరికైనా తీర్చేయాలని నిర్ణయించుకున్నాను. మా అందరి చూపులు సింధుపైనే ఉన్నాయి.

"నాన్నా, నేను గుండు చేయించుకోవాలనుకుంటున్నాను. అది కూడా ఈ ఆదివారం లోపే"

అంది సింధు.

"దారుణం! ఆడపిల్ల గుండు చేయించుకోవడమా? కుదరదు" అని అరిచింది మాలతి.

"మన వంశంలో అటు ఏడు తరాలు, ఇటు ఏడు తరాలలో ఏ ఆడపిల్లా ఇటువంటి అప్రాచ్యపు పని చేయలేదు" అంది మా అమ్మ. మళ్ళీ తనే మాట్లాడుతూ, "అయినా ఆ పాడు కేబుల్ టి.వి. చూసి పిల్లలు పాడయిపోతున్నారు. ఆ దరిద్రపు చానళ్ళలో గుండు చేయించుకుని పాటలు పాడే అమ్మాయిలను చూసి ఇదిలా తయారైంది. మన సంస్కృతిని ఈ కేబుల్ టి.వి. పాడుచేస్తోంది. అది గుండు చేయించుకోవడానికి వీల్లేదు..." అంది.

నేను సింధువైపు తిరిగాను.

"సింధు పాపా, నిన్ను జుట్టు లేకుండా ఊహించుకోవడానికి కష్టంగా ఉందమ్మా. ఇంకోటి ఏదైనా అడుగు. నీకు కంప్యూటర్ అయినా, కీ-బోర్డు అయినా కొనిపెడతాను..." అన్నాను అనునయంగా.

"వద్దు నాన్నా, నాకు అవేవీ వద్దు".

"ప్లీజ్ సింధు. నా మాట వినమ్మా..." అన్నాను. సింధు కళ్ళ నీళ్ళ పర్యంతమై పోయింది.

"నాన్నా, పెరుగన్నం తినడం నాకెంత కష్టమో, నువ్వే స్వయంగా చూశావు. నాకు కావల్సింది ఇస్తానని నువ్వే చెప్పావు. ఇప్పుడేమో నువ్వు మాట తప్పుతున్నావు. నాకు హరిశ్చంద్రుడి గురించి చెప్పింది నువ్వే. ఆ కథలోని నీతి ఏంటి? ఒకసారి మాట ఇచ్చాక, ఎంత కష్టమైనా దాన్ని నిలబెట్టుకోవాలనే కదా! కాని ఇప్పుడు నువ్వే... నువ్వే...." అంటూ ఏడవసాగింది.

ఇక నేనో నిర్ణయం తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని తోచింది. కళ్ళ నిండా నీళ్ళతో సింధు నన్ను అలా ప్రశ్నించడం నేను భరించలేకపోయాను. మాలతి వైపు తిరిగి, "మాలతీ, మనం మాట తప్పడానికి వీల్లేదు. ఈసారి సింధు కోరిక తీర్చాలి తప్పదు" అని అన్నాను.

"మీకేం మతిపోలేదు కదా?" అంది మాలతి విస్తుపోతూ.

"ఒరే నువ్వు మన సాంప్రదాయాలని మంట కలుపుతున్నావు..." అంది మా అమ్మ.

"ఓసారి మాట ఇచ్చాక, నిలబెట్టుకోవాలి. ఇప్పుడు మనం సింధుకిచ్చిన మాట నిలబెట్టుకోవాలి. లేకపోతే, భవిష్యత్తులో అది ఎన్నడూ మాటపై నిలబడదు. ఈ విషయంలో నేను కూడా సింధు వైపే. సరే సింధు, నీ కోరిక ప్రకారమే చేద్దాం. కళ్ళు తుడుచుకుని వెళ్ళి పడుకో" అన్నాను నేను.

H H H

ఆదివారం పొద్దున్నే నేను సింధు కోరిక తీర్చాను. గుండుచేయించుకున్నాక, సింధు నా గదిలోకి వచ్చింది. ఆమె రూపం కొత్తగా అనిపించింది. గుండ్రటి ముఖం, పెద్దపెద్ద కళ్ళతో సింధు మరింత అందంగా కనిపించింది. పాపని దగ్గరకు తీసుకుని తనకోసం కొన్న ఓ కొత్తగౌను, చాక్లెట్ ఇచ్చాను.

తర్వాత 'గుండు' కోసం సింధు అంతగా ఎందుకు పట్టుబట్టిందో తెలుసు కోవాలనుకున్నాను. కానీ ఓ చిరునవ్వు, అస్పష్టమైన జవాబు తప్ప, సింధు అసలు కారణం బయట పెట్టలేదు. బహుశా

స్కూల్‌కీ, గుండుకీ ఏమైనా సంబంధం ఉందేమో అని తోచింది. స్కూలులో కనుక్కోవాలని అనుకున్నాను.

మర్నాడు పాపని నా బైక్ మీద బడిలో దింపాను. సింధు వెనక్కి తిరిగి నాకేసి చేయి ఊపుతూ, తన తరగతి గదికి వెళ్ళసాగింది. ఇంతలో ఓ కారు వచ్చి ఆగింది. అందులోంచి దిగుతున్న ఓ అబ్బాయి సింధుని చూశాడు.

"సింధుజా, ఆగు నేనూ వస్తున్నాను..." అంటూ అరిచాడు. సింధూ వెనక్కి తిరిగి ఆ అబ్బాయిని చూసింది. ఆగి అబ్బాయి కోసం నిలుచుంది. ఆ అబ్బాయి కూడా గుండుతో ఉన్నాడు.

"ఇదేదో కుర్రతనపు చేష్టలా ఉంది" అని అనుకుంటూ నా బండిని వెనక్కి తిప్పి స్టార్ట్ చేయబోయాను. అంతలో...

"మీ అమ్మాయి సింధూది చాలా గొప్ప మనసండి" అని ఎవరో స్త్రీ అనడం వినిపించింది. తనని తాను పరిచయం చేసుకోకుండానే, గలగలా మాట్లాడసాగింది. "మీ పాపతో నడుస్తున్నది మా అబ్బాయి హరీశ్. వాడు 'లుకేమియా'తో బాధపడుతున్నాడు...." అంటూ పొంగుకొస్తున్న కన్నీళ్ళను తుడుచుకోసాగింది.

"క్రిందటి నెల మొత్తం హరీశ్ బడికి రాలేదు. కిమోథెరపీ, రేడియేషన్ ట్రీట్‌మెంట్ తీసుకున్నాడు. మా అదృష్టం, దేవుడి దయవల్ల రోగం కాస్త నయమైంది. డాక్టర్లు బడికి వెళ్ళొచ్చని చెప్పారు. క్రిందటి వారం అద్దంలో తన ముఖం చూసుకుని హరీశ్ చాలా దిగులు పడ్డాడు. జుట్టంతా రాలిపోయినందుకు ఏడ్చాడు. పిల్లలు ఏడిపిస్తారంటూ, స్కూల్‌కి వెళ్ళనని మొరాయించాడు. "మీ క్లాసులో నీ బెస్ట్ ఫ్రెండ్‌తో మాట్లాడి చూడు...." అని సలహా ఇచ్చాను. మావాడు సింధుతో మాట్లాడాడు. ఆమె "అలాంటివి ఏవీ జరగకుండా చూస్తాను. భయపడకుండా స్కూల్‌కి రా" అని చెప్పిందట. మీ పాపవి రోగికి సాంత్వన చేకూర్చడానికి చెప్పిన మాటలుగానే నేను భావించాను. కాని ఇప్పుడు నిజం తెలిసింది. మా అబ్బాయి కోసం సింధు అంత చక్కటి జుట్టును త్యాగం చేస్తుందని నేను ఊహించలేదు. ఇంత నిస్వార్థంగా స్నేహం చేసే పాపని నేనెక్కడా చూడలేదు. ఇటువంటి కూతురుని కనడానికి మీరు, మీ భార్యా ఎన్నెన్ని జన్మలపాటు తపస్సు చేసుంటారో..." అంటూ చెప్పుకొచ్చిందావిడ.

నా కళ్ళలో నీళ్ళు తిరుగుతుండగా, సింధూ వెళ్ళిన వైపే చూడసాగాను. పెరుగన్నం ముద్ద నోట్లో పెట్టుకుని, దాన్ని నమిలి మింగడానికి కష్టపడ్డ సింధు ముఖమే నాకు గుర్తురాసాగింది.

"నా చిట్టి తల్లీ, నీకింత దయా, ప్రేమా ఎక్కడి నుంచి వచ్చాయమ్మా? ఈ నాన్నకి ఓ వరం ఇస్తావా? మళ్ళీ జన్మంటూ ఉంటే నీకు కొడుకుగా పుడతాను. నిష్కల్మషమైన ప్రేమని పంచడం నాకు నేర్పు తల్లీ!" అంటూ నేను నిస్సిగ్గుగా వెక్కి వెక్కి ఏడవసాగాను.

*(ఆదివారం అనుబంధం - ఆంధ్రజ్యోతి 16 జూలై 2006)*

***'పెరుగన్నం' కథకి మూలం* The Promise *అనే ఆంగ్ల కథ. మూలకథ 27.07.03 నాటి డెక్కన్‌హెరాల్డ్ దినపత్రిక యొక్క ఆదివారం అనుబంధంలో ప్రచురితమైంది.***

# సెల్‌ఫోన్

ఆంగ్లం : శిశిర్ మోహన్

విమానాశ్రయం చేరగానే నేను నా చుట్టూఉన్న పరిసరాలను ఆత్రుతగా చూశాను. నేనెక్కాల్సిన విమానం బయల్దేరడానికి ఇంకా సమయం ఉంది. నా సెల్‌ఫోన్ బయటకు తీశాను.

చిన్నగా నవ్వుకుంటూ, "అమ్మయ్య! ఇంక మూడు కాల్స్ చేస్తే చాలు, ఈ రోజుకి పనయి పోతుంది. హాయిగా, విశ్రాంతిగా కూర్చుని ప్రయాణాన్ని ఆస్వాదించవచ్చు.

వాల్ స్ట్రీట్ జర్నల్ చదువుకుంటూ, ఉప్పు శనగలు తింటూ, చల్లటి బీరు తాగుతూ వీకెండ్‌లో జరిగే ఫుట్‌బాల్ మ్యాచ్‌ని ఎలా చూడాలో ప్లాన్ చేసుకోవచ్చు..." అని అనుకున్నాను.

కాని నా మొబైల్‌ని ఆఫ్ చేయగానే, చార్జింగ్ అయిపోయినట్లు సూచించింది.

"ఓహ్!" అని విసుగ్గా అనుకున్నాను. నాకు చిరాగ్గా ఉంది.

చేతిలో సెల్‌ఫోన్ ఉండి కూడ ఇతరులతో మాట్లాడలేకపోవడం ఎంత దారుణం? నేను తొందరగా ఒక ప్లగ్ పాయింట్‌ని వెతుక్కోవాలి... తొందరగా! సుశిక్షితులైన నా కళ్ళు ఒక మూలగా ఉన్న టేబుల్‌ని, దాని పక్కనే ఉన్న ప్లగ్ పాయింట్‌ని పసిగట్టాయి.

"ఆహా. మంచి స్థలం. నేను చార్జింగ్ చేసుకోడమే కాదు, కాసేపు ఏ ఆటంకాలు లేకుండా పనిచేసుకోవచ్చు" అనుకున్నాను. ఆ స్థలం కోసం ఇంకెవరైనా పోటీ పడుతున్నారా అని అటు ఇటూ చూశాను. ఓ లావుపాటి వ్యక్తి అదే టేబుల్‌వైపు రావడం కనిపించింది. అంతే! నేను బాణంలా దూసుకుపోయాను. ఆ టేబుల్‌ని ఆక్రమించడం, చార్జింగ్ చేయడం కోసం వైరుని ప్లగ్ పాయింట్‌లో పెట్టడం క్షణాలలో జరిగిపోయాయి. ఆ లావుపాటి వ్యక్తి విస్తుపోయాడు. నేను ఓ నవ్వు నవ్వి, భుజాలెగరేసాను. మరేం చేయను? ఇది క్రూరమైన ప్రపంచం. బలమూ, చొరవ ఉన్నవాడిదే రాజ్యం ఇక్కడ. విజయగర్వంతో నా మొబైల్ ఆన్‌చేసి నా ఆఫీస్‌కి ఫోన్‌చేశాను. అక్కడ నా సెక్రటరీ ఫోనెత్తింది.

"హాయ్ జెన్నీ. ఏంటి విషయాలు?" అని అడిగాను.

"పరిస్థితులు దారుణంగా ఉండబోతున్నాయి" అందామె పరాకుగా.

"ఏం జరిగింది?" అని అడగబోయి మానుకున్నాను. ఎందుకంటే ఇదివరకొకసారి ఇదే ప్రశ్నవేస్తే, తన భర్తా, అతడి మాజీ ప్రేయసిల వ్యవహారం గురించి సుదీర్ఘమైన ఉపన్యాసం ఇచ్చింది. ఆ సంఘటనని జ్ఞాపకం తెచ్చుకుని, "నాకేమైనా ఫోన్లు వచ్చాయా? తర్వాత జాన్‌కి కనెక్షన్ ఇవ్వు"

అని అన్నాను. బహుశా ఆమె నాతో ఏదో చెప్పాలనుకున్నట్లుంది. "అలాగే" అంటూ నాకొచ్చిన ఫోన్ల వివరాలు చెప్పసాగింది. ఆమె స్వరంలో నిరాశ ధ్వనించింది.

ఇంతలో నా పక్కనే కూర్చుని ఉన్న ఓ వ్యక్తి గట్టిగా అరిచాడు.

"ఆపండి" అంటూ నాకేసి వేలు చూపిస్తూ, "ఆ దరిద్రపు ఫోన్‌లో మాట్లాడడం ఆపండి" అని మళ్ళీ అరిచాడు.

అతడికేసి ఆశ్చర్యంగా చూశాను. అతడిది ఎర్రజుట్టు, పొడవైన ముక్కు, అసహనం తొణికిసలాడే ముఖం.

"చెప్పండి, ఏంటీ మీ సమస్య?" అని అన్నాను ఏం మాట్లాడాలో తెలియక.

అతడు మరింత విసుగ్గా, "ఇప్పుడు నేనన్నది వినపడలేదా?" అని అన్నాడు. అతడి ముక్కు పుటాలు అదురుతున్నాయి. "ఆ ఫోన్‌లో మాట్లాడడం ఆపండి" అని ఇంకోసారి అరిచాడు.

"నేను తర్వాత ఫోన్ చేస్తాను" అని జెన్నీకి చెప్పి ఫోన్ కట్టేశాను. ఈ సంభాషణంతా ఆమె విని ఉండకపోవచ్చు. విన్నదంటే మాత్రం, మా ఆఫీసులో చాలామందికి కాఫీ మిషన్ దగ్గర మాట్లాడుకుంటూ నవ్వుకోడానికి మంచి టాపిక్ దొరికినట్లే.

మరుక్షణం నా దృష్టిని ఈ ఎర్రటి జుట్టు వ్యక్తివైపు మరల్చాను.

"సరే, నేను నా సెల్‌ఫోన్‌లో ఎందుకు మాట్లాడకూడదు? ఇక్కడ అలాంటి నియమం ఏదైనా ఉందా?" అని అతడిని అడిగాను.

"నా చుట్టుపక్కల ఎవరూ సెల్‌ఫోన్‌లో మాట్లాడడం నాకిష్టం ఉండదు. సెల్‌ఫోన్లంటే నాకు అసహ్యం. మీరెళ్ళి ఇంకెక్కడైనా కూర్చోవచ్చు కదా?, ఇక్కడ చాలా కుర్చీలు ఖాళీగా ఉన్నాయి..." అని అన్నాడతను రొప్పుతూ.

"బాగుంది వరస. ప్లగ్ పాయింట్ ఉందని నేనిక్కడ కూర్చున్నాను" చెప్పాను నేను కొంచెం కోపంగా.

"లేచి వెతుక్కోండి, ప్లగ్ పాయింట్లు ఇంకా చాలా చోట్ల ఉంటాయి" అని అన్నాడతను.

"ఆ పనేదో మీరే చెయ్యచ్చుగా, ఎయిర్‌పోర్టులో ఇంకా చాలా కుర్చీలు ఖాళీగా ఉన్నాయి" అని అన్నాను. నాకేమో ఓ పక్క బి.పి. పెరిగిపోతోంది.

"కాని మీకన్నా ముందుగా ఇక్కడికి వచ్చి కూర్చున్నది నేను..." అని అన్నాడతడు.

"అయితే ఏంటి? నేను నా పని పూర్తయ్యేదాక..." ఇంకా నా మాటలు పూర్తి కాలేదు, 'ధబ్'మన్న శబ్దం వినిపించింది. ఆ మనిషి కింద పడిపోయాడు. అతడి కాళ్ళు చేతులు కొట్టుకుంటున్నాయి. ముఖం ఎర్రబడింది. పెదాలు వణుకుతున్నాయి.

అతడికి 'గుండెపోటు' వచ్చేలా ఉందని నాకు తోచింది. ఇద్దరు ముగ్గురు గుమిగూడారు.

"మీరంతా నన్నెందుకు చుట్టుముట్టారు? ఇక్కడ్నించి వెళ్ళిపోండి" అని అరిచాడు ఆ వ్యక్తి.

"దయచేసి నా స్థలం నాకివ్వండి" అని ప్రాధేయపడ్డాడు.

నాకింకా కోపం తగ్గలేదు. "నేనిక్కడే ఉంటాను. సెల్‌ఫోన్‌లో మాట్లాడతాను..." అని అన్నాను ఉడుక్కుంటూ.

చిన్నపిల్లాడిలా మాట్లాడుతున్న నాకేసి ఓ క్షణం నిరసనగా చూశాడు. తర్వాత లేచి కుర్చీలో కూర్చున్నాడు.

"అవును. నేనిక్కడే ఉంటాను. ఏం చేస్తారు? సెక్యూరిటీ గార్డులను పిలుస్తారా? నాకు తెలిసినంతవరకు, ఎయిర్‌పోర్టులలో సెల్‌ఫోన్‌లలో మాట్లాడకూడదన్న నియమం ఏదీ లేదు..." అని అన్నాను నేను బింకంగా.

"చూడండి, నేను నియమాల గురించి మాట్లాడడంలేదు. సభ్యత గురించి మాట్లాడుతున్నాను. సెల్‌ఫోన్లు ఈ ప్రాంతాన్ని పాడు చేస్తున్నాయి. ఇతరులు సెల్‌ఫోన్లలో మాట్లాడుతుంటే, పక్కవాళ్ళకి శ్వాస పీల్చుకోవడం కూడా కష్టమైపోతోంది. దయచేసి నా స్థలాన్ని నాకివ్వండి. కాస్త ప్రశాంతతకి నోచుకోనివ్వండి. వెళ్ళి ఇంకో కుర్చీలో కూర్చోండి" అని అన్నాడతడు.

"మీ సొంత స్థలం కావాలంటే, మరో దేశం వెళ్ళండి భారతదేశానికి వెడితే తెలుస్తుంది. అక్కడ జనాలతో కిక్కిరిసిన ప్రాంతాలలో తిరగడం ఎంత కష్టమో!" అని అందామని నోటిదాకా వచ్చింది. కాని ఆపుకున్నాను. ఈ సంభాషణని ఇంకా పొడిగించడంలో అర్థంలేదు. ఇతగాడితో మాట్లాడుతూ కూర్చుంటే, నా పన్లన్నీ ఆగిపోతాయి. పైగా నేను ఇంకా కొన్ని ముఖ్యమైన ఫోన్లు చేయాలి.

"సరే సరే! మీరు గెలిచారు. మీ స్థలంలో మీరే ఉండండి" అని నేను ప్లగ్‌పాయింట్ లోంచి వైరు తీసేశాను. కొన్ని నిముషాల తర్వాత ప్లగ్ పాయింట్ ఉన్న మరో టేబుల్‌ని వెదుక్కొని, నేను మాట్లాడవలసిన వాళ్ళందరితోనూ మాట్లాడేశాను. ఇక ఈ-మెయిల్స్ చూసుకోవడమే తరువాయి.

కాని అదే తప్పయిపోయింది. లాప్‌టాప్ తెరచి మెయిల్స్ చూసుకోగానే నాకు చెమటలు పట్టాయి. నా బాస్ నాకో అర్జెంట్ మెయిల్ పంపాడు. కొంతమంది క్లయింట్లు నాతో వెంటనే మాట్లాడాలని అడుగుతున్నారు. నా టీంలోని ఒక ఇంజనీరు రాజీనామా చేశాడు. వీటన్నింటిని మించిన వార్త. నా సెక్రటరీ జెన్నీ జాన్‌పై లైంగిక వేధింపుల నేరం కింద కేసు వేయబోతోందిట.

దయారహితమైన కంప్యూటర్ తెరకేసి చూస్తూ, నిస్సహాయంగా... "దేవుడా" అని అనుకున్నాను.

తర్వాత ఓ అరగంట పాటు క్షణం తీరిక లేకుండా గడిపాను. మా బాస్‌తోను, క్లయింట్లతోను, తోటి ఉద్యోగులతోను కనెక్టయి ఉన్నాను. సెల్‌లో మాట్లాడడం కాని, ఈ-మెయిల్స్ పంపడం గాని చేశాను. నా బుర్ర బద్దలయ్యేలా ఉంది.

"అమ్మయ్య! అన్నీ సర్దుకున్నాయి" అని అనుకున్నానో లేదో... ట్రింగ్ ట్రింగ్ మంటూ నా

సెల్‌ఫోన్ మోగింది.

"దరిద్రపు మొహమా, ఛీ" అంటూ సెల్‌ఫోన్‌ను దూరంగా తోసాను. ప్లగ్ పాయింట్ నుంచి వైరుని తీసేసాను. "నా మానాన నన్నొదిలేయ్! కాస్త ప్రశాంతంగా ఉండనివ్వు" అని అంటూ సెల్‌ఫోన్‌ని ఓ భూతంలా చూస్తూ అరిచాను.

ఈ మాటలు నా నోట్లోంచి రాగానే హఠాత్తుగా నాకు ఇందాకటి ఎర్ర జుట్టు వ్యక్తి గుర్తొచ్చాడు. అతడన్న మాటలు ఎంతో నిజం. మనం, మనుషులం, మన ఉనికిని కోల్పోయాం. మనమే సృష్టించిన ఎలెక్ట్రానిక్ వస్తువులకి బానిసలమైపోయాం. సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు, ఇంటర్‌నెట్ ఇప్పుడు మన జీవితాలని శాసిస్తున్నాయి.

నా విమానంలోకి ప్రయాణీకులు ఎక్కడం ప్రారంభించారు. ఒకప్పుడు పిలుచుకున్న ఫస్ట్‌క్లాస్, సెకండ్‌క్లాసులు ఇప్పుడు విమానాలలో లేవు. ఇప్పుడంతా 'డైమండ్' 'గోల్డ్' లేదా 'సిల్వర్' కేటగిరిలే. ఇంకొన్ని విమానాలలో సీట్లకు ఖరీదైన జాతిరత్నాల పేర్లు కూడ పెడుతున్నారు. నేను కూడా క్యూలో నిలుచున్నాను. నా కళ్ళు తెరిపించిన ఆ ఎర్రజుట్టు వ్యక్తికి కృతజ్ఞతలు చెబుదామని అటు ఇటూ చూశాను. కాని అతడి జాడలేదు. అతడు ఇవ్వాల్సిన సందేశాన్ని అందించి అదృశ్యమైపోయాడు కాబోలు.

దారిపొడవునా నాకు కొత్తగా కలిగిన జ్ఞానోదయం గురించే ఆలోచించాను. వృత్తి జీవితానికీ, వ్యక్తిగతజీవితానికి ఈమధ్య ఉండాల్సిన విభజనరేఖ క్రమంగా చెరిగిపోతోంది. ఈ సమకాలీన సంస్కృతికి నేను 'సాంకేతిక బానిసత్వం' అనే కొత్తపేరు పెట్టాను. ఆఫీసులో కాని, ఇంటిలోకాని, మరెక్కడైనా ఉండండి. జరుగుతున్నదంతా–'ఎల్లప్పుడూ కనెక్టెడ్!' కాని నిజానికి మనం అందరితోను కనెక్ట్ అయి ఉంటున్నామా? ప్రతి ఒక్కరితోను – మన కుటుంబ సభ్యులతోను, తోటి ఉద్యోగులతోను, సాటి మనుషులతోను మనసు విప్పి మాట్లాడుతున్నామా? ఒకరితో ఒకరం సన్నిహితంగా ఉండగలుగుతున్నామా? మన హృదయాలకీ, చేతలకీ పొంతన ఉంటోందా? ఇలా ప్రశ్నించుకుంటూ పోతే వచ్చిన జవాబులు నన్ను మరింత అశాంతికి గురిచేశాయి.

H H H

ఇల్లు చేరాక ఎప్పటిలా సెల్‌ఫోన్‌ని, కంప్యూటర్‌ని ఆన్ చేయలేదు. నా భార్యని, నా నాలుగేళ్ళ కొడుకుని పలకరించాను. వాళ్ళతో కులాసాగా కబుర్లు చెప్పసాగాను.

"నాతో మాట్లాడు నాన్నా" అంటూ మా అబ్బాయి నా చెవి మెలిపెట్టాడు.

"చెప్పరా బాబు" అన్నాను చెవిని రుద్దుకుంటూ.

"నీ పుట్టినరోజు కోసం, నేను అమ్మ ఓ మంచి బహుమతి తెచ్చాం" అన్నాడు గారంగా.

"నిజంగానా?" అంటూ నేను మా ఆవిడ కేసి చూశాను. "ఏం కొన్నారేంటి?" అని అడిగాను. బహుశా నేను ఎప్పటినుంచో కోరుకుంటున్న తేలికపాటి టైటానియం టెన్నిస్ రాకెట్ అయి ఉంటుంది.

ఎందుకంటే దీని గురించి నేను నా భార్యతో రెండు మూడుసార్లు అన్నాను. కాని మా ఆవిడకి క్రీడాసామాన్లపై పెద్దగా ఆసక్తి లేదు. కాబట్టి టెన్నిస్ రాకెట్ కొని ఉండకపోయినా ఆశ్చర్యపో నక్కరలేదు.

"ఊహించండి" అని అంది మా ఆవిడ. నా పుత్రుడేమో వచ్చీరాని మాటలతో ఆ బహుమతిని వర్ణించడానికి అవస్థ పడుతున్నాడు. నేనేమో ఉత్సుకత ఆపుకోలేక పోయాను.

నా భార్య లోపలి గదిలోకి వెళ్ళి, కాసేపటి తర్వాత ఓ చిన్న పాకెట్‌తో ప్రత్యక్షమైంది. చిన్న పిల్లాడిలా దాన్ని గుంజుకుని చూశాను. బాక్సు మరీ చిన్నదిగా ఉంది. అది ఖచ్చితంగా టెన్నిస్ రాకెట్ అయి ఉండదు.

"తెరచి చూడు నాన్నా", అంటూ మా అబ్బాయి గోల పెట్టసాగాడు. నేను నిరాశగా దాన్ని తెరవసాగాను.

నా భార్య నా నిరుత్సాహాన్ని గ్రహించినట్లుంది. "ఏవండీ, మీకు నచ్చలేదా?" అని అడుగుతోంది.

కాని ఆ బహుమతిని చూడగానే నేను మంత్రముగ్ధుడినైపోయాను. దాన్ని చేతిలోకి తీసుకుంటూ, "చాలా బాగుంది. అద్భుతంగా ఉంది" అని అన్నాను. అది సన్నటి, నాజూకైన లేటెస్ట్ మోడల్ సెల్‌ఫోన్ పరికరం.

"మీరు చాలాసార్లు అంటుండేవారు కదా, సన్నని వెబ్ యాక్సెస్ ఉన్న లేటెస్ట్ సెల్‌ఫోన్ ఉంటే బాగుంటుందని. అందుకని మీకు పుట్టిన రోజు కానుకగా కొన్నాను..." చెప్పింది మా ఆవిడ.

"అవును. మొత్తానికి సాధించావు" అని అన్నాను పరాకుగా. ఎయిర్‌పోర్టులో తారస పడిన ఎర్రజుట్టు వ్యక్తిని, నాకు కొత్తగా కలిగిన జ్ఞానోదయాన్ని తాత్కాలికంగా మరచి పోయాను.

లేత నీలంరంగులో మెరుస్తున్న ఆ సెల్‌ఫోన్‌ని సంభ్రమంగా చూడసాగాను. చాలా మృదువుగా ఉందది. దానికేసి మరోసారి చూసాను. చాలా అద్భుతంగా ఉందది.

ఇంక నన్ను నేను ఆపుకోలేకపోయాను. వెంటనే దాన్ని పరీక్షించాలని నిర్ణయించు కున్నాను. సిమ్‌కార్డువేసి మా ఆఫీసుకి ఫోన్ చేశాను. "నాకేమైనా ఫోన్లు వచ్చాయా?" అని అడిగాను. తర్వాత సెల్‌ఫోన్ నుంచే ఈ-మెయిల్స్ చూసుకోసాగాను.

ఇందాక చెప్పినట్లు ఇదంతా - "ఎల్లప్పుడూ కనెక్టెడ్"గా ఉండడమే. మనం బానిసలం... అలవాట్లకీ కూడ!

**(ఆదివారం అనుబంధం, వార్త 9 ఏప్రిల్ 2006)**

**'సెల్‌ఫోన్' కథకి మూలం** Staying Connected **అనే ఆంగ్ల కథ.**
**మూలకథ** www.kenagain.freeservers.com **అనే వెబ్‌సైట్‌లో ప్రచురితమైంది.**

# హస్త లాఘవం

ఆంగ్లం : జె.బి.ప్రభాత్

ఆ మెజీషియన్ ప్రవేశించేవరకు హోటల్‌లో సాధారణమైన వాతావరణమే ఉంది. ఈ హోటల్‌కి ఎక్కువగా కుటుంబసమేతంగా వస్తూంటారు. భోజనాల సమయంలో చిన్న చిన్న మాటలు తప్ప, వేరే శబ్దాలు ఉండవు. ఎటువంటి హడావుడి, హంగామాలని ఇష్టపడని సంప్రదాయ కుటుంబాల వాళ్ళు ఈ హోటల్‌కి తమ పిల్లలతో సహా వస్తుంటారు. పరిశుభ్రమైన పరిసరాలు, రుచికరమైన ఆహారం, ఏకాంతానికి భంగం కలిగించని వెయిటర్ల మర్యాదపూర్వకమైన ప్రవర్తన ఇక్కడ భోజనం చేయడాన్ని ఓ మంచి అనుభవంలా చేస్తాయి. ఇదే ఆ హోటల్ ప్రత్యేకత.

అటువంటి ఈ హోటల్ అతిథులందరూ ఒక చిన్న ప్రకటనతో విస్తుపోయారు. హెడ్-వెయిటర్ తన పక్కన నిల్చున్న వ్యక్తిని చూపిస్తూ అతడో మెజీషియన్ అని, ఈరోజు కొన్ని అద్భుతమైన గారడీలు చేస్తాడని ప్రకటించాడు. అతిథులందరూ మెజీషియన్‌కేసి చూశాడు. అతడు నల్లగా, పొడుగ్గా ఉన్నాడు. అతడి మీసం పొడుగ్గా ఉండి, రెండు వైపులా మెలివేసి ఉంది. అతడు పూర్తిగా నల్లటి బట్టలు ధరించి ఉన్నాడు. మోకాళ్ళ క్రిందవరకూ వచ్చేలా పెద్ద నల్లకోటు వేసుకున్నాడు.

"సభకు నమస్కారం! ఇది మీరు ఎప్పుడూ చూసే మామూలు మ్యూజిక్ షో కాదు. సంగీతంతోను, విద్యుత్ అలంకరణతోను ఉన్న వేదికపైన నేను ప్రదర్శన ఇవ్వడంలేదు. గతంలో మీరు కొన్ని ప్రదర్శనలలో మెజీషియన్లు మనుషులని గాలిలో తేలేలా చేయడం చూసి ఉంటారు. అదేం పెద్ద విద్య కాదు. వెనుక నుంచి మెజీషియన్ అసిస్టెంట్లు చిన్న క్రేన్ ద్వారా మనుషుల్ని గాలిలో లేవుతారు. అంతే! అలాగే మరొక అంశం ఉంది. వేదికపైన ఖాళీ పెట్టెని ఉంచుతారు. ఓ అమ్మాయి అందులో దూరి కూర్చుంటుంది. పెట్టెని గుడ్డతో మూస్తారు. తర్వాత చిన్నగా టపాకాయలు పేలుస్తారు. మెల్లగా ఆ గుడ్డని తొలగిస్తే, అక్కడ అమ్మాయి బదులు పులి ఉంటుంది. ఇది మీకందరికీ అద్భుతంలా తోస్తుంది. కాని మీకు తెలియని అసలు సంగతి ఏమిటంటే ఆ పెట్టెలో రెండు అరలు ఉంటాయి. ఒక అరలో పులి ఉంటుంది. రెండో అరలోకి అమ్మాయి వెళ్ళిపోతుంది. తెలివైన సహాయకులు, మిరుమిట్లు గొలిపే విద్యుత్‌కాంతులు, యంత్ర పరికరాలు... ఇవన్నీ కలిపి ప్రేక్షకులను విస్తుపోయేలా చేస్తాయి. అనుకూలమైన పరికరాలతో నిండిన వేదిక, దానికీ ప్రేక్షకులకీ మధ్య ఉన్న దూరం - ఈ రెండూ కలిసి మిమ్ములను మాయచేస్తాయి. అంతే!" అని చెప్పాడు మెజీషియన్.

తర్వాత తన రెండు చేతులను బార్లాజాపి ప్రేక్షకులకి చూపించాడు. "నా దగ్గర ఎటువంటి

యంత్రపరికరాలు లేవు. నేను వేదికపైన లేను. సహాయకులు లేరు. అన్నింటినీ మించి మనమధ్య దూరం ఉండదు. మీ బల్లలవద్దకి వచ్చి మీ ఎదురుగానే కొన్ని అంశాలను ప్రదర్శిస్తాను" అని చెప్పాడు.

మొదటి బల్ల వద్దకి వచ్చి ఒక పేకల కట్ట బయటకు తీశాడు. అక్కడ కూర్చున్న ఓ పిల్లాడిని అందులోంచి ఓ పేకముక్కని తీసుకోమన్నాడు. ఆ పిల్లాడు అలాగే చేశాడు. మెజీషియన్‌కి తప్ప మిగిలిన వారందరికీ అది 'ఇస్పేట్ రాజు' అని కనబడింది.

"దాన్ని మళ్ళీ కట్టలో పెట్టేయ్" అని అన్నాడు మెజీషియన్ పిల్లాడితో.

ఆ పిల్లాడు 'ఇస్పేట్ రాజు'ను మిగతా పేకలపై బొమ్మ కనబడకుండా బోర్లించాడు. ఆ పేకల కట్టని మెజీషియన్ కలగాపులగం చేశాడు. ఇప్పుడు ఆ పిల్లవాడి తండ్రిని అన్నింటికంటే పైముక్కని తీయమని అడిగాడు.

ఆయన దాన్ని చేతిలోకి తీసుకోగానే, దాన్ని చిన్న చిన్న ముక్కలుగా చేయమని అడిగాడు.

ఆయన అలాగే చేసి, ఆ ముక్కలని మెజీషియన్ చేతిలో పెట్టాడు.

"ఇప్పుడు నువ్వు తర్వాతి పేకని తియ్యి" అని మెజీషియన్ పిల్లాడిని అడిగాడు.

ఆ పిల్లాడు పేకముక్కని పైకి తీసి అందరికీ చూపించాడు. అది 'ఇస్పేట్ రాజు' అంతే! అందరూ చప్పట్లు కొట్టారు.

"ఇది గొప్ప ట్రిక్ అని మీరనుకుంటున్నారా?" అని ప్రేక్షకులని అడిగాడు మెజీషియన్.

వాళ్ళంతా తలూపారు.

"కాని ఇది కేవలం హస్తలాఘవం. అంతే. ఆ అబ్బాయి పేకతీసి పెట్టేశాక, నేను పేకల్ని కలగాపులగం చేశాను కదా. అప్పుడు నా చేతిలో మరో పేక ముక్క ఉంది. దాన్ని మీరు గమనించకుండా అన్నిటికన్నా పైన పెట్టాను. వాళ్ళ నాన్నగారు చించిన పేక అదే. తర్వాతి ముక్క ఇందాక ఆ అబ్బాయి తీసినదే. మేము మెజీషియన్లం కొద్దిగా రిస్క్ తీసుకుంటాం. ఈ అంశంలో నేను ఓ రిస్క్ చేశాను –ఆ అబ్బాయి వాళ్ళ నాన్నగారు తను తీసిన పేకను వెనక్కి తిప్పి చూడరనే నమ్మకం నాది. నేనను కున్నట్లుగానే ఆయన దాన్ని చూడకుండానే చించేశారు. మీరేమో ఆయన చించిన పేకే ఇస్పేట్ రాజని, అది తిరిగి ప్రత్యక్షమైందని భ్రమ పడ్డారు. "మ్యాజిక్ అంటే హస్తలాఘవం తప్ప మరొకటి కాదు. కాని ఎంతో సాధన కావాలి. ఇప్పుడు ఇంకో అంశం…" అంటూ మరో బల్లవైపు కదిలాడు మెజీషియన్.

అక్కడ కూర్చున్న ఓ పాప దగ్గరికి వెళ్ళి, ఒక పేక ముక్కని తీసుకోమన్నాడు. ఆ పాప ఓ పేకని తీసుకున్నాక ఆమె చేతికి ఓ కలం ఇచ్చి ఆమెకు ఇష్టం వచ్చిన బొమ్మను దానిపై గీయమన్నాడు. ఆ పాప కొంచెం సిగ్గుపడింది. అస్తవ్యస్తంగా ఓ పువ్వు ఆకారం గీసింది. పువ్వు మధ్యభాగంలో 'నవ్వుతున్న ముఖాన్ని' చిత్రించింది.

మెజీషియన్ ఆ పేకతో పాటుగా తన చేతిలోని పేక ముక్కలని పైకీ క్రిందికీ కదుపుతూ, ఆ పాప తల్లిని పైముక్కని తీసుకోమన్నాడు.

"ఈసారి మీరు మోసం చేయలేరు" అన్నట్టుగా మెజీషియన్ కేసి చూసి, పైముక్కని తీసుకుంది. వెంటనే వెనక్కి తిప్పి చూసింది. అది ఇందాక బొమ్మ వేసిన పేక ముక్కే. పువ్వులోని ముఖం ఆమెని చూసి నవ్వింది. ఆమె ఆ పేకని ముక్కలు ముక్కలుగా చించింది. మెజీషియన్ ఆ చిరిగిన పేక ముక్కలన్నింటినీ ఒకచోట చేర్చి, ఆ నవ్వు ముఖాన్ని అందరికీ చూపించాడు. వాళ్ళందరూ అది పాప వేసిన బొమ్మేనని ఒప్పుకున్నారు.

అక్కడ నిప్పు గూట్లో వెలుగుతున్న మంటని చూపిస్తూ "ఈ ముక్కలని ఆ మంటల్లో పడేయండి" అని పాప తల్లితో చెప్పాడు మెజీషియన్. ఆమె అలాగే చేసింది. మెజీషియన్ ధ్యాన నిమగ్నుడయ్యాడు. కొన్ని నిమిషాల నిశ్శబ్దం తర్వాత అతడి ముఖంలో బాధ వ్యక్తమైంది. అతడు కళ్ళు తెరచి, తన చేతిలో ఉన్న పేకలలోంచి పైముక్కని తీయమని పాప తల్లిని అడిగాడు. ఆమె అలాగే చేసింది. ఆ పేకపైన ఇందాక పాప వేసిన పువ్వు, అందులోని నవ్వుతున్న ముఖం ప్రత్యక్షమయ్యాయి. అంతే. ప్రేక్షకులంతా విస్తుపోయారు. ఒక్క క్షణం తర్వాత చప్పట్లు మారుమ్రోగాయి.

"మీరు కూడా సాధన చేస్తే ఈ అంశం ప్రదర్శించగలరు. ఇందులో మాయలేదు. మర్మంలేదు. కేవలం సాధన కావాలి. సునిశితమైన చేతివేళ్ళు...." అంటూ చెప్పాడు మెజీషియన్.

"కాని ఆ పేకని నా చేతులతో నేనే చింపేశాను. పైగా నిప్పుల్లో కూడా వేశాను. మరి ఇదెలా సాధ్యం? కేవలం సునిశితమైన వేళ్ళు సరిపోవనుకుంటాను..." అని అంది ఆ పాప తల్లి.

"నిజమే. మీరు పేకని స్వయంగా చింపి నిప్పుల్లో పడేశారు. కాని నేనీ ట్రిక్‌ని మీకు వివరించబోవడంలేదు. నేను ఒక ప్రదర్శనలో ఒకే అంశాన్ని వివరిస్తాను. ఈరోజుకి ఆ పరిమితి పూర్తయింది.." అని చెప్పాడు మెజీషియన్. తర్వాత ఒకదాన్ని మించినది మరొకటి రకరకాల అంశాలను మెజీషియన్ ప్రదర్శించాడు. అతడు అంత దగ్గరగా, తక్కువ వస్తువులతో ఇంత అద్భుతమైన మ్యాజిక్ షో చేయడం ప్రేక్షకులని సంభ్రమానికి గురిచేసింది.

"ఈ ప్రదర్శనని ముగించే ముందు, నా చివరి అంశాన్ని చూపిస్తాను. ఈ అంశాన్ని ఇప్పటిదాకా ఎందరో మెజీషియన్లు ప్రదర్శించారు. నేను కాస్త విభిన్నంగా చేస్తాను. పిల్లలూ, ఇప్పుడు మీకు కనిపించే దాన్ని చూసి భయపడకండి. ఇది కేవలం చిన్న ట్రిక్ అంతే" అంటూ తన నల్ల టోపీని తీసి ప్రేక్షకులకి చూపించాడు. అది ఖాళీగా ఉంది. తర్వాత అందులో చెయ్యిపెట్టి ఓ తెల్ల పావురాన్ని బయటకు తీశాడు. కొంతమంది ప్రేక్షకులు చప్పట్లు కొట్టారు.

"ఆగండి ఇది కాదు అసలు ట్రిక్!" అన్నాడు మెజీషియన్. తన చేతిలోని పావురాన్ని నిమిరాడు. అది తన రెక్కలని కదిలించి, చిన్నగా కూత పెట్టింది.

"ఇప్పుడు చూడండి" అన్నాడు మెజీషియన్.

ఆ పావురం మెడని చిన్నగా మెలిపెట్టి, బలంగా తలని, మొండాన్ని వేరు చేశాడు. వాటిని తన రెండు చేతులతోను దూరంగా ఉంచి ప్రేక్షకులకి చూపించాడు. మగపిల్లలు పెద్దగా నవ్వగా,

ఆడపిల్లలు భయంతో అరిచారు.

"కంగారు పడొద్దు. మీరు ఊహించినట్టుగా క్రూరమైన సంఘటన ఏదీ జరగలేదు" అంటూ మెజీషియన్ తన చేతులను దగ్గరగా తెచ్చి పావురం తలని, శరీరాన్ని మళ్ళీ అతికించినట్లుగా చేశాడు.

"ఆరోజు నుంచి నువ్వు బుద్ధిగా ఉంటావు. హాయిగా స్వేచ్ఛగా తిరుగు" అంటూ దాన్ని గాలిలోకి ఎగరేశాడు. ఆ పావురం రెక్కలని విదిలిస్తూ, హోటల్‌లోంచి బయటకు ఎగిరిపోయింది. అంతే! ఆ ప్రాంతమంతా చప్పట్లతో దద్దరిల్లింది.

మొట్టమొదటగా పేకముక్కని తీసిన అబ్బాయి మెజీషియన్ వేసుకున్న నల్లటి కోటులాంటి కోటుని కొనిపెట్టమని వాళ్ళమ్మని పోరుతున్నాడు. మెజీషియన్ తలవొంచి అందరికీ అభివాదం చేశాడు. ఒక మూలగా కూర్చున్న వ్యక్తి లేచి, "మీకు మంత్రాలు వచ్చా?" అని అడిగాడు. మెజీషియన్ పెద్దగా నవ్వాడు.

"భలేవారండి, నాకే మంత్రాలు రావు. నేను మంత్రగాడినైతే ఈ దేశంలోని నేరస్తులని, రాజకీయవాదులని ఎప్పుడో మాయం చేసేద్దును. ఇది కేవలం కనికట్టు. వట్టి చేతులతో చేసిన ప్రదర్శన. మీలో చంద్రుడిపైకి రాకెట్లు పంపిన శాస్త్రవేత్తలు ఉండొచ్చు. కష్టమైన కంప్యూటర్ ప్రోగ్రాములు రాసే సాఫ్ట్‌వేర్ నిపుణులు ఉండి ఉండవచ్చు. కాని నాకు అవేవీ రావు. నాకు చేతనైందల్లా కేవలం భ్రమింపచేయడమే. మీరు కూడా మ్యాజిక్ నేర్చుకోవచ్చు..." అన్నాడు.

ఈసారి పెద్దవాళ్ళు కూడా హాయిగా నవ్వేశారు. మరింత గట్టిగా చప్పట్లు కొట్టారు. ప్రేక్షకులకి ధన్యవాదాలు చెప్పి, హెడ్-వెయిటర్ కేసి కృతజ్ఞతా పూర్వకంగా తలపంకించి, గబగబా బయటకు నడిచాడు మెజీషియన్.

వీధిలోకి అడుగు పెట్టగానే, చల్లటి గాలి అతడిని పలకరించింది. అతడు తన కోటుని మరింత దగ్గరికి తీసుకున్నాడు. కోటు జేబులోంచి ఏదో అతడికి తగిలింది. అంతటి చీకటిలోను కదులుతున్న ఓ చిన్న పదార్థంలోంచి రెండు ఎర్రటి కళ్ళు కనపడ్డాయి. అతడికి తన పట్ల తనకే కోపం వచ్చింది.

"మన్నించు. నేను అబద్ధం చెప్పాను. నా అహాన్ని సంతృప్తి పరచుకోవడం కోసం ఈ పనిచేయక తప్పలేదు" అన్నాడు. ఆ రెండు కళ్ళూ అతడినే చూడసాగాయి.

"నన్ను క్షమించవూ..." అని ప్రాధేయపడుతున్నట్టుగా అడిగాడు మెజీషియన్.

*(ఆదివారం అనుబంధం, ఆంధ్రజ్యోతి 9 ఏప్రిల్ 2006)*

**'హస్తలాఘవం' కథకి మూలం The Magician అనే ఆంగ్ల కథ. మూలకథ 16.1.05 నాటి 'ది హిందూ' దినపత్రిక యొక్క ఆదివారం అనుబంధంలో ప్రచురితమైంది.**

# ఓ మనిషీ, ఎందుకిలా?

ఆంగ్లం : రేషునాథ్

“అప్పుడు నేను అంతరిక్షం నుంచి కొద్దిగా తారాంతర ధూళిని, ప్రేమని, అభిమానాన్ని, అందాన్ని తీసుకున్నాను. ఆ తర్వాత...” అంటూ కథకుడు చెప్పసాగాడు. ఇంతలో ఆయన ఒళ్లో కూర్చుని ఉన్న పాపాయి అడ్డుపడింది. “నువ్వు కథలో ముఖ్యమైన భాగాన్ని దాటవేస్తున్నావు” అంది.

ఆ వృద్ధ కథకుడు తెల్లటి దుస్తులు ధరించి ఉన్నాడు. ఆయన ముఖంలో చిన్నపాటి దరహాసం కదలాడుతోంది. రూపంలో వృద్ధుడైనా, ఆయన వదనంలో పసిబాలుడి ఆకర్షణ ఉంది. ఆ పాపాయితో మాట్లాడుతుంటే ఆయన కళ్లు మెరుస్తున్నాయి. ఆయన దేవుడు.

ఆ పాపాయిని తను సృష్టించిన విధానాన్ని కథగా ఆమెకి చెబుతున్నాడు దేవుడు. ఆ కథని ఆమె ఎంతగా ఇష్టపడుతుందంటే, ఎన్నిసార్లు విన్నా ఆమెకి విసుగనిపించదు.

“సరే. సరే. పొరపాటైపోయింది” అంటూ కథని కొనసాగించాడు దేవుడు.

“ఆ తర్వాత పై అరలో ఉన్న సీసాలోంచి కొంత ప్రేమని, నీలం సీసాలోంచి భావోద్వేగాలను, గులాబి రంగు సీసాలోంచి అందాన్ని తీసుకున్నాను...” చెప్పాడు దేవుడు.

దేవుడు తెల్లటి గడ్డాన్ని సవరిస్తూ, “అలమార సంగతి చెప్పు” అంటూ మారాం చేసింది పాపాయి.

“అప్పుడేమో నేను అలమారా అంతా బాగా వెదికి, ఓ అందమైన మానవ శరీరాన్ని బయటకు తీశాను. దానికి ప్రేమ, అభిమానం, అందం కలిపాను. అలా నువ్వు తయారయ్యావు” అని చెప్పి, ఆమె నుదుటిపైన చిన్న ముద్దు పెట్టాడు దేవుడు. దేవుడు చూపించిన ఆప్యాయతకి కరిగిపోయింది పాప దేవుడికి మరింత దగ్గరగా జరిగి నిద్రలోకి జారుకుంది.

ఆమెని సృష్టించక ముందు జరిగిన సంఘటనలలో ఆమెకి చెప్పని వాటిని గుర్తు చేసుకున్నాడు దేవుడు. “ఈ పాపాయి చాలా సున్నిత మనస్కురాలు. ఆ వివరాలన్నీ చెబితే బాధ పడుతుంది” అనుకున్నాడు.

ఆదాము, అవ్వలను – ఆ తర్వాత ఇంకెందరో మనుషులను సృష్టించిన దేవుడికి ఓ సంగతి స్పష్టమైంది. వాళ్లను సృష్టించడంలో తాను పడే శ్రమకి ఈ మానవులు అర్హులు కారనిపిం చింది. తమని తాము నాశనం చేసుకోవడంలో మానవులు ఆరితేరి పోయారు. ఒకరినొకరు చంపుకోసాగారు.

మొదటగా కెయిన్, ఎబెల్‌ను చంపడంతో మొదలైన హత్యా కాండ నేటికీ కొన సాగుతూనే ఉంది. భగవంతుడి సృష్టి పట్ల, సాటి మనుషుల పట్ల మానవులకి గౌరవం లేకుండా పోయింది. కోపంతోను, రోతతోను, నిరాశతోను దేవుడు భూమి మీద సృష్టి కార్యాన్ని చిన్న దేవుళ్ళకి, చిల్లర దేవుళ్ళకి వదిలేశాడు. తాను శుక్రగ్రహం పై దృష్టి సారించాడు. వాళ్లు ఈ పనిని ఎంతో ఉత్సాహంగా స్వీకరించారు. కాని కొంత కాలం తర్వాత, వాళ్లలో తొలినాటి ఆసక్తి లోపంచింది. చాలామంది చిన్న దేవుళ్లు నిర్లక్ష్యంగా వ్యవహరించసాగారు. చిల్లరదేవుళ్లు వాళ్లకి వంత పాడసాగారు.

సృష్టి చేసే గదంతా రకరకాల అలమారలతో నిండిపోయింది. ప్రేమ, దయ, కరుణ, ఉత్తమాభిరుచి వంటి ఉన్నత భావాలున్న సీసాలన్నీ పై వరుసలలోకి చేరాయి. కింద వరుసలో మోసం, అసూయ, కామం వంటి భావాల పాత్రలను అమర్చారు. సృష్టి అనేది వారికి పరమ విసుగైన పనిలా తోచసాగింది. అయినప్పటికీ వారంతా కష్టపడి పనిచేస్తున్నారు. పాపం. వాళ్ళ నడుములు నొప్పి పెడుతున్నాయి. భూమిపై ఓ మనిషిని సృష్టించాల్సినప్పుడల్లా, అలమారలలోని పై వరుసలని అందుకోలేకపోయేవారు. దాంతో మనుషులని తమకి అందుబాటులో ఉన్న కింది వరుసలోని పదార్థాలతో నింపేస్తున్నారు. ఎప్పుడోగాని పై వరుస జోలికి వెళ్లడంలేదు. దీని ఫలితంగా కొంతకాలానికి తమ అభిప్రాయమే సరైనదనే స్వార్థపరుల సంఖ్య మంచి మనుషుల సంఖ్యని మించిపోయింది. పైగా అధికారం కూడా వాళ్ళ చేతుల్లోకి వెళ్ళిపోయింది.

శుక్రగ్రహంపై ఏళ్ళ తరబడి సృష్టి చేసిన దేవుడు విసిగిపోయాడు. మార్పుకోసం భూమిమీద ఒక జీవిని సృష్టిద్దామనుకున్నాడు. ఫలితమే ఈ పాపాయి. దేవుడు తనదైన పాత శైలిలో ఈమెని సృష్టించాడు. తన పూర్వీకులలాగా మోసగాళ్ళు, నిర్దయాపరుల వలె కాకూడదని – ఎంతో ప్రేమ, కరుణ, దయ, సత్ప్రవర్తనలను మిళితం చేసి ఈ పాపాయిని సృష్టించాడు. కాని అదే పెద్ద తప్పయిపోయింది. ఇటువంటి లక్షణాలున్న పాప, భూమిపై ప్రసుత్తం ఉన్న మనుషుల మధ్య నెగ్గుకు రాలేదు. తన పొరపాటుని గ్రహించిన దేవుడు పాపాయిని భూమి మీదకు పంపడాన్ని వాయిదా వేశాడు. కాని అది ఏదో ఒకరోజు తప్పనిసరిగా జరగాల్సిన ఘటనే.

"పాపాయికి విషయం చెప్పి, సిద్ధంగా ఉండమని చెప్పాలి. మరికొంతకాలం వాయిదా వేయగలిగితే బాగుండు" అని అనుకుంటూ ఆలోచనలలో మునిగిపోయాడు దేవుడు. కాసేపటికి పాపాయి నిద్రలేచింది. సముద్రపు నురగలలోంచి బయటకు వచ్చిన దేవకన్యలా, మేఘాల మధ్య నీలిరంగులో మెరిసిపోతున్న భూగోళం ఆమెని ఆకర్షించింది. భూగ్రహంకేసి చూపిస్తూ నేను అక్కడికి వెళ్ళి ఆడుకోనా?" అని దేవుడిని అడిగింది.

"అక్కడికి వెళ్ళి ఆడుకుంటావా? దాన్ని భూమి అంటారు" చెప్పాడు దేవుడు వణుకుతున్న గొంతుతో.

పాపాయి ఆనందంతో చప్పట్లు కొట్టింది. "నేనక్కడికి వెళ్ళి ఆడుకోనా? అని అడుగుతూ,

"మళ్లీ సాయంత్రానికల్లా వచ్చేస్తా" అని బతిమాలింది పాపాయి.

తన కళ్లలోని నిరాశను పాపాయి గమనించకుండా, దేవుడు తన దృష్టిని మళ్లించాడు. "అయితే నువ్వు భూమిమీద పుట్టాలమ్మా" అని చెప్పాడు.

"పుట్టడామా? అంటే నేను నీనుంచి దూరమవ్వాలా?" అంటూ సందేహం వ్యక్తం చేసింది పాపాయి.

"అవును" అంటూ గొణిగాడు దేవుడు.

"అయితే నేను వెళ్ళనే వెళ్ళను. నిన్ను వదిలిపోవడం నాకిష్టంలేదు. నువ్వంటే నాకెంతో ఇష్టం" అంటూ పాపాయి దేవుడిని హత్తుకుని వెక్కివెక్కి ఏడ్చేసింది. దేవుడు ఆమెని ఓదార్చాడు.

కాసేపు మౌనంగా ఉండిపోయాక, పాపాయి తన కళ్లు తుడుచుకుంది. దేవుడు విచారంగా ఉండడం ఆమెకి నచ్చలేదు. పైగా ఆయన విచారానికి తను కారణమవడం పాపాయి భరించలేకపోయింది. దేవుడి మెడ చుట్టూ చేతులు వేసి, "నాకు తోడుగా భూమి మీదకి ఓ మంచి నేస్తాన్ని పంపిస్తావా?" అడిగింది.

"నువ్వు ఏమడిగినా ఇస్తాను. నీకు స్నేహితుడిగా ఓ బాబుని పుట్టిస్తాను. మీరిద్దరూ ఎల్లప్పుడూ కలిసి ఉండేలా, మంచి తల్లిదండ్రులకి పిల్లలుగా మీరిద్దరు పుడతారు. నీకు చక్కని రూపం, అద్భుతమైన తెలివితేటలు లభిస్తాయి" అంటూ ముగించాడు దేవుడు.

H H H

నెలలు నిండిన భార్య నుదుటిపై ముద్దు పెట్టుకుంటూ, "పుట్టబోయేది ఆడపిల్ల అయితే బాగుండు. నాకు ఆడపిల్లలంటే చాలా ఇష్టం" అని చెప్పాడు భర్త చిన్నగా నవ్వుతూ.

"పాపే పుడుతుందిలెండి" అని నవ్వు ముఖంతో చెప్పింది భార్య. బాధని ఓర్చుకుంటూ.

"ఈ సమయంలో నిన్ను విడిచివెళ్ళాలంటే బాధగా ఉంది. కాని వెళ్ళకపోతే ఉద్యోగం పోతుంది. రెండు రోజులలో వచ్చేస్తాను. పైగా అమ్మ వస్తోంది. నువ్వేం బెంగ పడకు" అని చెప్పాడు ఓదార్పుగా. 'అర్థం చేసుకున్నా'నన్నట్లుగా ఆమె భర్త చేతిని తన చేతిలోకి తీసుకుంది. ఆమె బాధ్యతను తన తల్లికి అప్పగించి, అతడు వెళ్లిపోయాడు.

కొన్ని గంటలపాటు ఆందోళనగా ఎదురుచూశాక, ఆమె ప్రసవించింది. ఒకే కాన్పులో పాప, బాబు ఇద్దరూ జన్మించారు. అబ్బాయి చక్కగా ఉన్నాడు. అన్ని సుగుణాలు ఆ చిన్నారిలో మూర్తీభవించినట్లున్నాయి. అయితే పాప ఇంకా అందంగా, బంగారు వన్నెతో మెరిసిపోతోంది. పాప కళ్ళు లేత నీలపు ఛాయలో ఉన్నాయి. స్ఫురద్రూపిగా కనిపిస్తోంది. ఆ పిల్లల తల్లికి ఇంకా స్పృహ రాలేదు.

పిల్లల్ని చూడడానికి వచ్చిన వాళ్ళ నానమ్మ, ఒక్కసారిగా మ్రాన్పడిపోయింది. "అయ్యో, ఒకే కాన్పులో ఆడపిల్లా, మగపిల్లాడు పుట్టడం అరిష్టం" అనుకుంది.

"ఇలా పుట్టిన పిల్లలు కుటుంబానికే శాపం. ఈ ప్రమాదాన్ని నివారించాలంటే ఎవరో ఒకరే బతకాలి" అని గొణుక్కుందావిడ. ఆమె ఆలోచనలు కొనసాగాయి.

"ఈ విషయాన్ని కొడుక్కి చెప్పాలి. ఒకే బిడ్డ బతకాలి. కాని వాడు నా మాట వినకపోతే? పైగా నావన్నీ వట్టి మూఢనమ్మకాలంటూ కొట్టిపారేస్తాడు. పిదపకాలం, పిదప బుద్ధులు..." అని తనలో తాను అనుకుంది.

రెండు పిడికిళ్ళు బిగించుకుని, ఆందోళనగా గదంతా పచార్లు చేయసాగింది. పిల్లలు మాత్రం ఉయ్యాలలో హాయిగా నిద్రపోతున్నారు. వాళ్ళ నానమ్మ మనసు మాత్రం అలజడిగా ఉంది.

"ఒక బిడ్డ చనిపోవాలి..." అంది ఓ గొంతు.

"కానీ, ఏ బిడ్డ?" అని అడిగింది మరో గొంతు.

"ఐతే, ఈ దారుణమైన పనిని ఎవరు చేస్తారు? నువ్వైతే చేయలేవు. పైగా నీ కొడుకు అడిగితే ఏం సమాధానం చెబుతావు?" ప్రశ్నించింది మూడో గొంతు. ఉద్విగ్నతకి లోనైన ఆమె ఏం చేయాలో తోచక చేతుల్లో తల పట్టుకుని కూర్చుంది.

కాసేపటికి ఓ నిర్ణయానికి వచ్చినదానిలా లేచి గదిలోకి వెళ్ళింది. తన ఇనప్పెట్టె తెరచి కొంత డబ్బు బయటకు తీసింది. ఇప్పటిదాకా ఆ డబ్బుతో తన కోడలికి ఏదైనా బహుమతి కొనాలనుకుంది. మంత్రసానిని రహస్యంగా పక్క గదిలోకి పిలిచి, డబ్బు అందించింది.

"ఒక బిడ్డని తీసుకుపో. దాన్ని చంపేయ్. మాకు ఇద్దరు పిల్లలు వద్దు.." అని చెప్పింది లోగొంతుకతో.

"ఏ బిడ్డని?" అనడిగింది మంత్రసాని.

"నీ ఇష్టం ఏదో ఒక బిడ్డని తీసుకుపో" అందామె చిన్నగా గొణుగుతూ. సమస్య తీరుతుందన్నందుకు ఆమె కళ్ళలో చిన్న మెరుపు కనిపించింది.

ఉయ్యాలలోకి తొంగిచూస్తూ "ఏ బిడ్డని?" అని మరోసారి అడిగింది మంత్రసాని. ఆమె పిల్లల కళ్ళకేసి చూడడంలేదు. నేరుగా కళ్ళలోకి చూస్తే, తాను చెయ్యాల్సిన నీచమైన పనిని చేయలేనేమోనని భయం. ఇంట్లో నలుగురిని పోషించాల్సిన దుస్థితి ఆమెది. డబ్బెంతో అవసరం ఆమెకి.

"సాధారణంగా అందరూ ఆడపిల్లనే వద్దనుకుంటారు" అని అనుకుని పాపవైపు కదిలింది. చాలా యాంత్రికంగా, పాప నోరు, ముక్కు మూసేసింది. హఠాత్తుగా ఊపిరి ఆడకపోయేసరికి పాపాయి కళ్లు తెరిచింది. ఆమె కళ్ళలో తీవ్రమైన బాధ. ఎన్నో ప్రశ్నలు గోచరించాయి. ఏం జరుగుతోందో ఆమెకి అర్థం కాలేదు. చావు అంటే గ్రహించేటంత జీవితాన్ని ఆమె చూడలేదు కదా మరి.

H H H

జరిగిన సంఘటన దేవుడిని కలచివేసింది. మనుషుల మూర్ఖత్వానికి దేవుడు దిగ్భ్రమ చెందాడు. ఒక మామూలు మగపిల్లాడి కోసం, అసాధారణమైన ఆడపిల్లను వదులుకున్న అవివేకానికి దేవుడు

సిగ్గుపడ్డాడు. పాపాయి మళ్లీ దేవుడి దగ్గరికి వచ్చేసింది. కాని ఆమె నడకలో మునుపటి ఉల్లాసంలేదు. నిద్రలో నడుస్తున్నట్టుగా ఉంటోంది.

ఇదివరకు లాగా తన ఒళ్లో కూర్చోబెట్టుకుని ఆమెని ఓదార్చడానికి ప్రయత్నించాడు దేవుడు. కాని ఘోరంగా విఫలమయ్యాడు. పాపాయి తన నివాసానికి వెళ్లిపోయింది. దేవుడే ప్రతిరోజూ ఆమె దగ్గరికి వెళుతున్నాడు. పాపాయి ఎప్పుడూ కిటికి దగ్గరే కూర్చుని, దూరంగా నీలంగా కనిపిస్తున్న భూగోళంకేసి చూస్తూంటుంది. దేవుడు వచ్చినా పట్టించు కోదు. తను ఆమెని సృష్టించిన విధానాన్ని కథగా చెప్పబోతాడు దేవుడు. పాపాయి మాత్రం జీవచ్ఛవంలా కూర్చుని మౌనంగా ఉండిపోతుంది. కథలో ఆమె ఎక్కువగా ఇష్టపడే భాగాన్ని దాటేస్తాడు దేవుడు. కాని పాపాయి మాత్రం ఉలకదు, పలకదు.

అమరత్వం పొందినప్పటికీ, శాశ్వతమైన వ్యధకి గురైంది పాపాయి.

*(విపుల, జూన్ 2006)*

**'ఓ మనిషీ, ఎందుకిలా?' కథకి మూలం** God Proposes, Man Disposes **అనే ఆంగ్ల కథ. మూలకథ.** www.viewsunplugged.com **అనే వెబ్‌సైట్‌లో ప్రచురితమైంది.**

# చెరువు

**హిందీ : జైనందన్**

ఏ అర్జునుడో లేదా రాముడో ఆగ్నేయాస్త్రం సంధించాడేమో తెలియదు, వందేళ్ళకు పైగా వయసున్న ఆ ఊరి 'శుభం చెరువు' ఎండిపోయింది. క్రమంగా అడుగంటుతున్న నీటి స్థాయిని చూస్తూ వృద్ధులు కంగారుపడ్డారు. వాళ్ళ బాల్యం నుంచి నేటివరకు కూడా ఆ చెరువులోని అక్షయ జలం కనీసం దోసెడైనా తగ్గేది కాదు. ఎన్నో రహస్యాలను తనలో దాచుకుని, ఎన్నో కార్యక్రమాలకు వేదికగా నిలిచి గతిశీలత, చల్లదనం వల్ల, పరోక్షంగా దీని ప్రభావం అనేకమందిపై పడింది. అందరికంటే ఎక్కువగా, ప్రత్యక్షంగా ప్రభావం పడినది "కొచాయి మండల్" పైనే. చెరువు ఎండి పోవడంతో ఆయన జీవితంలోని అన్ని వనరులు నశించాయి. ఆ చెరువే ఆయనకు సంజీవిని, కర్మస్థలం, జీవనాధారం అన్నీను. ఆ చెరువే లేకపోతే ఆయన కూడా లేనట్టే – వేళ్ళతో సహా పెకలించిన మొక్కలా, కదిలిపోయిన పునాదిలా! కొచాయి కుటుంబసభ్యులు మాత్రం శుభం చెరువు ఎండిపోవడాన్ని బాధాకరమైన సంఘటనలా కాకుండా, ఓ శుభసూచకంగా భావించడం ఆయనను మరింత కృంగదీస్తోంది.

ఆయన పెద్ద కొడుకు నిమాయి, "ఈ భూమిని ఇంతకాలానికి సక్రమంగా ఉపయో గించుకో గలుగుతున్నందుకు మనం సంతోషించాలి. దీనితో ఊరందరి మేలు ముడిపడి ఉన్నందున ఇన్నాళ్ళు ఈభూమిని వాడుకోలేకపోయాం. చెరువు దానంతట అదే ఎండి పోయింది కాబట్టి మనల్ని కాదనే వాళ్ళుండరు. ఈవిలువైన భూమిని సొంతం చేసుకోవడా నికి మనకో సాకు దొరికింది. రాత్రికి రాత్రి లక్షాధికారులమైపోవచ్చు..." అన్నాడు.

తన భార్య రాధాముని కూడా ఈ విషయంలో పిల్లల పక్షానే ఉందని కొచాయికి తెలుసు. ఇంకా చదువుకుంటున్న రెండో కొడుకు కూడా, వంశపారంపర్యంగా చెరువు మీద పడవ నడుపుతూ బ్రతికే తమ వృత్తిని అసహ్యించుకుంటూ, "ఈ వృత్తి మన మొత్తం వంశాన్నే తక్కువచేసి, మనం తరతరాలుగా పేదరికంలో మగ్గేటట్లు చేసింది. చేపలు పట్టుకుని, పడవ నడిపి ఏ పూటకా పూట తిండి తప్ప మనం సంపాదించింది ఏపాటి? నేనీ వృత్తిని మానేస్తాను. వేరే ఏదైనా పని చూసుకుంటా. నీటికి సంబంధించిన ఏ పనీ చేయను. మన అదృష్టాన్ని నేలపైన కాకుండా నీళ్ళలోనే ఎందుకు వెదుక్కోవాలి?" అని అన్నాడు.

రాధాముని తన కొడుకును వెనకేసుకొచ్చింది. "మంచి నిర్ణయం తీసుకున్నావురా అబ్బాయ్!

మీ నాన్న పై చేసినట్లు కాకుండా, ఆ దెయ్యం చెరువు మీ పై స్వారీ చేయకూడ దనే నేనూ అనుకున్నాను. నాకెప్పుడూ అనిపిస్తూంటుంది. ఈ పెద్దమనిషి నన్ను కాకుండా, ఆ చెరువునే పెళ్ళాడా డేమోనని. ఆ చెరువుతో నాకు సవతిపోరు తప్పలేదు. ఈయన నేలపై కన్నా, ఎక్కువ సమయం నీటిలోనే గడిపారు. నా పిల్లల్ని బాగా చదివిస్తానని నీటికి వీలైనంత దూరంగా ఉంచుతానని నేనెప్పుడో నిర్ణయించుకున్నాను" అని అంది.

"అమ్మా, నీటినుంచి మాదారిని మళ్ళించడంలో చదువు ఉపయోగపడితే మంచిదే. ఇప్పుడీ నేలను అమ్ముకోవాలంటే ముందుగా మనం కొంచెం ఖర్చు చేయాల్సిందే. దాదాపు ఎనిమిదిన్నర ఎకరాల భూమి మన ప్రాంతంలో లక్షలు కాదు కాదు కోట్ల విలువ చేస్తుంది. చుట్టూ ఎన్నో కాలనీలు లేస్తున్నాయి. ఎన్నో పరిశ్రమలు వస్తున్నాయి. మనం అడిగినంత ధర ఇచ్చి తీరుతారు" చెప్పాడు నిమాయి తన ఆలోచనల గుర్రాలను మరింత వేగంగా పరుగెత్తిస్తూ.

కొచాయికి కోపంరాదు. పైగా వాదప్రతివాదాలలో పాల్గొనడంఇష్టంలేదు. ఇలాంటి మాటలను, చాలా శాంతంగా విని ఊరుకుంటారాయన. జరిగేది జరగక మానదని అను కుంటూ, తన పని తాను చేసుకుపోతారు. కొచాయి తన తాతగారు రాసుకున్న డైరీలోంచి ఓ కాగితం తెచ్చి, నిమాయికిచ్చి చదవమన్నారు. అందులో "చెరువు విలువను రూపాయల లోను, పైసలలోను లెక్క కట్టలేం. రూపాయలలో లెక్కించాలంటే, ఆ నీటివల్ల కలిగే పరోపకారం వెల కోటానుకోట్లు ఉంటుంది. ఏదైనా బావి కాని, చెరువుగాని ఒకరి వ్యక్తిగత ఆస్తి కాదు, అది ఊరుమ్మడి ఆస్తి" అని రాసుంది.

నిమాయి ఆ కాగితాన్ని ముక్కలు ముక్కలుగా చింపేశాడు.

"నేనెప్పటినుంచో చెబుతున్నాను... ఈ చెరువులోని నీళ్ళను తోడేసి, ఆ భూమిని అమ్ముకుంటే, ఎన్నో తరాలుగా పట్టుకున్న మన దరిద్రం వదిలిపోతుందని. కానీ మీ నాన్న పట్టుదలకి, ఆ చెరువుపట్ల ఆయనకున్న అభిమానానికి లొంగి నేనేమి చేయలేక పోయాను. మీరు ఎప్పుడు ఎదుగుతారా అని ఎదురుచూశాను. అంతా భగవంతుని లీల. మన ప్రార్థనని మన్నించాడు. చెరువులో నీరు దానంతటదే మాయమైంది" అంది రాధాముని.

తన భార్యాబిడ్డల విజయ గర్వాన్ని చూసి కొచాయి స్థాణువులా ఉండిపోయాడు. నీటితో ఎంతో అనుబంధం ఉన్న కొచాయికి ఈ పరిస్థితి ఎదురవుతుందని ఎవరూ ఊహించలేదు.

H H H

కొచాయి జీవితం నీటితో ముడిపడి ఉంది. ఆయన నేలపై కన్నా, ఎక్కువ సమయం నీటిలోనే గడిపారు. తననితాను నీటికి కాపలాదారుగా భావించుకుంటారాయన. గ్రామస్తు లంతా ఆయనను 'కప్ప' అని పిలుస్తుంటారు. నీటిలోపల లేదా నీటిపైన ఏదైనా పని చేయాల్సి వస్తే, కొచాయి కంటే ఉపయోగపడే వ్యక్తి మరొకరుండరు. చెరువులోగాని, నదిలోగాని లేదా సముద్రంలోగాని ఏదైనా దుర్ఘటన జరిగితే, కొచాయికి వెంటనే పిలుపొస్తుంది. నౌకాదళంలోని గజ ఈతగాళ్ళు కూడా

సాధించలేని పనిని కొచాయి సులువుగా సాధిస్తాడని అంటుంటారు. ఈ విషయంలో ఆయన పేరు చాలా దూరం వరకు వ్యాపించింది. ఏదైనా బస్సు నదిలో పడి కొందరు గల్లంతయ్యారంటే, కొచాయికి కబురుపెడితే సరి. ఎవరైనా నదిలో దూకి ఆత్మహత్య చేసుకుని, శవం కనిపించడంలేదంటే, దాన్ని వెలికితీయడం కొచాయికి కొట్టిన పిండి. ఎక్కడైనా హఠాత్తుగా వరదలు వచ్చి, నీటిలో చిక్కుకుపోయిన వారిని రక్షించాలంటే, పంచె ముడేసి ఠక్కున నీళ్ళలోకి దూకేస్తాడు కొచాయి. విలువైన వస్తువేదైనా నీటిలోతుల్లో మునిగిపోతే, పాతాళంలోంచైనా దాన్ని బయటకు తీయడంలో కొచాయి నిష్ణాతులు.

నీటిలో దిగుతూనే ఆయన శక్తి పెరిగిపోతుందనే పుకారు కూడా ఉంది. నీటిలో ఆయన బాగా చూడగలుగుతారు. మైళ్ళకొద్దీ ఈదగలరు. వాసనను బట్టి జలచరాలను గుర్తించగలుగుతారు. ఆయన శరీరానికి నీరు తగిలితేనే, విద్యుత్ లాంటి శక్తి జనిస్తుంది. అసలాయన జలచరాలలో పుట్టుండాల్సిందని, పొరపాటున మానవజన్మ ఎత్తారని కొందరు గ్రామస్థులు అంటుంటారు. ఒక జలకన్య కొచాయిని ఇష్టపడిందని, నీటిలోకి దిగగానే ఆమె ద్వారా దైవికశక్తులు కొచాయిలో ప్రవేశిస్తాయని మరికొందరు కథలల్లుతారు.

నీరు కొచాయిని వేదాంతిగా మార్చింది. ఏవిధంగా నీరు బాహ్య మలినాలను శుభ్రం చేస్తుందో, అదే విధంగా ఏ మనిషినైనా ఒక వారంపాటు నీటిలో గడిపితే, అతడి మనోమాలిన్యాలు కూడా శుద్ధమైపోతాయని కొచాయి అంటాడు. దయ, కరుణ, మమత, ఆత్మీయత భావాలకు పర్యాయపదం నీరు. మనిషిని సరళంగాను, నిశ్చలంగాను చేస్తుంది. నీళ్ళలో ఎన్నో గుణాలున్నాయి. కావాలంటే ఎవరైనా నీరు మాత్రమే తాగుతూ పూర్తికాలం జీవించవచ్చు. ఎన్నో జలచరాలు ఏమీ తినకుండా, కేవలం నీరు తాగి జీవిస్తున్నాయి. నీటికి బాగా అలవాటైనవారు, దానికి దూరంగా ఉండలేరు. నీటికి దూరంగా వెడితే, ప్రాణాలు పోయినట్లు భావిస్తారు.

శుభం చెరువు కొచాయికి వారసత్వంగా వచ్చింది. ఆ చెరువు 'జమాయికేలా' సంస్థానాధీశుడు రాణా కౌతుక్ సింహ్‌దని, కొచాయి ముత్తాతైన 'సుతారు మండల్' కున్న స్వామి భక్తికి, చెరువుకి చేసిన సేవలకు సంతసించి, ఆ చెరువును 'సుతారు మండల్'కు కానుకగా ఇచ్చాడని ప్రతీతి. దాదాపు ఎనిమిదిన్నర ఎకరాల ఈ చెరువు కొండపక్కనే ఉంది. వానాకాలంలో కొండపై కురిసే వర్షపు నీరంతా ఒక కాలువగా ఏర్పడుతుంది. వానలు ముగిశాక కూడ ఈ కాలువలో నీరు ప్రవహిస్తూనే ఉంటుంది. తన చెరువు నిండా నీరుండాలని, ఆ కాలువ దిశని చెరువు వైపు మళ్ళించారు కొచాయి. ఈ చెరువు తప్ప ఆయనకు వేరే భూమంటూ ఏదీ లేదు. ఈ చెరువే ఆయనకు ఆధారం, గుర్తింపు కూడ.

ఆ చెరువు లోతు యాభై అడుగులకి పైగా ఉంటుందని, చెరువు మధ్యలో ఒక చోటికి వెడితే, ఇక తిరిగి బయటకు రాలేరని, అది పాతాళానికి దారని కొందరు అంటుంటారు. చెరువులోని నీటికి ఓ విశిష్టత ఉంది. నియమానుసారంగా ఈ చెరువులో స్నానం చేస్తే, చర్మరోగాలు మటు మాయమవుతాయని గ్రామస్తుల విశ్వాసం. కొందరైతే తనకెటువంటి చర్మరోగాలు రాకూడదని మొక్కు

కుంటూ ముందస్తుగానే చెరువులో స్నానాలు చేస్తుంటారు. ఈ చెరువులో స్నానం చేస్తే, ఏ రోగమూ దరికి రాదని, సకల శుభాలు కలుగుతాయని ప్రజల నమ్మకం. అందుకని ఈ చెరువుని 'శుభం చెరువు' అని పిలవసాగారు. కొండపై నుంచి వచ్చే నీరు, తనతోపాటు వనమూలికలను చెరువులోకి తెచ్చేది కాబోలు. అందుకే నీటికా ప్రభావం. ఐతే ప్రజలు చిన్న చిన్న విషయాలని పెద్దవి చేసేస్తుంటారు.

ఆ చెరువులో సాధారణ ప్రజలే కాక, రాణివాసపు స్త్రీలు కూడా స్నానం చేసేవారట. వారు స్నానానికి వచ్చినప్పుడు వారి సంరక్షణా బాధ్యత సుతారు మండల్‌దేనట. వారికి ఈతంటే మోజని, గంటల తరబడి చెరువులో జలకాలాడుతూండిపోయేవారని అంటుంటారు. ఆ సమయంలో ఒక్క సుతారు తప్ప అక్కడ ఎవ్వరూ ఉండేవారు కారట. సుతారు ఎటువంటి ఉద్రేకాలకు లోనవకుండా, నిర్వికారంగా కాపలా కాసేవాడట. సుతారు సత్ప్రవర్తనకి మెచ్చే కాబోలు, చెరువును బహుమతిగా ఇచ్చారు. రాచరికం ఉన్నంతకాలం, సంస్థానం వాళ్ళు ఈ చెరువునుంచే నీళ్ళు, చేపలు తీసుకెళ్ళేవారు. రాచరికం నశించాక, ఆయా ఆస్తులను తమ విశ్వాసపాత్రులకు దానం చేసి కూడా రాణా కౌతుక్‌సింహ్ భువనేశ్వర్‌లో స్థిరపడ్డారు.

సుతారు మండల్ నుంచి చెరువు బాధ్యత మూడో తరానికి చేరింది. కొచాయికి తన తాతగారి హయాం గుర్తులేదు కాని, తన తండ్రి జ్ఞాపకాలు మాత్రం ఆయనలో చాలా ఉన్నాయి. కాస్త ఊహ తెలిసినప్పటినుంచి, తండ్రి దోసిళ్ళతో చెరువు నీరు తాగారు కొచాయి. ఈత కొట్టడం, లోతైన నీటిలో మునగడం, పడవ నడపడం, వల విసరడం వంటి విద్యలు కొచాయి తన తండ్రి వద్దే నేర్చుకున్నారు. వలలేకుండా పెద్దపెద్ద చేపలను పట్టుకునే కళను ఆయన అభ్యసించారు. చేపల కోసం 'ఎర'లను తయారు చేయడంలోను, చేపల కూర చేయడంలోను దిట్టనిపించుకున్నాడు కొచాయి.

H H H

తమ ప్రాంతంలో వేగంగా జరుగుతున్న 'పట్టణీకరణ' వల్ల శుభం చెరువు ఉనికికి కలుగుతున్న ముప్పుపట్ల కొచాయి ఎంతో కలతచెందాడు. పిల్లల్ని ఉద్దేశించి మాట్లాడుతూ, "చూడండి అబ్బాయిలూ, చెరువంటే కేవలం నీటి భాండాగారం మాత్రమే కాదు, అది మన సంస్కృతిలో ఒక భాగం. ఒక వ్యక్తికి చెందినదైనప్పటికీ, అది ఊరుమ్మడి సొత్తు. దాన్ని చుట్టు పక్కల ప్రజలందరూ వాడుకోవచ్చు. ఎవరైనా తమ భూమిలో మొక్కను నాటితే, అది పెరిగి పెద్దయ్యాక దాని నీడ, ఫలాలు అందరికీ చెందుతాయి. ఆ చెట్టు కొమ్మల మీద ఎన్నో పక్షులు గూళ్ళు కట్టుకుంటాయి. అలాగే చెరువు వల్ల చుట్టుపక్కల ప్రాంతాలలో నీటిమట్టం స్థిరంగా ఉంటుంది. చేలల్లో తడి ఉంటుంది. వాతావరణంలో తేమ ఉంటుంది. స్నానపానాదులకు తగినంత నీరు లభిస్తుంది. చేపలు దొరుకుతాయి. మనుష్యుల మధ్య సహజీవనం కొనసాగుతుంది. చెరువు పైన మనకు అధికారం ఉన్నప్ప టికీ, దాన్ని మార్పు చేయడానికి గాని, నష్టపరచడానికిగాని మనకి హక్కు లేదని రాజుగారు ఎప్పుడో చెప్పారు" అని అన్నారు కొచాయి. కొడుకులా మాటలను వినీవిననట్లుగా ఊరుకున్నారు.

కొచాయి తాత, తండ్రి రాజుగారి మాటల్ని వేదవాక్కులా పాటించారు. చెరువును తమ సొంత ఆస్తి అన్నట్లు వారెన్నడూ ప్రవర్తించలేదు. అందరినీ ఆ నీటిని వాడుకోనిచ్చే వారు. మరింత మందిని ఆకర్షించడానికి, ఆ చెరువుని ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచేవారు. వారు కేవలం చేపలమీద, పడవపై గట్టు దాటించడంపైనే తమ హక్కులను ఉంచుకున్నారు.

కొండపైనుంచి వచ్చే కాలువ రోజురోజుకు క్షీణించడం గత కొద్దికాలంగా కొచాయి గమనిస్తున్నారు. కొండ పక్కన, చెరువు చుట్టుపక్కలా త్వరితగతిన విస్తరిస్తున్న జనావాసాల వల్ల, వాటిల్లో నివసిస్తున్న ప్రజల నిర్లక్ష్యం వల్ల, కొండపైనున్న ప్రకృతి సహజమైన అడవి హరించుకు పోతోంది. కొండ తన ఆకుపచ్చని చీరని పోగొట్టుకుని నగ్నంగా మారి పోయింది. కాలువ ఓ చిన్న నీటి పాయగా మిగిలిపోయింది. రాబోయే అవాంతరాన్ని కొచాయి ఊహించినా, మరీ ఇంత త్వరగా వస్తుందని మాత్రం అనుకోలేదు. పర్యా వరణాన్ని నాశనం చేయడం వల్ల కలిగే ముప్పును ప్రజలు తక్కువగా అంచనా వేసిన ఫలితమిది.

శుభం చెరువు క్రమక్రమంగా ఎండిపోసాగింది. కొంతమంది ఔత్సాహికులు చెరువు గురించి ఎప్పుడూ తాము వినే కథల గురించి చర్చించుకోసాగారు. "ఇందులో ఉండే జలకన్య ఏమైందో? నీరు లేకపోవడం వల్ల చనిపోయిందా? మరి శవమేది? పాతాళానికి దారితీసే ఆ మార్గం ఏమైంది? ఎంతో పెద్దగా ఉండే చేపలేమయ్యాయి?" లాంటి ప్రశ్నలెన్నో వారి మనసుల్లో ఉదయించాయి.

కొచాయిలో ఉదాసీనత తలెత్తింది. ఎవరితోనూ మాట్లాడడంలేదు. ఇందుకు భిన్నంగా, ఆయన కుటుంబ సభ్యులలో మాత్రం ఉత్సాహం వెల్లివిరుస్తోంది. అనేకమంది కార్లలోను, జీపులలోను వచ్చి ఆయన పెద్ద కొడుకును కలిసి వెడుతున్నారు. వాళ్ళ ఉద్దేశా లను కొచాయి గ్రహించారు. "నేను బ్రతికున్నంత వరకు చెరువు భూమిపై వేరే ఏ పనీ చేయలేరు. ఆ కాలువ తిరిగి ప్రవహిస్తుందని నా ప్రగాఢ విశ్వాసం. నేను కొండపై మొక్కలు నాటి, తిరిగి అడవి పెరిగేలా చేస్తాను" అని అంటూ తన దృఢ నిశ్చయాన్ని ప్రకటించారు. తల్లీకొడుకులు ఒకరి ముఖాలొకరు చూస్తూండి పోయారు. "ఈ మనిషికేమైనా వెర్రా" అని అనుకున్నారు. కాని నిశ్శబ్దంగా వారు సమాలోచనలు జరుపుకున్నారు.

కొచాయి వెళ్ళి చెరువుగట్టున, ఓ చెట్టు కింద కూర్చున్నారు. ఆయనకు దుఃఖం ముంచు కొచ్చింది. ఎదురుగా క్షణక్షణానికి కృశించిపోతూ, మరణానికి సిద్ధమవుతున్న ప్రియబంధువులా చెరువు! దాహంతో చెరువు వద్దకి వచ్చి, నీళ్ళు లేకపోవడం చూసి వెనుదిరుగుతున్నాయి కొన్ని జంతువులు. జల విహారం చేసే కొన్ని పక్షులు, కొమ్మల మీద నుంచే చెరువు దుర్దశను గమనించి ఎగిరిపోతున్నాయి. చెరువులో మిగిలిన కొద్దిపాటి నీళ్ళు సరిపోక పెద్ద చేపలు గిలగిలా కొట్టు కుంటున్నాయి. ఈ ప్రళయం పట్టణంలో కొంతమందికి ఉత్సవంలా మారింది. సమయం దొరకగానే వచ్చి చేపలు పట్టుకు పోతున్నారు.

చెరువు నీటితో నిండి ఉన్నప్పుడు పరిస్థితి ఎంత భిన్నంగా ఉండేదో! కొందరు స్నానాలు చేస్తుండేవారు. కొందరు తూర్పు దిశగా ఉన్న శివాలయానికి నీళ్ళు మోస్తుండే వారు. స్త్రీలు బిందెలతో నీళ్ళు ఇంటికి తీసుకెళ్ళేవారు. పాత్రలను కడిగేవారు. పిల్లలకి సబ్బు రుద్ది స్నానం చేయించేవారు. చెరువు నీటితో కొందరు పంటలు పండించుకొనే వారు. చెరువులో చేపలు ఏదో రాగం వినిపిస్తున్నట్లు అటు ఇటు తిరుగుతూండేవి. కొచాయి నియమించిన నలుగురైదుగురు జాలర్లు అక్కడక్కడ వలలు విసురుతూండేవారు. ఇప్పుడిక ఇదంతా గతం!

H H H

కొచాయి బాధకి అంతే లేదు. ఐతే ఆయన కుటుంబ సభ్యులకు మాత్రం ఏ బెంగా లేదు. పైగా ఈ మధ్య మరింత నిశ్చింతగా కనబడుతున్నారు. మూడో కొడుకు, కూతురు కూడా పూర్వంలానే, ఏ బెంగా లేకుండా హాయిగా బడికి వెడుతున్నారు.

ఒక రోజు ఓ వ్యక్తి వచ్చి కొచాయిని కలిశాడు. తననితాను పరిచయం చేసుకుంటూ ఓ 'షిప్పింగ్ కంపెనీ' యజమానినని చెప్పాడు. "నాపేరు ప్రదీప్ డోగ్రే. నాకు మీ సేవలు కావాలి. నా ఓడ ఒకటి బంగాళాఖాతంలో మునిగిపోయింది. ఆ ఓడలో బంగారు ఇటుకలున్న పెట్టెలు ఐదు ఉన్నాయి. వాటి విలువ యాభైకోట్ల రూపాయలకంటే ఎక్కువే. కొంత మంది గజ ఈతగాళ్ళు ప్రయత్నించారు. కాని వాటిని బయటకు తేలేకపోయారు. మీ గురించి మాకు ఈమధ్యే తెలిసింది. నీటిపై మీకు పూర్తి పట్టు ఉందని విన్నాను. మీరు దేన్నైతే మనస్ఫూర్తిగా కోరుకుంటారో దాన్ని సాధిస్తారని కూడా విన్నాను. నీరు మిమ్మల్ని దగా చేయదు. మీరు ఈ సవాలును స్వీకరిస్తే, ఎంత డబ్బయినా ఇస్తాను" అని అన్నాడు.

కొచాయి తన కుటుంబ సభ్యులకేసి చూసారు. ఈ ప్రతిపాదనని అంగీకరించమని వాళ్ళందరూ చెబుతున్నట్లుగా ఆయనకి తోచింది.

"డోగ్రే గారు సరిగ్గానే చెప్పారు. ఇది మీకిష్టమైన పనే కదా. ఎలానూ మీరిప్పుడు ఖాళీగానే ఉంటున్నారుగా. వెళ్ళిరండి. మనసుకి ఉత్సాహంగా ఉంటుంది. కాస్త ఆదాయమూ వస్తుంది. పైగా ఇల్లు నడపడానికి డబ్బు కావాలిగదా..." అని అంది రాధాముని.

కొచాయికి ఆమె మాటలు సబబుగానే తోచాయి. చెరువుని చూస్తుంటే దుఃఖం మరీ ఎక్కువవుతోంది. పైగా నీళ్ళలో మునగక నెలలు గడుస్తున్నాయి. దాంతో తన శరీరంలోని కణాలన్నీ నిర్జీవమైపోతున్నట్లు ఆయనకి అనిపించింది. "సరే" అని అన్నారు. డోగ్రే వెంటనే లక్ష రూపాయలకి చెక్కు రాసిచ్చాడు. కొచాయి నిర్ఘాంతపోయారు. జీవితంలో తనకెవరూ ఎప్పుడూ ఇంత మొత్తం ఇవ్వలేదు.

కొచాయిని తీసుకుని డోగ్రే బయల్దేరాడు. తమ షిప్పింగ్ కంపెనీ ప్రధాన కార్యా లయం ఉన్న ఊరికి కొచాయిని పంపించాడు. ఆ కంపెనీ ఉద్యోగులు కొందరు కొచాయిని పడవలో సముద్రంలోకి తీసుకెళ్ళారు. నీటిలో మునిగేటప్పుడు ధరించే దుస్తులు వేసుకుని, 'ఆక్సిజన్ మాస్క్' తగిలించుకుని, ఓడ మునిగిపోయిన ప్రదేశంలో దూకారు కొచాయి. ఆయన గతంలో రెండు మూడు

సార్లు సముద్రంలో దూకిన సంఘటనలు ఉన్నాయి. కాని అప్పట్లో తక్కువ లోతుకి మాత్రమె వెళ్ళొచ్చారు. ఈసారి మాత్రం ఆయనను దాదాపు ఒకటిన్నర నెలలు సముద్రంలోనే ఉంచేశారు. దాదాపు 10–12 సార్లు చాలా లోతులకి వెళ్ళొచ్చారు. అక్కడి ప్రపంచం ఆయనకి ఆశ్చర్యాన్ని కలిగించింది. ఎన్నో రంగు రంగుల మొక్కలు, విచిత్రమైన జలచరాలు ఆయనకి ఆనందాన్ని కల్గించాయి. బయటి ప్రపంచం కన్నా, ఈ లోపలి ప్రపంచమే బాగుందాయనకి. తాను కూడా ఈ సముద్ర జీవుల మధ్య ఉండిపోగలిగితే ఎంత బాగుంటుందో అని అనిపించిందాయనకి. ఎంత వెదికినా, ఓడ తాలుకు అవశేషాలేవీ ఆయనకు కనిపించలేదు.

ఒకరోజు డోగ్రే వచ్చి "కొచాయి గారు, మీరు ఇక మీ ఊరికి వెళ్ళిపోండి" అని అన్నాడు. కొచాయి సిగ్గుపడుతూ, "క్షమించండి. ఎంత వెదికినా ఏమీ దొరకలేదు" అని బదులు చెప్పాడు. "పరవాలేదు. మీరు సముద్రంలో గడపడం వ్యర్థం కాలేదు. మీరు నీటిలో ఉన్నప్పుడు మాకు కావల్సింది మేము పొందాము" అని అన్నాడు డోగ్రే. కొచాయికి ఏమీ అర్థం కాలేదు.

'ఇంటికి వెళ్ళాలి' అనుకోగానే, ఆయనను దిగులు ఆవరించింది. చెరువీపాటికి పూర్తిగా ఎండిపోయుంటుంది. వర్షాకాలం రాగానే కొండమీద మొక్కలను నాటాలి. ఎంత కష్టమైనా సరే కాలువను తిరిగి ప్రవహింపజేయాలి' అని నిశ్చయించుకున్నారాయన. "చెరువును తిరిగి నీటితో నింపితేగాని నాకు మనశ్శాంతి లేదు" అని అనుకున్నారు.

ఊర్లోకి అడుగు పెడుతూనే, ఆయన పాదాలు అప్రయత్నంగా చెరువువైపు దారి తీశాయి. దార్లో డజన్లకొద్దీ డంపర్లు, బుల్‌డోజర్లు, ట్రక్కులు కనిపించాయి. ఆయన భృకుటి ముడిపడింది. చెరువును సమీపించగానే, దాని పరిస్థితి కళ్ళకు కట్టినట్లుగా కనిపించింది. ఒక ఒడ్డున 'ఈ స్థలం డోగ్రే బిల్డర్స్ మరియు కాంట్రాక్టర్స్‌కు చెందినది' అని రాసున్న బోర్డు కనిపించింది. చుట్టుప్రక్కల ఉన్న పరిశ్రమల చెత్తతోను, పొలాలలోని మట్టితోను చెరువును పూడ్చేస్తున్నారు. ఆ క్షణంలో చెరువును కాక, తననే సజీవ సమాధి చేస్తున్నట్లు కొచాయికి అనిపించింది. డోగ్రే మాటల అర్థం ఇప్పుడు స్ఫురించింది. బంగారం వెదకడానికి కాకుండా, తన సర్వస్వం పోగొట్టుకోడానికే సముద్రంలోకి వెళ్ళినట్లనిపించిందాయనకు. ఆయన కళ్ళనుండి నీళ్ళు బొటబొటా కారాయి.

స్వార్థపరుల కుత్సితానికి బలై, ఆయన గుండె చెరువయ్యింది.

*(ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, 26 డిసెంబరు 2006)*

*(మూలకథ భారతీయ జ్ఞానపీఠ్‌వారి విశిష్ట సంకలనం 'జ్ఞానోదయ్'లో ప్రచురితం.)*

**'చెరువు' కథకి మూలం 'కల్యాణ్ కా అంత్' అనే హిందీ కథ.**
**ఈ కథ** www.abhivyakti-hindi.org **అనే వెబ్‌సైట్‌లో ప్రచురితమైంది.**

# బాకీ

ఆంగ్లం : జెరికో జె.ముసెద్

**కా**రు మెకానిక్కులకంటే ఎక్కువగా మతాధిపతులు, డాక్టర్ల నుంచీ అద్భుతాలను ఆశిస్తాం. కాని వీరందరికంటే ఎక్కువగా అద్భుతాలను చేసేవారు తల్లులు, నేనీ వృత్తి గత ఇరవై ఏళ్లుగా చేస్తున్నాను. పాత్రలలో తుప్పు తెచ్చినట్లుగా ఉండే పాతకార్లను తెచ్చి, వంద డాలర్లు ఇస్తూ "దీన్ని కొత్తకారులా చెయ్యాలి" అనేవాళ్ళు నా దగ్గరకు ఎందరు వచ్చారో నాకు గుర్తులేదు. నిజం! కొంతమంది ఇంకా దారుణం. కార్లను తమంతట తామే బాగు చేసుకోవడానికి ప్రయత్నించి చేతకాక, విడిభాగాలని సంచుల్లో చుట్టినట్లుగా తెచ్చి నన్ను బాగు చేయమనేవారు.

అలాంటప్పుడు నేనో నవ్వు నవ్వి దాన్ని బాగుచేయటం నావల్ల కాదనేవాడిని. కార్లను మరమత్తు చేయడం ఓ కళ. కళాకారుడికి తన ప్రతిభకి తగినంత పారితోషికం లభించాలి.

కెన్నీ తన చప్పుడు చేసే పాతకారుతో నా వద్దకు వచ్చినప్పుడు, నా నుంచి ఏదో అద్భుతం ఆశించి వచ్చాడనిపించింది. నా అంచనా నిజమైంది. 1965 నాటి ఆ ముస్తాంగ్ కారుని దాని పూర్వస్థితికి తేవాలని కెన్నీ నన్ను కోరాడు. ప్రస్తుతానికి ఎనిమిది వందల డాలర్లు ఇచ్చి, మిగతా డబ్బును వాయిదాలలో చెల్లిస్తానన్నాడు. ఈ వ్యవహారం నాకేం నచ్చలేదు. ఏవైనా చుట్టరికాలు ఉంటేగాని, ఇలాంటి బేరాలకి ఎవరూ అంగీకరించరు. అదేమాట కెన్నీతో కూడా అన్నాను.

వెంటనే అతడి ముఖం పాలిపోయింది. కెన్నీ మాట్లాడుతూ, ఆ కారు తనకి వాళ్లమ్మగారి మిత్రుడు బహుమతిగా ఇచ్చాడని చెప్పాడు. దాని మరమత్తుకోసం ఎంతగా శ్రమించాలో తనకు తెలుసునని అన్నాడు. ఎనిమిది వందల డాలర్లకు ఎంత మేర బాగుచేయగల్గితే, అంతవరకు బాగుచేసి కారును నా గారేజిలో ఉంచన్నాడు. మిగతా డబ్బులు పోగు చేశారక కారుని తీసుకువెడతానని అడిగాడు. నేను కారును కాసేపు పరీక్షించి, లోపలి యంత్రాలు కూడా బాగోలేవని, ముందు వాటిని బాగు చేయించుకోమని నచ్చజెప్పాను. కాని కెన్నీ తన మనసు మార్చుకోలేదు. కెన్నీ మాటకారి, దక్షత గలవాడని నాకు అనిపించింది. తన జీవితంలో ఆ కారుకు ఎంత ప్రాముఖ్యత ఉందో చెబుతూ... దాన్ని పూర్వస్థితికి తీసుకురావడమే తన జీవిత లక్ష్యమని కెన్నీ చెప్పాడు. రోజూ కొంతసేపు నా గారేజీలో పనిచేసి, కారు మరమత్తుల ఖర్చు భరిస్తానన్నాడు. నేను సరేనన్నాను.

మా ఇద్దరి ఈ పరిచయంలో కెన్నీ గురించి నాకు రెండు విషయాలు తెలిశాయి. ఒకటి సవాళ్లను అతడు అవకాశాల్లా భావిస్తాడు. రెండు.. లౌక్యం లోపించిన చోట పట్టుదల, దృఢనిశ్చయం

కనబరుస్తాడు. ఆ పాత ముస్తాంగ్‌ను నా తీరికవేళల్లో బాగుచేదం మొదలుపెట్టాను. ఈ పనికి నాకేమీ డబ్బులు రావని, ఎప్పుడోప్పుడు కెన్నీ పని మానేస్తాడని తరచూ నా కనిపించేది. ఎవరికీ అమ్ముకోలేని కారొకటి నా దగ్గర పడి ఉంటుందని నేను భావించేవాడిని. నెలరోజులు గడిచినా, కెన్నీ పనిలోకి రావడం ఆపలేదు.

నిజం చెప్పాలంటే, కెన్నీ నన్నెంతో ఆలోచింపజేస్తున్నాడు. అతను ఇతర ఖాతాదార్ల వలె... 'నా కారెప్పుడు బాగుపడుతుంది? ఇలాగే ఎందుకు బాగుచేశావు? ఇంకోవిధంగా బాగుచేసి వుండొచ్చుగా?' లాంటి ప్రశ్నలేమీ వేసేవాడు కాదు. ప్రతిరోజూ పనికి వచ్చి, గారేజి అంతా శుభ్రంచేసి వెళ్ళిపోయేవాడు. తన కారు గురించి ఒక్క ముక్కకూడా అడిగే వాడు కాదు. కాని మరమత్తులకు ఎంత ఖర్చవుతోంది, తను నాకింకా ఎంత చెల్లించా లనేది అడిగి తెలుసుకునేవాడు. ఇది చాలా అసహజం. సాధారణంగా ఖాతాదార్లు నాకి వ్వాల్సిన డబ్బులు గురించి నేనే వాళ్ళకి గుర్తు చేస్తుండేవాడిని. కెన్నీ తనవద్ద ఎప్పుడూ ఓ చిన్న పుస్తకం ఉంచుకునేవాడు. అందులో తన రోజువారి సంపాదన, ఖర్చులు జాగ్రత్తగా రాసుకునేవాడు. రోజూ ఇంటికి వెళ్లేముందు ఆ వివరాలను నాకు చూపించి, నేను వాటిని పరిశీలించి సరేనన్నాక బయల్దేరేవాడు.

కెన్నీకి సంబంధించిన ఓ విషయం నాకు వింతగా తోచేది. అతడు నా గారేజి వద్ద ఉన్న సోడా మిషన్ దగ్గర ఆగి, రోజూ సోడానే తాగేవాడు. కోక్ గాని, మరో డ్రింకుగాని తాగేవాడు కాదు. ఎప్పుడూ ఎర్ర నురుగు వచ్చే ఆ సోడాయే తాగేవాడు. సోడా మిషన్‌లో వేయడానికి జేబులోంచి డబ్బులు తీస్తే, ఎక్కువా తక్కువ కాకుండా, ప్రతీసారి సరిగ్గా సోడా ఖరీదెంతో అంతే డబ్బులు బయటకు వచ్చేవి.

ఇదేకాకుండా కెన్నీ ప్రవర్తన కూడా నన్ను ఆశ్చర్యపరిచేది. ఒక్కోసారి అతడు బెల్టు లూపు ఊడిపోయి కనిపించేది. ఒకసారి అతను బూట్లకు లేసులు లేకుండా వచ్చాడు. ఆ సంగతి గమనించి నేను వాటిగురించి అడిగితే, ఎక్కడో పోయాయని చెప్పాడు. నా దగ్గర ఏవో పాత లేసులు ఉంటే అతనికి ఇచ్చాను. చాలారోజుల తర్వాత, ఎప్పుడో అతడి బూట్లకేసి చూశాను. నేనిచ్చిన లేసులు ఇప్పటికీ వాడుతున్నాడు.

ఒక్కోసారి కెన్నీ విచారంగా కనిపించేవాడు. కారణం అతను చెప్పేవాడు కాదు. నాకూ తెలుసుకోవాలని ఆసక్తి కలగలేదు. బహుశా నేను కారణం అడిగి ఉండాల్సిందేమో! కెన్నీ 'సవతి బిడ్డేమో' ననిపించింది. అతడొక చిక్కు ప్రశ్నగా మిగిలాడు. పైకి చూడటానికి అంతా సవ్యంగా ఉన్నట్లు కనపడతాడు. కాని లోపల లోపల ఏదో అపసవ్యం. అతడిని ఇంతకు ముందెక్కడో చూసినట్లుగా తోచేది. కాని ఎంతకీ గుర్తొచ్చేది కాదు.

కెన్నీ నాతో ఎన్నడూ అవసరానికి మించి మాట్లాడలేదు. తన వ్యక్తిగత జీవితంలోని విషయా లను నాతో పంచుకోలేదు. ఒక్కోసారి నాకు కెన్నీకి ఆ కారు బహుమతిగా ఇచ్చిన వ్యక్తి గురించి

తెలుసుకోవాలనిపించేది. కాని కెన్నీ ఎన్నడూ ఆ వ్యక్తి గురించిగాని, తన తల్లిగురించి గానీ మాట్లాడలేదు. అతడి ఈ ప్రత్యేకత నాలో ఆసక్తి రేపుతోంది. నాపై ఎంతో ప్రభావం చూపుతోంది. ఎటువంటి ప్రత్యేకమైన కారణాలు లేకుండానే నేను కొన్ని మంచి పనులు చేయడం మొదలుపెట్టాను.

అతడి కారుకు అవసరమైన ముడిసరుకుల ధర మాత్రమే కెన్నీ ఖాతాలో రాస్తున్నాను. మరే ఇతర రుసుంరాయటంలేదు. ఏమో, ఇలా ఎందుకు చేస్తున్నానో నాకే తెలియదు. తీరిక వేళల్లో కార్బొరేటర్‌ని, ఇతర యంత్రభాగాల్ని శుభ్రం చేయడం ప్రారంభించాను. ఈ విషయాలేవీ నేను కెన్నీకి చెప్పలేదు. ఒకవేళ ఇప్పటిదాకా కారుపై పెట్టిన ఖర్చును అతడు ఇవ్వకపోతే, నేనా కారును ఏదో ఒక ధరకు అమ్ముకోగల ననిపించింది. కాని అది నిజం కాదు. ఆ విషయం నాకు తెలుసు.

ఓరోజు కెన్నీ మరీ విచారంగా కనిపించాడు. ముఖమంతా చెమటలు కారుతున్నాయి. నేను అతడిని మొదటినుంచి గమనించి ఉంటే, అతడి విచారానికి కారణం ఏమిటో అర్థమయ్యేదేమో!

సాయంత్రం కెన్నీ సోడా మెషిన్ దగ్గర నిల్చుని ఉన్నాడు. చేతుల్ని కదిలిస్తూ, తన ప్యాంటు జేబుల్లో డబ్బులు వెతుకుతున్నాడు. నేను అతడి దగ్గరకి వెళ్లగానే.. నాకేసి చూసి... "మీరు ఒక స్టాంపు కొంటారా?" అని అడిగాడు. ఏవో కుశలప్రశ్న అడిగినట్లుగా అడిగాడు.

"స్టాంపు అంటే పోస్టేజి స్టాంపా?" అని అడిగాను నేను. కెన్నీ ఎందుకిలా అడిగాడో అని నేను ఆలోచిస్తుండగానే, తన పర్సులో భద్రంగా దాచిన పోస్టేజి స్టాంపులను బయటకు తీశాడు కెన్నీ.

"మా అమ్మ ఎప్పుడూ చెబుతూ ఉంటుంది. ఎవరి దగ్గర అప్పు చేయవద్దని, కాని నాకు ఎప్పుడైనా డబ్బులు అవసరమైనప్పుడు ఎవరినైనా 'స్టాంపులు కొంటారా?' అని అడగడంలో తప్పు లేదంటుంది. ఒక్కోసారి నేను ఎక్కువగా ఖర్చు చేస్తుంటాను. అప్పుడప్పుడు నాకు అత్యవసరంగా డబ్బు అవసరమవుతుంటుంది..." అన్నాడు కెన్నీ.

మళ్లీ తనే మాట్లాడుతూ "ఇవన్నీ ఒక్కొటి ముప్ఫైమూడు సెంట్ల స్టాంపులు. మీకు ఒక్కొక్కటి ముప్ఫై సెంట్లకే అమ్ముతాను.." అన్నాడు.

అంతే! ఒక్కసారిగా నన్ను జ్ఞాపకాల వెల్లువ చుట్టుముట్టింది. కెన్నీ ఎవరో నాకప్పుడు గుర్తొచ్చింది. బెల్టు లూపు ఊడిపోయి, బూట్లు లేసులు లేకుండా విచారంగా గారేజీకి వచ్చిన కెన్నీని నేనసలు పట్టించుకోలేదు. కాని మేమిద్దరం చిన్నప్పుడు ఒకే స్కూల్‌లో చదివిన సంగతి నాకిప్పుడే జ్ఞాపకం వచ్చింది. అతడు నాకన్నా నాలుగు లేదా అయిదు తరగతుల కింద ఉండేవాడు. అప్పట్లో అతడు కొంచెం మందమతిగా ఉండేవాడు. బడిలో అందరం మా సరదా కోసం కెన్నీని తెగ ఏడిపించేవాళ్లం. అతడి బట్టల్ని చించి, బూట్లను దాచేసి, అతడి డబ్బుల్ని దొంగిలించి.... ఇలా రకరకాలుగా బాధించేవాళ్లం. కెన్నీకి సహాయంగా ఎవరూ నిలిచేవారు కాదు. ఎందుకంటే తాము కూడా కెన్నీ లాగే ఇబ్బంది పడాల్సి వస్తుందని. అప్పట్లో కెన్నీ సమస్యల్లా తనను వేధించేవారిని

ఎలా ఎదుర్కోవాలనే! ఆ రోజుల్లో అతడు తనను సతాయించేవారిని జయించలేకపోయాడు.

గతంలోంచి బయటపడిన నేను, "తప్పకుండా, కెన్నీ! నాకు రెండు స్టాంపులు కావాలి" అన్నాను. నా జేబుల్లోంచి చిల్లరంతా బయటకు తీశాను. లెక్కపెడితే యాభై సెంట్లు ఉన్నాయి. నేను వాటిని కెన్నీ చేతిలో పెట్టి బతిమాలుతున్నట్లుగా చూశాను.

కెన్నీ ఆ డబ్బులు తీసుకుని.. "ఫర్వాలేదు. ఈసారికి నాకు కావల్సినంత డబ్బులు వచ్చాయి. కాని మీరు నాకు పది సెంట్లు బాకీ" అన్నాడు.

నిజమే! బహుశా నేను అంతకంటే ఇంకా ఎక్కువే బాకీ ఉన్నానేమో!

కెన్నీ ఆ డబ్బుల్ని సోడా మెషిన్‌లో వేసి ఒక్కక్షణం పాటు ఆగాడు. కొంతసేపు సందేహించినా, ఎప్పుడూ తాగే సోడానే తాగి 'రేపు కలుద్దాం' అని నాతో చెప్పి వెళ్ళి పోయాడు కెన్నీ.

నేనిప్పుడు గారేజ్ మొత్తం కలయజూశాను. కెన్నీ పనిలో చేరిన నాటినుంచి అదెంత పరిశుభ్రంగా ఉందో గ్రహించాను. గారేజ్‌లో ఓ మూల పాత ముస్తాంగ్ పడి ఉంది. దాన్ని చూస్తే నాకు సిగ్గేసింది. అది కెన్నీది కాకుండా మరేవరిదైనా అయ్యుంటే, ఈ పాటికి దాని మరమత్తులన్నీ పూర్తిచేసి ఉండేవాడినేమో!

అప్పు చేయకుండా, డబ్బు అవసరమైనప్పుడు స్టాంపులు అమ్ముకోవచ్చని చెప్పిన కెన్నీ అమ్మగారి తెలివైన ఆలోచన నాకెంతకానో నచ్చింది. ఆరోజుల్లో ఎంతమంది యువకులు ఆపాటి ఆత్మగౌరవం కలిగి ఉంటున్నారు? స్టాంపులు కొనడమనే ఆలోచనే కొందరికి హాస్యాస్పదంగా ఉంటుంది. స్టాంపులు దొంగిలించడం పెద్ద నేరమేమీ కాదని చాలామంది అభిప్రాయపడతారు.

గతంలో చేసిన తప్పులను దిద్దుకునే అవకాశం అన్నిసార్లూ రాదని నాకు తెలుసు. అలాంటి అవకాశం తలుపు తట్టినప్పుడు, 'చప్పుడు' గురించి ఫిర్యాదు చేయకూడదు మరి!

మర్నాడు ఉదయం నేను ఆ ముస్తాంగ్ కారును ఓ కళాఖండంగా మార్చడానికి సిద్ధమయ్యాను. కెన్నీ అందుకు అన్నివిధాలా అర్హుడు.

నాకంటే విభిన్నంగా ఉన్నారని, తక్కువస్థాయి వారని ఒకప్పుడు వివక్షతోను, దురభిమానంతోను నేను ఏడిపించిన పిల్లలందరికీ నేను తీర్చవలసిన బాకీ అది!

*(ఆంధ్రప్రభ వారపత్రిక, 9 నవబరు 2002)*

**'బాకీ' కథకి మూలం** 'The Learning Stamp' **అనే ఆంగ్లకథ.**
**మూలకథ** www.hopcott.freeserve.co.uk **అనే వెబ్‌సైట్‌లో ప్రచురితమైంది.**

# బొమ్మ

ఆంగ్లం : వరలొట్టి రంగసామి

"నాన్నా, ఈ గులాబీ రంగు టెడ్డీ బేర్ చాలా బావుంది కదా! మనం తీసుకుందామా?" అని అడిగింది నా కూతురు.

"వద్దు సింధూ, నీకు ఇంతకంటే పెద్ద టెడ్డీబేర్ కొనిస్తాను. సరేనా?" అని అన్నాను నేను.

"ఊహు! నాకు పెద్ద బొమ్మలంటే భయం! నాకిదే కావాలి" అంది సింధు. ఆ బొమ్మ ఖరీదు 795 రూపాయలు.

మేగజైన్లలో బొమ్మలు వేసుకుని బతికే నాలాంటివాడికి అది చాలా పెద్దమొత్తం. అలా అని మేమేమి పస్తులుండడం లేదు. 'అన్నం' సమస్యే కాదు... కాని మిగతావే!

మా తోటి ఉద్యోగి పెళ్ళి సందర్భంగా ఏదైనా బహుమతి కొందామని ఈ కొట్టుకి వచ్చాను. వస్తూ, వస్తూ సింధుని కూడ తీసుకురావడం పొరపాటైపోయింది. సింధు ఇంకా ఆశగా ఆ బొమ్మనే పట్టుకుని ఉంది. నిజాయితీగా ఉండడమే సింధు దగ్గర బాగా పనిచేస్తుందని నాకు తెలుసు.

"సింధు పాపాయి, దీని ధర చూసావా? 795 రూపాయలు. అంటే ఐదు రూపాయలు తక్కువ ఎనిమిది వందలన్నమాట. నాన్న పర్సులో ఎన్ని రూపాయలు ఉన్నాయో చూడు... అరవై రూపాయలే ఉన్నాయి. కాబట్టి ఈ బొమ్మని మనం ఇప్పుడు కొనుక్కోలేము. కానీ నీ పుట్టినరోజు నాటికి కొనిస్తాను. వచ్చే నెలలోనే కదా, సరేనా..." అని అన్నాను.

"ఒట్టు" అని అంది సింధు.

"ఒట్టు" అంటు మాటిచ్చాను.

మరుసటి రోజు సాయంత్రం నేను ఆఫీసు నుంచి రాగానే, సింధు గబగబా వచ్చి నా కాళ్ళను చుట్టేసుకుంది.

"నాన్నా, ఇంక 29 రోజులే..." అంది.

"దేనికమ్మా?" అని అడిగాను.

"నా పుట్టినరోజుకి! గులాబీరంగు టెడ్డీబేర్ మనింటికి రావడానికి!" ఉత్సాహంగా చెప్పింది సింధు.

ప్రతీ సాయంత్రం నేను ఇంటికి రాగానే రోజుల సంఖ్య గుర్తు చేయడం సింధుకి అలవాటుగా మారింది.

సింధు పుట్టినరోజు నాటికి ఆ టెడ్డీబేర్‌ని కొనాలని నిర్ణయించుకున్నాను. కాని ఎలా? ప్రతీ నెలా నాకు కొంత అదనపు పని దొరుకుతుంది. ఏదైనా ప్రత్యేక సంచికగాని, లేదా దినపత్రికలో కలర్-సప్లిమెంట్ గాని లేదా కనీసం కేలండర్ లేదా పోస్టర్‌లకు సంబంధించిన ఆర్ట్‌వర్క్ అయినా దొరుకుతుంది. వాటి ద్వారా వచ్చే కొద్దిపాటి అదనపు ఆదాయంతో మా కుటుంబంలో చిన్న-చిన్న సంతోషాలు-పిక్నిక్ లేదా సినిమాకి వెళ్ళడం లేదా మాలో ఎవరికైనా ఒక జత కొత్త బట్టలు కొనుక్కోడం లాంటివి-తీర్చు కుంటాం. ఈసారి అలాంటి పని ఏదైనా దొరికితే, ఆ వచ్చే డబ్బుతో సింధుకి టెడ్డీబేర్ కొనాలని అనుకున్నాను. కాని ఈ నెలలో అలాంటి అవకాశమేదీ కనిపించడంలేదు.

సింధు పుట్టిరోజు నాడు నేను చాలా భారమైన మనసుతో నిద్రలేచాను. టెడ్డీబేర్ కొనడానికీ డబ్బు లేదు. ఎలా అయినా సరే డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాను. టిఫిన్ కూడా తినకుండా, తొందరగా బయల్దేరాను. సింధు నిద్రపోతోంది. సింధు గది లోంచి నిశ్శబ్దంగా జారుకుందామనుకుంటూ, బయటికి వస్తుంటే, సింధు దుప్పటిలోంచి ముఖం బయటపెట్టి, "నాన్నా, నాకు శుభాకాంక్షలు చెప్పడం మర్చిపోయావు" అని అంది.

"నా చిట్టితల్లికి పుట్టినరోజు శుభాకాంక్షలు" అని గొణుగుతూ, పాప నుదుటిపైన చిన్నగా ముద్దు పెట్టుకున్నాను. నా కళ్ళ నీళ్ళు పాప ముఖంపైకి జారకుండా జాగ్రత్త పడ్డాను. గదిలోంచి బయటకు వచ్చేస్తుండగా, "నాకు తెలుసు నాన్నా, ఈరోజు నువ్వు నాకు గులాబీ రంగు టెడ్డీబేర్ తెస్తావు. నీకోసం ఎదురుచూస్తుంటాను.." అని అంది సింధు. మౌనంగా ఆఫీసుకి బయల్దేరాను.

సాయంత్రమైంది. ఇంటికి బయల్దేరేముందు, మా సబ్-ఎడిటర్‌ని కలసి ఎనిమిది వందలు అడ్వాన్సు అడుగుదామని నిశ్చయించుకున్నాను. నెలాఖర్లో నా జీతంలో తగ్గించు కోమని చెబుతాను. కొన్ని నెలవారీ ఖర్చులను తగ్గించుకోవాల్సి వస్తుంది. అయినా పర్వాలేదు.

నా అవసరాన్ని సబ్-ఎడిటర్‌కి వివరించాను. అయితే అనూహ్యంగా ఆయనో ప్రతిపాదన చేశారు.

"చూడు, నువ్వు అడ్వాన్సు అడుగుతున్నావు. నేనేమో నీకు అదనపు ఆదాయం వచ్చే మార్గం సూచిస్తున్నాను. ఈ మూడు కథలకీ నువ్వు బొమ్మలు వేయాలి. నీకు తొమ్మిది వందలు ఇస్తాను. కాని ఈ బొమ్మలు ఈరోజు రాత్రికే ప్రెస్‌కి వెళ్ళిపోవాలి. అంటే నువ్వు ఇప్పటికిప్పుడు, ఇక్కడే కూర్చుని బొమ్మలు గీసివ్వాలి. నీలాంటి సమర్థుడికి అదేమంత కష్టమైన పనికాదులే. మహా అయితే రెండుగంటలు పడుతుంది. నువ్వు ఎనిమిది గంటలకల్లా డబ్బుతో వెళ్ళిపోవచ్చు. నీ కూతురు పుట్టినరోజును ఘనంగా జరుపుకోవచ్చు. ఏమంటావు?" అని అడిగారాయన.

నాకు గత్యంతరం లేదు.

నిజమైన చిత్రకారుడెవ్వరూ కాలపరిమితికి లోబడి మంచి బొమ్మలు గీయలేదు. పనిలో నిమగ్నమవగానే, నేను సమయం గురించి, సింధు పుట్టినరోజు గురించి, టెడ్డీబేర్ గురించి పూర్తిగా

మర్చిపోయాను. పని ముగించుకుని, డబ్బు తీసుకుని బయట పడేసరికి సమయం రాత్రి తొమ్మిది గంటలు దాటిపోయింది.

బహుమతి కొనడానికి గబగబా కొట్టుకు వెళ్ళాను. కాని అది అప్పటికే మూసేసి ఉంది. నిస్పృహగా ఇంటివైపు నడిచాను. ఇల్లు చేరిన మరుక్షణమే నా భార్య సింధు గురించి చెప్పుకొచ్చింది.

"పాపమండి! గుమ్మం దగ్గర చప్పుడైనప్పుడల్లా మీరేననుకుని బయటకు పరిగెత్తు కొచ్చింది. సాయంత్రం నుండి ఏమీ తినలేదు. 'నాన్న టెడ్డీబేర్ తీసుకొస్తారు. అప్పుడు నేను నాన్నా, టెడ్డీబేర్ కూర్చుని ఒకేసారి తింటాం...' అని అంది. ఇప్పుడే పడుకుంది."

నాకు బాధ, జాలి కలిగాయి. అన్నం తినాలనే కోరిక నశించింది. కాంప్లిమెంటరీ కాపీగా వచ్చిన ఓ పత్రికని నిరుత్సాహంగా తిరగేయసాగాను. అందులో ఏదో పోటీ ఫలితాలను ప్రకటించారు. విజేతలకి బహుమతి విలువకు సరిపోయే గిఫ్ట్ కూపన్లని ఇస్తామని, వాటిని కొన్ని ఎంపిక చేసిన కొట్లలో ఇచ్చి, తమకు కావల్సిన వస్తువులు తీసుకోవచ్చని తెలిపారు. వెంటనే నాకో ఉపాయం తట్టింది. ఓ ఛార్టుపైన, కొట్లో చూసిన టెడ్డీబేర్ బొమ్మని చిత్రించాను. దానికి చక్కగా గులాబీరంగు వేసాను. అయితే అలవాటుగా బొమ్మ కింద నా సంతకం చేసేసాను.

మా ఆవిడ కొన్న చాక్లెట్ల బాక్సు తీసుకుని, సింధుని నిద్ర లేపసాగాను. నా గొంతు వినగానే సింధు లేచి కూర్చుంది.

"సింధు పాపాయి, మళ్ళీ ఇంకోసారి నీకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతు న్నాను. ఇదిగో చాక్లెట్లు, ఇదిగో టెడ్డీబేర్, రేపు గాని లేదా మరో రోజుగాని ఈ గిఫ్ట్ కూపన్‌ని తీసుకెళ్ళి కొట్లో అంకుల్‌కి ఇస్తే, నీకు నిజం టెడ్డీబేర్‌ని ఇచ్చేసారు..." అని చెప్పాను.

"నాన్నా, ఈ బొమ్మని నువ్వే వేసావు కదూ?" అని అడిగింది సింధు. నేను తలూపాను. అంతకుముందే నేను మా ఆవిడకి నా పథకం వివరించాను. సింధు ఎప్పుడైతే కొట్టుకి వెళ్ళి నిజం టెడ్డీబేర్‌ని తీసుకోవాలనుకుంటుందో ఆరోజు మా ఆవిడ సింధుకి తెలియకుండా, కొట్టు యజమానికి ఆ బొమ్మ ఖరీదు చెల్లిస్తుంది. ఆయనేమో సింధు గిఫ్ట్ కూపన్‌ని ఇవ్వగానే నిజం టెడ్డీబేర్‌ని ఇచ్చేయాలన్నమాట. ఇదీ నా ఆలోచన.

సింధు చార్టుమీద వేసి ఆ బొమ్మని చూసి చాలా సంబరపడింది. దాన్నే తదేకంగా చూస్తుండిపోయింది.

"నాన్నా, ఇది దాదాపు మనం కొట్లో చూసిన బొమ్మలాగే ఉంది. థాంక్స్ నాన్నా, ఇంతమంచి బొమ్మ ఇచ్చావు..." అని అంది.

మరుసటిరోజు సాయంత్రం ఆఫీసు నుంచి రాగానే టెడ్డీబేర్ గురించి మా ఆవిడని అడిగాను.

"ఎందుకో ఏమో, సింధు టెడ్డీబేర్ గురించి అడగలేదు" అని చెప్పింది మా ఆవిడ.

నాకు ఆశ్చర్యం వేసింది. నేనే స్వయంగా సింధుని ఆ కొట్టుకి తీసుకువెళ్ళి, బొమ్మని కొనిస్తే

మంచిదేమో అని అనిపించింది.

"సింధు పాపాయి, మనం ఆ కొట్టుకు వెళ్ళి నిజం టెడ్డీబేర్‌ని తెచ్చుకుందామా?" అని అడిగాను.

సింధు నన్ను చూస్తూ ఆలోచించసాగింది. కాసేపయ్యాక, "నా మనసు మార్చుకున్నాను నాన్నా. నువ్వు వేసిన ఈ బొమ్మ చాలా బావుంది. ఇంతమంచి బొమ్మని, షాపు అంకుల్‌కి ఎందుకు ఇవ్వాలి? వద్దు. నాకు ఆ గులాబీరంగు టెడ్డీబేర్ వద్దు. నువ్వు వేసిన ఈ బొమ్మే కావాలి. ప్రపంచంలోని ఏదిచ్చినా, దీన్నిమాత్రం నేను వదులుకోను.." అని చెప్పింది స్థిరంగా.

ఈ సమాధానం వినగానే నాకెంత సంతోషం వేసిందంటే... అంతర్జాతీయ పోటీలలో నా చిత్రానికి ప్రథమ బహుమతి వచ్చినా కూడా నేనంతగా సంబరపడనేమో!

ప్రపంచంలో ఉన్న అన్ని గులాబీరంగు టెడ్డీబేర్‌లని కొనేసి, నా చిన్నారి యువరాణి పాదాల వద్ద ఉంచాలని నాకు బలమైన కోరిక కలిగింది.

*(ఆదివారం అనుబంధం, వార్త 2 జులై 2006)*

**'బొమ్మ' కథకి మూలం** The Teddy Bear **అనే ఆంగ్ల కథ. మూలకథ 7.05.06నాటి** Deccan Herald **దినపత్రిక యొక్క ఆదివారం అనుబంధంలో ప్రచురితమైంది.**

# అమ్మ వస్తే బాగుండు

ఆంగ్లం : లీలాన్

నేను చిన్నప్పుడు నదిఒడ్డున ఉన్న ఓ గ్రామంలో మా తాతయ్యగారింట్లో వుండే దాన్ని. వారి పశువులను కాసే కన్నా నా ప్రియమిత్రుడు. పశువులను మేపడానికి వెళ్లే టప్పుడు కన్నాతోపాటు నేనూ వెళ్లేదాన్ని. ఎందుకంటే అతడి చొక్కాజేబులలో తినుబండారాలు వుండేవి. పక్షులను వేటాడడానికి 'వుండేలు' 'ఉండేది. పశువులు మేత మేస్తుంటే, మేమిద్దరం నది ఒడ్డున మట్టిలో ఆడుకునేవాళ్లం. మా ఇద్దరికి ఇష్టమైన ఆట 'టార్జాన్!' మా శరీరాలను అరటి ఆకులతోను, పూలతోను కప్పుకునేవాళ్ళం. కన్నా టార్జాన్ అయితే నేను జేన్ వేషం కట్టేదాన్ని. కన్నా చేపలనుగాని, పిట్టలనుగాని వేటాడి తెస్తే నేను పళ్ళు ఏరుకొచ్చేదాన్ని. భోజన సమయంలో మేం తెచ్చుకున్న వాటిని సమానంగా పంచుకుని విందు చేసుకునేవాళ్లం. కొన్నిసార్లు యుద్ధాలు జరిగేవి. ఎందుకంటే మా గ్రామంలో కన్నా ఒక్కడే టార్జాన్ కాదు. ఇంకా చాలామంది ఉండేవారు. వాళ్లంతా కన్నా కంటే చాలా పెద్దవాళ్లు, బలవంతులు. అందుకని సాధారణంగా మేమే లొంగిపోయి సంధి కుదుర్చు కునేవాళ్లం.

డిసెంబరు నెల చివరి రోజులవి. వరి పంట కోతకొచ్చింది. ధాన్యం ఇంటికి చేరినప్పుడు వాటిని ఇంటి ఆవరణలో ఆరబెట్టేవాళ్లం. ఆ సమయంలో ధాన్యం గింజల కోసం, ఎండుగడ్డి కోసం పక్షులు మా ఇళ్ళ పైకప్పులపై వాలేవి. చక్కటి కుహూరావాలు చేసేవి. ఇవన్నీ 'టెట్' పండుగ వస్తోందనడానికి సూచనలు. పిల్లలకు కొన్ని రోజులపాటు  సెలవులు, వేటగాళ్లకు చేతినిండా పని. ఈ పండుగలలో మాకు వేట మాంసంతోను, ఉడికించిన గుడ్లతోను విందు జరిగేది. మేమే ఆతృత ఆపుకోలేక ఉడిడీ ఉడకని గుడ్లను పగలగొట్టుకొని నోట్లో కుక్కుకునేవాళ్లం. వాటి రుచి అమోఘం.

కన్నా పళ్లకోసం చెట్టెక్కినప్పుడు కొన్నిసార్లు గూళ్లలో పక్షుల గుడ్లు కనపడేవి. ఒకరోజు కన్నా నాకోసం పరిగెత్తుకొచ్చాడు. 'గిజిగాడి గూడు చూశాను. నీక్కూడా చూపిస్తాను రా' అంటూ నన్ను నది ఒడ్డున వున్న ఓ పెద్ద కొబ్బరి చెట్టు దగ్గరికి తీసుకెళ్లాడు. ఆ చెట్టు చిటారు కొమ్మమీద ఎండు గడ్డితో అల్లిన అందమైన గూడు కనపడింది. మేమిద్దరం దాన్ని చూస్తుండిపోయాం.

ఇంతలో అక్కడికి మరో కొత్త టార్జాన్ వచ్చాడు. మా ఇద్దరి చెవులు పట్టుకుని 'మార్యాదగా ఇక్కడినుండి పొండి, ఈ పక్షి నాది' అన్నాడు. మేం చేసేదేంలేక మా చెవులను రుద్దుకుంటూ దూరంగా వెళ్లి నిలుచున్నాం. కొత్త టార్జాన్ తన నాటు తుపాకీని పొగరుగా పక్షి గూటికేసి గురిపెట్టడాన్ని మేం నిరాశగా చూశాం. అయితే ఆ సమయంలో పక్షి గూటిలో లేదు. దానికోసం

ఎదురుచూసి విసిగిపోయాడు కొత్త టార్జాన్. 'పక్షి కనబడితే నన్ను పిలవండి. అర్థమైందా?' అంటూ అక్కడినుంచి కదిలాడు. కొన్ని నిమిషాలు గడిచాయి. ఈ పెద్ద టార్జాన్‌కి కావాల్సింది పక్షి మాత్రమేనని కన్నాకి అర్థమైంది. కష్టపడితే, ఆ అందమైన గూడును తాను దక్కించుకోవచ్చని కన్నాకి తోచింది. అటు ఇటు చూశాడు. తనని ఎవరూ చూడడంలేదని నిర్ధారించుకున్నాక గబగబా చెట్టు ఎక్కాడు. గూటిలోకి తొంగిచూశాడు. అక్కడ రెండు గుడ్లు ఉన్నాయి. 'వాటిని నాకు చూపేంతలోనే తల్లి పక్షి అక్కడికి రావటం చూశాం. కన్నా గూటిని చెట్లకొమ్మల మధ్య దాచేశాడు. ఆ పక్షిని తరమడానికి నేను, కన్నా గట్టిగా అరవసాగాం. ఆ పక్షి వేటగాడి చేతిలో చావాలని మేము కోరు కోవడం లేదు. కాని అది కొబ్బరి చెట్టు చుట్టూ ఎగురుతూ అరవసాగింది. 'తన పిల్లల కోసం వెదుకుతున్నట్లుంది' అన్నాడు కన్నా. ఇంతలో 'ఢాం' అంటూ తుపాకీ పేలిన చప్పుడు వినిపించింది. మేమిద్దరం ఉలిక్కిపడ్డాం.

కాని తూటా పక్షికి తగలలేదు. 'ఢాం' అంటూ మరోసారి తుపాకీ పేలింది. అయితే ఈసారి కూడా పక్షి తప్పించుకుంది. కాని మళ్లీ మళ్లీ కొబ్బరిచెట్టు చుట్టూ గుండ్రంగా ఎగురుతూ తన గూడును వెదుక్కోసాగింది. 'ఢాం' అని మరోసారి తుపాకీ పేలింది. జరుగుతున్న ఘోరం చూడలేక మేమిద్దరం కళ్లు మూసుకున్నాం. నాకు ఏడుపు ఆగడం లేదు. మేం కళ్లు తెరిచేసరికి ఆశ్చర్యంగా ఆ పక్షికి ఏమీ కాలేదు. గాయపడకుండా ఇంకా ఎగురుతూనే ఉంది.

'పో పో! ఇక్కడి నుంచి పారిపో. లేకపోతే నిన్ను చంపేస్తాడు' అంటూ కన్నా పెద్దగా అరవసాగాడు. మేమిద్దరం గట్టిగా అరుస్తూ, పిచ్చిగా గెంతసాగాం. పెద్ద టార్జాన్‌కి కోపం వచ్చింది. మమ్మల్నిద్దరిని చెరో గుద్దు గుద్ది తన దారిన తాను పోయాడు. కన్నా గబగబా చెట్టెక్కి, గూడును కొమ్మమీద పెట్టేశాడు. కాని సరిగ్గా ఇంతకుముందున్న స్థలంలో మాత్రం పెట్టలేకపోయాడు. తర్వాత చప్పట్లు కొడుతూ 'ఇదిగో నీ గూడు. వెనక్కిరా' అంటూ ఆ పక్షిని పిలవసాగాడు.

మా సదుద్దేశ్యాన్ని అర్థం చేసుకోలేక ఆ పక్షి కొబ్బరిచెట్టు చుట్టూ ఎగురుతూనే ఉంది. 'నీకేం కాదు. నీ గూడు భద్రంగా ఉంది' అంటూ కన్నా అరవసాగాడు. అతడి కళ్లలో నీళ్లు ఆగడంలేదు. బహుశా గిజిగాడు కూడా అలసిపోయినట్టుంది. దాని కూతలు బలహీనంగా వినబడుతున్నాయి. అది మరింత పైపైకి ఎగిరిపోయింది.

'వెళ్లొద్దు. వెళ్లొద్దు. నువ్వు వెళ్లిపోతే నీ పిల్లలను ఎవరు చూస్తారు?' అంటూ కన్నా అరవసాగాడు. తాతయ్య మమ్మల్ని వెదుక్కుంటూ వచ్చేవరకు మేం ఆ పక్షి కోసం ఎదురుచూస్తూనే ఉన్నాం. తాతయ్యని చూస్తూనే 'రేపు నేను పనికి రానండి' అని చెప్పాడు కన్నా తాతయ్యతో. ఏం ఎందుకని? అడిగారు తాతయ్య.

'ఈరోజు గిజిగాడు తన పిల్లలను వదిలి వెళ్లిపోవడానికి నేనే కారణమయ్యాను. ఇదివరకు మా అమ్మ ఇంట్లోంచి వెళ్లిపోయినప్పుడు 'తల్లీబిడ్డలను విడదీసిన పాపం ఏడు జన్మలకుగాని పోదని

మా అమ్మమ్మ అత్తతో అనడం నేను విన్నాను. నేను చేసిన పాపానికి పరిహారం చేసుకోవాలి' అని చెపుతూ వెక్కి వెక్కి ఏడవసాగాడు కన్నా. తాతయ్య కన్నా తన నిమిరారు. 'మీ అమ్మ ఇంట్లోంచి వెళ్లిపోలేదు. ఉద్యోగరీత్యా మీకు దూరంగో ఉంటోంది. ఈ టెట్ పండుగకు ఇంటికి వస్తోంది. ఏ తల్లి కూడా తన బిడ్డలను కావాలని వదిలేయదు. తల్లి పక్షి కూడా అంతే. రేపొద్దున్నే ఆ పక్షి తన గూడు కోసం, తన పిల్లల కోసం తిరిగి వస్తుంది. నా మాటలమీద నమ్మకం లేకపోతే, రేపొద్దున ఇక్కడికి వచ్చి చూడు' అని నచ్చజెప్పి మమ్మల్ని ఇంటికి తీసుకెళ్లారు తాతయ్య.

మర్నాడు పొద్దున్నే మేమిద్దరం కొబ్బరిచెట్టు దగ్గరకి వెళ్లాం. గిజిగాడు తన గూట్లో కూర్చుని ఉంది. మా ఆనందానికి అంతేలేదు. నోటికి వచ్చిన పాటలు పాడుతూ, గెంతులు వేశాం. 'టెట్ పండుగకు అమ్మ వస్తుంది' అంటూ కన్నా హుషారుగా ఉన్నాడు. పండుగ కోసం మేమిద్దరం ఎదురుచూసినంతగా మరెవరూ ఎదురుచూసి వుండరేమో. కన్నావాళ్ల అమ్మ ఇంటికి వచ్చింది. మా అమ్మ మాత్రం రాలేదు. ఇప్పుడు పెద్దయ్యాక నాకు మరణం అంటే ఏమిటో తెలిసింది. కానీ నేను ఇప్పటికీ కొత్త సంవత్సరం వచ్చినప్పుడల్లా 'అమ్మ వస్తే బాగుండు' అని ఎదురుచూస్తూనే ఉన్నాను.

*(ప్రజాశక్తి దినపత్రిక, 14, 21 డిసెంబరు 2005)*

**'అమ్మ వస్తే బాగుండు' కథకి మూలం Tet అనే ఆంగ్లకథ.**
**మూలకథ** www.wilmingtonblues.com **అనే వెబ్‌సైట్‌లో ప్రచురితమైంది.**

# లాటరీ

**హిందీమూలం : రాకేష్ త్యాగి**

బస్సు బైపాస్ రోడ్డు మలుపు తిరుగగానే, విశాల్ లేచి, "కాస్త ఆపండి" అని అన్నాడు. కండక్టర్ విజిల్ వేసి బస్ ఆపించగానే విశాల్ తన సామాన్లు తీసుకుని కిందకి దిగాడు. బస్ వెళ్లిపోగానే, అతడు తన సంచీని భుజాన తగిలించుకుని చుట్టుపక్కల కలియ జూశాడు. ఆ కూడలిలో చాలా 'సెవన్ సీటర్ ఆటోలు' ఆగి ఉన్నాయి. క్రితం ఏడాది వరకు ఈ కూడలి దాదాపు నిర్మానుష్యంగా ఉండేది. కాని కిళ్ళీకొట్లు, ఆటోలు రావడంతో ఇప్పుడు రద్దీగా కనపడుతోంది. చిన్న చిన్న గుడిసెలలో టీ కొట్లు కూడా వచ్చాయి.

విశాల్ తన ఇంటికి నడిచి వెళ్ళాలంటే సుమారు 20-25 నిమిషాలు పడుతుంది. కాని ఆ దారిలో ఏదో ఊరేగింపు జరుగుతోంది. ఇంకో దారిలో ఇంటికి వెళ్ళాలంటే ఆటోలో వెళ్ళక తప్పదు. ఆటో స్టాండు కేసి చూశాడు. అక్కడ వరుసలో సిద్ధంగా ఉన్న ఆటోలో దాదాపు ఐదారుగురు కూర్చుని ఉన్నారు. విశాల్ కూడా అందులో ఎక్కి కూర్చున్నాడు. కాసేపటికి మరో ఇద్దరు విద్యార్థులు కూడా వచ్చి కూర్చున్నారు. డ్రైవరు ఆటోని స్టార్ట్ చేసి, చుట్టుపక్కలా చూడసాగాడు.

"ఇంక పోనీవయ్యా, "సీట్లు నిండిపోయాయి" అని వెనుకనుంచి ఎవరో అరిచారు.

"ఇంకో ఇద్దరు కూర్చోవచ్చు" అన్నాడు డ్రైవరు. అంతలో ఇంకో డ్రైవరు వచ్చి ఈ డ్రైవరుతో మాట్లాడసాగాడు.

– "అన్నా, నిన్న కొద్దిలో తప్పిపోయింది. 'రెండో నంబరు' వచ్చింది. నేను పది టికెట్లే కొన్నాను. ఏదో టీ ఖర్చులకు సరిపోయేంత వచ్చింది.." చెప్పాడతను.

"నేనైతే నిన్న అసలు టికెట్ కొనలేదు. పగలంతా ఈ డొక్కు బండిని బాగు చేయించడమే సరిపోయింది. సాయంత్రం కాలువ దగ్గర ఆఫీసర్‌గారు కనిపించి, 'పద! షరాన్‌పూర్ వెళ్ళి కుర్చీ, మేజాబల్ల తెచ్చుకుందాం' అంటూ పిల్చారు. 'ఏం చేస్తాం, తప్పదు' అని అనుకుంటూ వెళ్ళి ఆయన సామానులు వాళ్ళ ఇంటి దగ్గర దింపాను. ఆయనను డబ్బులేం అడుగుతాం? పైగా ఆయన జేబులో చేయి కూడా పెట్టలేదు.." అన్నాడు విశాల్ ఎక్కిన ఆటో డ్రైవర్ రుసరుసలాడుతూ.

"ఏం చేస్తాం అన్నా, ఎక్కడ చూసినా ఇలాంటివాళ్ళే ఎక్కువయ్యారు." అని అన్నాడు ఇంకో డ్రైవరు. ఇంతలో ఇంకో ఇద్దరు ప్రయాణీకులు వచ్చి డ్రైవరుకి రెండు ప్రక్కలా కూర్చున్నారు.

"గోవింద్, నేనొక రౌండ్ వేసొస్తాను' అని అంటూ ఆటోని పోనిచ్చాడు డ్రైవరు. ఆటో

పరుగెదుతుంటే విశాల్ దారికి అటూ ఇటూ పొలంలో కనిపిస్తున్న గోధుమ పైరుని చూడసాగాడు. ఆ దృశ్యం మనోహరంగా ఉంది. కొంచెం దూరంగా ప్రవహిస్తున్న నది ఇంకా అందంగా ఉంది. "పట్టణ ప్రాంతంలోని జనాలకు దూరంగా, పల్లెలకు, అందు లోను పర్వత ప్రాంతాలకు రావడం ఎంతో బావుంటుంది..." స్వగతంలో అనుకున్నాడు విశాల్.

"గవర్నమెంట్ ఆఫీసుల దగ్గర ఎవరైనా దిగాలా" అని అడిగాడు డ్రైవరు.

"నేను దిగాలి. కాస్త ఆపు" అని అన్నాడు విశాల్. ఆటో దిగి డబ్బులిచ్చి, ఇంటివైపు నడవసాగాడు. ఆ దారిలోంచి వెడుతుంటే, గజానికి ఒకరు చొప్పున, స్టూలు స్టాండ్ పెట్టు కుని లాటరీ టికెట్లు అమ్ముతున్నవాళ్ళు కనపడ్డారు. వాళ్ళని చుట్టుముట్టి ఉన్న కొనుగోలు దార్లు, వీళ్ళ అరుపులు, కేకలతో వీధి వీధింతా గోల గోలగా ఉంది. కొండ ప్రాంతంలోని ఈ చిన్న ఊరిలో లాటరీ ఇంతలా విజృంభిస్తుందనుకోలేదు విశాల్. ఒకప్పుడు 'ఉత్తరాంచల్' రాష్ట్రం ఏర్పడకముందు, అక్కడక్కడ చెదురుమదురుగా ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగే ఆందోళనలు, అంతకుముందు 'మందిరం – మసీదు'ల గొడవలు తప్ప ఈ ప్రాంతంలో మరే సమస్య ఉండేది కాదు. చాలా ప్రశాంతంగా ఉండేది ఈ ఊరు.

గాలి బాగా వీస్తోంది. నేలపైన సగం చింపి పడేసిన లాటరీ టికెట్లు కొన్ని ఎగిరొచ్చి విశాల్ మీద పడ్డాయి. కిందకి జారిన వాటిని కాలితో తొక్కిపెట్టి, ఒక టికెట్ ముక్కని పైకి తీశాడు. దానిమీద 'స్టార్ డైలీ లాటరీ' అని రాసుంది. దాన్ని ఉండలా చుట్టి విసిరేసి, ఇంటివైపు నడిచాడు. విశాల్ సొంత ఊరికి వచ్చి దాదాపు ఏడాది కావస్తోంది. ఈమధ్యకాలంలో ఊరిలో చాలా మార్పులు వచ్చాయి.

H H H

విశాల్ సాయంత్రం షికారుకి బయల్దేరుతుండగా, సునీల్‌కాంత్ ఎదురయ్యారు.

"ఎప్పుడొచ్చావు?" అని ఆయన విశాల్‌ని అడిగారు. "పొద్దున్నే" అని చెప్పాడు విశాల్. ఇద్దరూ పిచ్చాపాటి మాట్లాడుకోసాగారు.

"మన ఊర్లో లాటరీ తన ప్రతాపం చూపిస్తున్నట్లుంది" అని అన్నాడు విశాల్.

"ఈ ప్రలోభం చాప కింద నీరులా వ్యాపిస్తోంది. లాటరీ కోసం జనాలు వెర్రెక్కి పోతున్నారు. ప్రతి మనిషి పిచ్చివాడైపోతున్నాడు.." చెప్పారు సునీల్‌కాంత్.

"దీని దుంపతెగ! కాని ఇంత చిన్న ఊర్లోకి లాటరీ ఎలా రాగలిగింది?" అంటూ ఆశ్చర్యపోయాడు విశాల్.

"ఈ ప్రశ్న మాత్రం నన్ను అడగొద్దు. గత ఎనిమిది, తొమ్మిది నెలలుగా ఉప్పెనలా ముంచెత్తు తోంది. లాటరీ ఒకసారి ఊర్లోకి అడుగుపెట్టడమే కష్టం. ఒకసారి ప్రవేశించాక విస్తరించడం ఎంతో సులభం! అందరూ సులువుగా ధనవంతులైపోవాలని ఆశపడుతున్నారు. సాయంత్రం

ఆఫీసవగానే, లాటరీ సెంటర్ల దగ్గరికి చేరిపోతారు...” నిస్పృహగా చెప్పారు. సునీల్‌కాంత్.

“అత్యాశకి పోయి డబ్బంతా వృధా చేస్తున్నారు. ఇది కూడా జూదమే” అన్నాడు విశాల్.

“మొత్తం జీతమంతా ఈ లాటరీ టికెట్లకే ఖర్చు చేసేవాళ్లున్నారు...” చెప్పారు సునీల్‌కాంత్. మళ్ళీ ఆయనే మాట్లాడుతూ, “అన్ని జాగ్రత్తలు పాటించి లాటరీ టికెట్లు కొంటారు. గత కొన్ని నెలల ఫలితాలను మథించి, ఏ నెంబరుకి లాటరీ తగులుతుందో లెక్కేసుకుని మరీ కొంటారు...” అని చెప్పారు.

“తమ తెలివితేటలన్నీ ప్రదర్శిస్తారేమో...” అన్నాడు విశాల్ చిన్నగా నవ్వుతూ.

“అవును. ఎక్కడ విన్నా నెంబర్ల మాటే. జనాలకి ఏ మైకం కమ్మిందో తెలియదు. ఆడా మగా, పిల్లలనే తేడా లేదు. అందరూ లాటరీ సెంటర్లపై ఎగబడుతున్నారు. స్కూలు పిల్లలైతే, పుస్తకాలని అమ్మేసి మరీ లాటరీ టికెట్లు కొంటున్నారు” చెప్పారు సునీల్‌కాంత్.

“ఈ లాటరీల వల్ల ఎంత ఉపద్రవమో మీకు తెలియనిది కాదు. మీకు జ్ఞాపకం ఉందా? కొన్నేళ్ళ క్రితం ‘ఇన్‌స్టెంట్ లాటరీ’లని నడిచేవి. ‘నవభారత్ టైమ్స్’కి చెందిన విలేకరి ఒకరు కనీసం లాటరీ టికెట్ల వంకైనా చూడకుండా ఏ నెంబరుకి లాటరీ తగులు తుందో కోర్టులో నిరూపించాడు. అప్పుడేకదా కోర్టు’ ఇన్‌స్టెంట్ లాటరీ’లను నిషేధించింది” అని గుర్తు చేశాడు విశాల్.

“ఏమన్నావు? ఉపద్రవమా? ఉత్సాహంగా పందాలు కాస్తున్నారిక్కడ. ఏ నెంబరుకి లాటరీ తగిలేది పందాలు కాసుకుంటున్నారు. జనాలు లాటరీ టికెట్టు కొనడమే కాకుండా, పందాలు కట్టి మరీ డబ్బు పోగొట్టుకుంటున్నారు” వాపోయాడు సునీల్‌కాంత్. మళ్ళీ ఆయనే మాట్లాడుతూ “లాటరీ నిర్వాహకులకి, పందాలను ప్రోత్సహించేవాళ్ళకి మధ్య సంబంధాలుంటాయి. జనాలు ఎక్కువ ఏ నెంబరుపై పందెం కాస్తారో, ఆ నెంబరుకి లాటరీ అస్సలు తగలదు” అని అన్నారు.

“అవును, తమకి నష్టం రావాలని వాళ్ళెందుకు కోరుకుంటారు? వాళ్ళేమీ ఉచిత సేవలు అందించడం లేదే? ప్రజలే నిజానిజాలు గ్రహించాలి” అన్నాడు విశాల్ ఆలోచనగా.

విశాల్ వైపుకి కొద్దిగా వంగి, “ఈ పందాలను మట్కా అని అంటారు. ఎవరైనా రెండు లాటరీ టికెట్ల నెంబర్లపై పందెం కాస్త, దాన్ని ‘కంబైన్డ్’ అని అంటారు” చెప్పారు సునీల్‌కాంత్.

“కానీ ఫలితాలను ప్రకటించేది అధికారులు కదా. మరి పందాలను ప్రోత్సహించేవాళ్ళు ఫలితాలను ఎలా ప్రభావితం చేయగలరు?” అనడిగాడు విశాల్.

“చెప్తాను. టికెట్‌లోని చివరి అంకెను నిర్వాహకులే ముందుగా ప్రకటిస్తారు. ఈపందాలన్నీ, ఆ చివరి అంకె కలవడానికే...” అన్నారు సునీల్‌కాంత్.

“ఆహా, అప్పుడే జనాలు రెండంకెల టికెట్టా, లేక నాలుగంకెల టికెట్టా అనేది నిర్ణయించుకుంటారన్న మాట...” అన్నాడు విశాల్.

“ఈ అంకెల ఆటకీ బాగా డబ్బు కావాలి. ఎంత డబ్బు కావాలంటే, మనం కోరుకున్న

నెంబరు తగిలే వరకు, అదే నెంబరు మీద రోజు రోజుకి రెట్టింపు టికెట్లు కొనేంత కావాలి...” చెప్పారు సునీల్‌కాంత్.

విశాల్ తనకేసి అర్థంకానట్లు చూసేసరికి, మరింత వివరించసాగారు సునీల్‌కాంత్.

“ఉదాహరణకి నువ్వు ఈరోజు ఆరో నెంబరు టికెట్ ఒకటి తీసుకున్నావనుకో. రేపు రెండు టికెట్లు, ఎల్లుండి నాలుగు టికెట్లు... అలాగన్న మాట. ఇలా నెలంతా ఆరో నెంబరు టికెట్టే కొంటుంటే, నువ్వు ఎంత ఖర్చు చేశావో, దానికి రెట్టింపు డబ్బు వచ్చే అవకాశం ఉంది. ఎందుకంటే ఉన్నవి 9 అంకెలే కదా. నువ్వు అనుకున్న అంకె ఏదో ఒకరోజు వచ్చి తీరుతుంది.”

“లాటరీ విషయాలని మీరు బాగా అధ్యయనం చేసినట్లున్నారు. మీరెప్పుడైనా లాటరీ టికెట్ కొన్నారా?” అడిగాడు విశాల్.

“కొనాలని ఓరోజు ఊగిసలాడాను. ఉదయం ఎందుకో నాలుగో నెంబరుకి లాటరీ తగులుతుందనిపించింది. కాని టికెట్ కొనలేదు. సాయంత్రం ఫలితాలను ప్రకటించేదాకా. నిజంగానే నాలుగో నెంబరు టికెట్‌కి లాటరీ వచ్చింది. అప్పుడు కొంచెం బాధనిపించింది” చెప్పాడు సునీల్‌కాంత్. ఆయన స్వరంలో పశ్చాత్తాపం ధ్వనించినట్లయింది.

ఆయన మాటలకి విశాల్‌కి నవ్వొచ్చింది. నవ్వుని దాచుకుని, ఆయన వద్ద సెలవు తీసుకుని ఇంటి ముఖం పట్టాడు. ఇంట్లోకి అడుగు పెడుతుంటే, వీధిలో ఓ విచిత్రమైన దృశ్యం కనపడింది. దాదాపు 50-52 ఏళ్ళ వయసున్న ఆసామి ఒకరు సైకిల్‌పై వెడుతు న్నాడు. ఆయన చుట్టూ సుమారు 9 కుక్కలు కూడా వెడుతున్నాయి. నాయకులకుండే ఎస్కార్టులా!

విశాల్ లోపలికి వెళ్ళి వాళ్ళమ్మని ఆయనెవరని అడిగాడు. “ఆయనా, భీమ్‌సింగ్! ఒంటరివాడు కదా, అందుకని కుక్కల్ని పెంచుకుంటుంటాడు. సంపాదించేదంతా, వాటి పైనే ఖర్చు చేస్తాడు. సాయంత్రం ఆఫీసునుంచి ఇంటికి వచ్చేటప్పుడు వాటి కోసం బిస్కట్లు, బ్రెడ్ తెస్తుంటాడు” అని చెప్పారావిడ.

“కుక్కలకి మారాజు అన్నమాట!” అని అన్నాడు విశాల్ హాస్యంగా.

“ఈ కుక్కలు కూడా ఆయనని వదలవు. ఆయన ఆఫీసుకి వెళ్ళేటప్పుడు బస్‌స్టాప్ దాకా వెడతాయి. తిరిగి సాయంత్రం ఆఫీసు నుంచి ఇంటికి వచ్చేటప్పుడు ఆయన బస్ వచ్చే సమయానికే బస్‌స్టాప్ వద్ద ఎదురుచూస్తాయి. వీటికి ఆ సమయం ఎలా తెలుస్తుందో ఏమిటో? ఆయన వంట చేస్తున్నా, నిద్రపోతున్నా కూడా ఈ కుక్కలు ఆయన వెంటే ఉంటాయని అంటుంటారు..” అని చెప్పారు ఆవిడ. మళ్ళీ ఆవిడే మాట్లాడుతూ, “నిజానికి వీటివల్లే ఆయనకా అదృష్టం పట్టింది. ఒక లక్ష రూపాయల లాటరీ తగిలింది. తన జీతంతోనే ఆయనకు అవసరాలన్నీ తీరిపోతాయి. ఇక డబ్బంతా ఏం చేసుకుంటాడో?” అని అన్నారు.

తన ఇంట్లో కూడా లాటరీ ప్రస్తావన వచ్చేసరికి విశాల్ విస్తుపోయాడు.

"లాటరీ తగిలిన తర్వాత కొన్ని రోజులకి భీమ్‌సింగ్ ఇంట్లో దొంగలుపడ్డారు. ఈ కుక్కలే లేకపోతే, ఆరోజు ఆయన చనిపోయి ఉండేవాడే. ఎంతగా కొట్టారంటే, పాపం తలమీద చాలా కుట్లుపడ్డాయి..." అని చెప్పారు. విశాల్ వాళ్ళ అమ్మగారు సానుభూతిగా.

ఆరాత్రి నిద్రలో విశాల్‌కి రకరకాల కలలు వచ్చాయి. లాటరీ టికెట్లన్నీ, అందునా బహుమతి వచ్చిన టికెట్లన్నీ ఒక నదిలా ప్రవహిస్తున్నట్లు, టికెట్లను పరుపులా చేసుకుని తను నిద్రపోతున్నట్లు, ఇంకోసారి భీమ్‌సింగ్ తన కుక్కలతో సహా నడుస్తున్నట్లు, లాటరీ టికెట్లను గాలిలోకి ఎగరవేస్తే కుక్కలు వెళ్ళి నోట కరచుకుని తెస్తున్నట్లు కలకన్నాడు విశాల్.

H H H

మర్నాడు సాయంత్రం నదీతీరం వెంబడి షికారుకి వెడుతుండగా, ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో చాలామంది గుమికూడి కనిపించారు. సంగతి ఏమిటో కనుక్కుందామని విశాల్ అక్కడికి వెళ్ళాడు.

అక్కడ ఓ ఆవిడ పెద్ద పెద్దగా రోదిస్తూ ఉంది. మధ్యమధ్యలో "ఈ లాటరీ మా కొంప ముంచిందీ బాబోయ్" అంటూ శోకాలు పెడుతోంది. తనపక్కనే నిలుచున్న వ్యక్తిని ఏం జరిగిందని అడిగాడు విశాల్. అతడు చెప్పసాగాడు – 'వీళ్ళు ఒకప్పుడు పంజాబ్‌లో వ్యాపారం చేసుకుని బ్రతికేవారుట. అక్కడ తీవ్రవాదుల బెడద ఎక్కువై, ఆస్తులని, బంధువులని వదిలేసి ఇక్కడకొచ్చి స్థిరపడ్డారట. వీళ్ళాయన మొదట్లో ఆటో అద్దెకి తెచ్చుకుని నడిపే వాడట. చాలాకాలంపాటు డబ్బుకి ఇబ్బందిగా ఉండేదిట. పదేళ్ళ తర్వాత పరిస్థితి మెరుగై, వాయిదాల మీద ఆటో కొనుక్కోగలిగాడట. జీవితం సుఖంగా గడిచిపోతోందనుకున్న సమయంలో అతడికి లాటరీ మైకం కమ్మింది. రోజువారీ సంపదలో చాలా భాగం లాటరీ టికెట్ల కోసమే ఖర్చు చేస్తున్నాడట. అప్పుడప్పుడు ఏదో పదో వందో బహుమతిగా వచ్చేవి. అలాగే, తనలాగే లాటరీ వ్యామోహం ఉన్న జనాలనందరిని పోగుచేసి, ఎప్పుడు లాటరీ గురించే మాట్లాడుతూ, ఆటో తిప్పడం కూడా నిర్లక్ష్యం చేసాగాడట. దీంతో ఇంట్లో గొడవలు మొదలయ్యాయట.

మొన్నపొద్దున ఆవిడ పిల్లల స్కూలు ఫీజు కట్టాలని, ఇంకా ఇంటి ఖర్చులకి కొంత డబ్బు కావాలని అతడిని అడిగిందట. ఆ విషయం మీదే వాళ్ళకి పెద్ద తగాదా అయిందట. పగలు ఆటో తీసుకుని బయటికి వెళ్ళిన అతడు, రాత్రి ఆలస్యంగా వచ్చి పడుకున్నాడట. నిన్న పొద్దున ఏమీ తినకుండా, తాగకుండా ఆటో తీసుకుని బయటకు వెళ్ళినతను, మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఇంటికి వచ్చాడట. కాని ఆటో తేలేదట.

'రిపేరుకి ఇచ్చుంటాడులే' అని ఈవిడ అనుకుందట. ఎందుకంటే ఆటో ఇబ్బంది పెడు తోంది. మెకానిక్‌కి చూపించాలి అని ఆమధ్య ఎప్పుడో అన్నాడట.

అన్నంపెట్టి, నిశ్శబ్దాన్ని భగ్నం చేయడానికి, 'ఆటో ఏది?' అని అడిగిందట. అతను కంచం

కేసి చూడనైనా చూడకుండా, ఆమె చేతికి ఓ సంచి ఇచ్చి, 'దీన్ని జాగ్రత్తగా ఉంచు. ఆటో అమ్మేశాను. ఆ డబ్బుతో లాటరీ టికెట్లు కొన్నాను. ఈ రోజు తప్పనిసరిగా మనకి బహుమతి వచ్చి తీరాలి. 'మన దరిద్రం వదిలిపోవాలి' అని అన్నాడట. ఆరోజు అతడు అన్ని ఐదో నెంబరు టికెట్లు కొన్నాడట. 'సాయంత్రం ఫలితాలు వస్తాయి. ఈ సంచిని భద్రంగా ఉంచు' అని చెప్పి బయటకు వెళ్లిపోయాడట.

ఆమె నిర్ఘాంతపోయిందట. ఏం చేయాలో తోచలేదట. ఆ సంచిని తీసుకుని బజారులోకి వచ్చి ఏడుస్తూ టికెట్లని అమ్మేయడం ప్రారంభించిందట. కొందరు పెద్ద మనుషులు కూడా ఆమెకి సహాయంగా టికెట్లను అమ్మిపెట్టారుట. చాలా టికెట్లని అమ్మినప్పటికీ, ఇంకా సుమారుగా 100 టికెట్లు మిగిలిపోయాయట. పిల్లలు బడి నుంచి ఇంటికి వచ్చే సమయానికి ఇల్లు చేరిందామె.

అక్కడ ఆమె భర్తేమో తన మిత్రబృందంతో కలిసి వెళ్ళి నది ఒడ్డున కూర్చున్నాడట. తనకి లాటరీ వస్తే సరి, లేదంటే నదిలో దూకి చస్తానని ప్రకటించాడట. సాయంత్రం ఫలితాలు వచ్చాయి. అనుకున్నట్లే ఐదో నెంబరు టికెట్‌కి బహుమతి లభించింది. మిత్ర బృందం వెళ్ళి అతడికి వార్తనందించారు. అతడు ఉత్సాహంగా ఇంటికి వచ్చాడు. కాని ఇంటి దగ్గరి దృశ్యం వేరు. చాలా టికెట్లని ఆమె అమ్మేసిందని తెలియగానే అతడు మూర్ఛ పోయాడు. వెంటనే ఆసుపత్రికి తీసుకువెళ్ళారట. ఇప్పుడు స్పృహ రాగానే, ఏవో పిచ్చి పాటలు పాడసాగాడు. పాపం, అతడికి మతి భ్రమించింది..." అంటూ ఆ వ్యక్తి ముగించాడు.

విశాల్ మనసు కరిగిపోయింది. అతడి పరిస్థితికి జాలిపడుతూ, ఇంటికి చేరుకున్నాడు. ఈ ప్రశాంతమైన ఊరిలో లాటరీ ఎంత కలకలం రేపిందోనని అనుకున్నాడు.

మర్నాడు దినపత్రికలో ఓ వార్త చూశాడు - లాటరీకి వ్యతిరేకంగా మహిళలు జిల్లావ్యాప్తంగా ఆందోళన నిర్వహించారు. కలెక్టరుని ఘెరావ్ చేశారట. జిల్లాలో లాటరీని నిషేధిస్తామని హామీ ఇస్తేగాని వదలలేదట.

ఈ వార్త చూడగానే విశాల్ మనసు శాంతించింది. ప్రజలందరు చైతన్యవంతులై, ప్రలోభాలని, సాంఘిక దురాచారాలని రూపుమాపగలిగితే ఎంత బావుంటుందో కదా అని అనుకున్నాడు. లాటరీ వ్యతిరేక ఉద్యమమైనా, సారా వ్యతిరేక ఉద్యమమైనా ఆడవాళ్ళే ముందుండి నడిపిస్తున్న సంగతి అతడికి హఠాత్తుగా స్ఫురించింది. చెట్లని కొట్టేయకుండా కాపాడే చిప్కో ఉద్యమంలో కూడా మహిళలే ముఖ్యపాత్ర వహించడం అతడికి గుర్తొచ్చింది.

"అవును, ఉద్యమాలలో ఆడవాళ్ళే ఎందుకు ముందుంటున్నారు?" అని ఆలోచించసాగాడు.

*(సాహిత్యప్రస్థానం, అక్టోబరు-డిసెంబరు 2005)*

**'లాటరీ' కథకి మూలం 'లాటరీ' అనే హిందీ కథ. ఈ కథ**
www.abhivyakti-hindi.org **అనే వెబ్‌సైట్‌లో ప్రచురితమైంది.**

# మిగిలిపోయినవి

ఆంగ్లం : అభా అయ్యంగార్

మిగిలిపోయినవి! నిన్న మిగిలినవి, పొద్దున మిగిలినవి, ఎవరైనా తిని వదిలేసినవి నేను వాటినే తింటుంటాను. అది నాకు లభించకపోతే అడిగి మరీ సంపాదించుకుంటాను. ఇతరులు తినగా మిగిలిపోయిన వాటిని అడగడాన్ని ఒకసారి ఊహించండి. ఇలా మిగిలి పోయినవాటిని అడిగి తీసుకోవడం అగౌరవం అని అనుకుంటున్నారు కదూ? కాని ఆకలి అన్ని రకాల అవమానాలను భరించేలా చేస్తుంది. అందుకే నేను మిగిలిపోయిన పదార్థాలను అడిగి తీసుకోడానికి సిగ్గుపడను, సందేహించను.

నేను పనిచేసే ఇళ్ల యజమానురాళ్లను "అమ్మగారూ, తినడానికేమైనా ఉన్నాయా?" అని అడుగుతుంటాను. వాళ్లు వంటిల్లంతా వెతికి ఏ చద్దన్నమో, గట్టిపడిపోయిన రొట్టెలో, కాస్త కూరో నా మొహాన పడేస్తారు. వాళ్లు ఏమిచ్చినా, నేను వద్దనకుండా తీసుకుంటాను. మనుగడకోసం పోరాటంలో నేను మొదటగా 'సిగ్గుపడడాన్ని' వదిలేశాను. ఖాళీ కడుపుతో రోజంతా పనిచేయడం సాధ్యంకాదు. అందుకే మిగిలిపోయినవాటిని అడిగి తీసుకుంటాను. మిగిలిపోయిన పదార్థాలను, వదిలేసిన వంటకాలను తలచుకోగానే చాలా మందికి నేనే గుర్తొస్తాను. పైగా నేను కూడా ఎవడో తన కోరిక తీర్చుకుని వదిలేసిన స్త్రీకి పుట్టినదాన్నే. అప్పటినుంచి నా జీవితమంతా మిగిలిపోయిన వాటిపైనే నడిచింది.

నేను పనిచేసే ఇళ్ల యజమానురాళ్లలో అంజలమ్మ ఒకరు. 'వీళ్లకి సమయమెలా గడుస్తుందా' అని ఒక్కోసారి నాకు ఆశ్చర్యమేస్తుంది. వీళ్లంతా హాయిగా ఎయిర్‌కండిషన్డ్ గదుల్లో విశ్రాంతి తీసుకుంటూ, విలాసవంతమైన జీవితం గడుపుతుంటే, నాలాంటివాళ్లం మాత్రం బతకడం కోసం నానారకాల గురించి పనులు చేస్తుంటాం. ఇలాంటి విషయాల గురించి నేను పెద్దగా ఆలోచించను. 'అంజలమ్మ' గురించి ఎందుకు చెబుతున్నానంటే, ఆమె మిగతావారిలా కాదు. నామీద జాలి చూపిస్తుంది. నేను అడగకుండానే నాకు తినడానికి ఏమైనా ఇస్తుంటుంది.

వాళ్ళింట్లో పనిచేయడం నాకిష్టం. వేడి, దుమ్ముతో నిండి ఉండే ఢిల్లీ వేసవిలో సైతం ఆమె ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. చక్కటి ఎంబ్రాయిడరీ చేసిన తెల్లటి, ఆకు పచ్చటి కాటన్

చీరలలో ఎంతో సొగసుగా ఉంటుంది. తలస్నానం చేశాక, విరబోసుకున్న జుట్టు మెరిసే ఆమె మేనిఛాయకి మరింత అందాన్నిస్తుంది. మరి నేనో? సరిపోయీ సరిపోని బట్టలతో జిడ్డుకారే ముఖంతో నల్లగా ఉంటాను. నా చెప్పులు కూడా నా కాలిసైజువి కావు. నేను వేసుకునే రంగురంగుల అద్దపుగాజులు మాత్రమే నాలోని ఆడతనాన్ని సూచిస్తాయి.

ఒకరోజు అంజలమ్మ “మున్నీ, నువ్వెప్పుడూ మీ ఇంట్లోంచి తినడానికి ఏమీ తెచ్చుకోవేం? నీకు వండుకునేందుకు సమయంలేదా? మీ ఇంట్లో ఎవరెవరు ఉంటారు? మీ వాళ్లకోసం నువ్వేమీ వండవా?” అని అడిగింది.

ఆమె ప్రశ్నలన్నింటికీ నేను చిరునవ్వుతో తల అడ్డంగా ఊపి, తడిగుడ్డతో నేలను మరింత గట్టిగా తుడవసాగాను.

ఆమె ప్రశ్నలకి జవాబివ్వాలని నేను అనుకోలేదు. మా ఇంటినుంచి నేను తినడానికి పదార్థాలు ఎందుకు తెచ్చుకోడం లేదో ఆమెకి వివరించాల్సిన అవసరం ఉందని నేను భావించడంలేదు. మాలాంటి వాళ్లకీ రెక్కాడితేగాని డొక్కాడదన్న సంగతి ఆమెకి బాగా తెలుసు. రోజంతా పనిచేయడం, ఓ పూట తినడం, తర్వాత పూట భోజనం కోసం కష్టపడడం.. ఇదే మా జీవితం. నేను ఖచ్చితంగా మావాళ్లకి సరిపడా మాత్రమే మా ఇంట్లో వండుతాను. ఆహారంమీద కాని, ఇంక దేనిమీదైనా సరే, ఒక్క రూపాయి కూడా వృథా చేయడం నాకిష్టంలేదు.

నా గుండె లోతుల్లోని రహస్య కోరికని నేను ఆమెకి కూడా చెప్పలేదు. చివరికి ఎందుకూ పనికిరాని నా మొగుడికి కూడా నా ఈ రహస్యం తెలీదు. తిరుగుబోతైన ఆడికి ఈ సంగతి తెలిస్తే ఇంకేమైనా ఉందా? అందుకే నేనీ రహస్యాన్ని పదిలంగా దాచుకున్నాను. గాలితో కూడా గుసగుస లాడలేదు. నా వంతు అన్నాన్ని త్యాగం చేస్తున్నది కూడా ఇందుకే.

ఒకరోజు అప్పటిదాకా నేను దాచిన నాణాలు, రూపాయి, రెండు రూపాయల నోట్లను లెక్కిస్తే, నేను బాగానే పొదుపు చేసాననిపించింది. నా రహస్య కోరికను నెరవేర్చుకోడానికి అవసరమైనంత డబ్బు పోగుచేయగల్గానని నాకు అర్థమైంది. ఆ డబ్బునంతా ఓ గుడ్డలో మూటకట్టి, బజారుకు దారితీసే ఇరుకు సందుల గుండా పరుగెత్తాను. కొట్లని అప్పుడే తెరుస్తున్నారు. నేను గబగబా ఆభరణాల కొట్టువైపు అడుగులేశాను. ప్రదర్శనలో ఉన్న అన్ని నగలపైనా సూర్యకిరణాలు పడి అవి మెరుస్తున్నాయి. నా మనసులో ఎప్పటినుంచో ఉన్న ‘వెండిపట్టీల’ను చూపిస్తూ వాటిని ఇవ్వ మన్నాను. విస్తుపోయి నాకేసి చూస్తున్న కొట్టు యజమానికి డబ్బు మూట అందించి, పట్టీలను ధరించి అక్కడ్నించి కదిలాను. నేను నడుస్తుంటే పట్టీలు చేస్తున్న సవ్వడి నా చెవులకు సంగీతంలా తోస్తోంది. నేను వెళ్లాల్సిన మొదటి ఇల్లు అంజలమ్మది.

అంజలమ్మ వచ్చి తలుపుతీసింది. నా ముఖంలో తొణికిసలాడుతున్న ఆనందాన్ని చూసి ఆమె స్థాణువులా ఉండిపోయింది. ఇంతలో నేను ఆమె దవడపైన పెద్ద ఎర్రటి చారను గమనించాను.

తెల్లటి ఆమె చర్మంపైన ఆ చార చాలా స్పష్టంగా కనిపిస్తోంది. నా చేత్తో ఆ చారని తడుముతూ,

"ఏమైందమ్మా?" అని అడిగాను.

"ఏం లేదు మున్నీ చిన్న దెబ్బ తగిలిందంతే" అని చెప్పింది అంజలమ్మ. తర్వాత మధ్యగదిలో అందంగా అమర్చిన సోఫాలలో ఒకదాంట్లో కూర్చుంది. ఉన్నట్టుండి ఆ గదిలో వాతావరణం భయంభయంగా మారిపోయింది. గాలి ఆడక, ఉక్కపోతగా అనిపించ సాగింది. నా పట్టీలను, నా ఆనందాన్ని తాత్కాలికంగా మరచిపోయి, నేను అంజలమ్మ కాళ్లదగ్గర కూర్చున్నాను.

"ఈ దెబ్బపైన మందేదైనా రాశారామ్మా? లేకపోతే పక్కింటి డాక్టరుగారిని పిలుపుచుకురానా?" అని ఆతృతగా అడిగాను నేను.

పక్కింట్లో ఓ ముసలి డాక్టరు ఉన్నారు. ఆయన సంపాదించిన డబ్బులతో ఆయన పిల్లలు ప్రపంచమంతా తిరుగుతూంటే, ఆయన మాత్రం ఒంటరిగా ఆ ఇంట్లో ఉంటారు.

"వద్దు, మున్నీ!" అంది అంజలమ్మ బతిమాలుతున్నట్లుగా.

ఆమె కళ్లనిండా నీళ్లు. గట్టు తెగడానికి సిద్ధంగా ఉన్న వాగులా ఉంది ఆమె స్థితి. నేను మౌనంగా ఉండిపోయాను.

"ఏం జరిగిందో నీకు చెప్తాను మున్నీ, కానీ నువ్వెవరికి చెప్పకూడదు" అంది అంజలమ్మ.

నేను అలాగేనన్నట్లు తలూపాను. ఆమె నన్ను విశ్వసిస్తోంది. మా జీవితాలు విభిన్న మైనప్పటికీ, ఏదో సారూప్యం ఉందనిపిస్తోంది. అంజలమ్మ చెప్పడం మొదలుపెట్టింది.

"నిన్నరాత్రి నేను ప్రతిరాత్రి వేసుకునే మందులు వేసుకోడం మర్చిపోయి నిద్ర పోయాను. ఆ మందులు వేసుకోకపోతే నాకసలు నిద్రపట్టదు. అర్ధరాత్రి పన్నెండు గంటలకు మెలకువ వచ్చింది. అప్పుడు మా ఆయన ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడుతున్నారు. మా పడకగదిలో ఉన్న ఫోన్ ఎక్స్‌టెన్షన్ అందుకని, ఆయన మాట్లాడడం అయ్యాక, నా మందులు తెమ్మని చెప్పాలనుకున్నాను. కాని అవతలివైపు నించి ఓ ఆడగొంతు వినిపించేసరికి వాళ్ల మాటలు వింటుండిపోయాను. వాళ్లకి నా గుండె చప్పుడు కూడా వినిపించకూడదని నేను కోరుకున్నాను. కాసేపు విన్నాక, విషయం మొత్తం నాకు అర్థమైంది. రిసీవర్ పక్కనపడేసి, పరుగున కిందికి దిగి, ఆయనతో వాదనకి దిగాను. ఆయన తన సంబంధాన్ని తప్పని ఒప్పుకోలేదు సరికదా, పైగా సమర్థించుకున్నారు" అంటూ "దీన్ని నువ్వు నమ్మగలవా మున్నీ?" అంటూ అడిగింది అంజలమ్మ.

నేను నమ్మగలను. మిగతా మగాళ్లకి, ఆమె భర్తకి ఏ తేడా ఉంది? అందరు మగాళ్లు, చిన్నవో పెద్దవో తప్పులు చేస్తూనే ఉంటారు. అయితే చాలామంది ఆడవాళ్లకంటే మేము కొంత నయం. అయితే అంజలమ్మకి ఇవన్నీ కొత్తకావచ్చు. ఇంకా వాళ్ల పెళ్లై రెండేళ్లు కూడా కాలేదు.

వెక్కిళ్లు పెడుతూ, తన బాధను దాచుకుంటూ అంజలి చెప్పసాగింది. "నేను నమ్మలేక పోయాను మున్నీ! మా ఆయన నవ్వారు. పైగా నేను అమాయకురాలినని, అందంగా కనిపించడం చాతకాదని,

ఫాషన్లు తెలీవని, ఇంకా ఏవేవో అన్నారు. ఆమెని ప్రేమిస్తున్నాడట. త్వరలోనే నాకు విడాకులు ఇచ్చి, ఆమెని పెళ్ళి చేసుకుంటాడట. ఈ సంగతి నాకెలా చెప్పాలా అని తటపటాయిస్తుంటే, నేనే విషయం తెలుసుకున్నాను. కాబట్టి ఇంక చెప్పవల సింది ఏమీలేదట" చెప్పడం పూర్తి చేసి కళ్లనిండా నీళ్లతో నావైపు చూసింది అంజలమ్మ.

"నేను ఆయనకు అడ్డంగా నిలిచి, దీనికి ఒప్పుకోనని చెప్పగానే, నన్ను ఓ తోపుతోశారు. దాంతో నేను ముందుకి తూలిపడ్డాను. ఇదిగో, ఈ టీపాయికి కొట్టుకుని ఈ దెబ్బ తగిలింది" అంటూ ఓ అందమైన టీపాయిని చూపించింది.

"అందమైన వస్తువులెందుకు ఇంత బాధ పెడతాయి మున్నీ?" ప్రశ్నించింది అంజలమ్మ దిగులుగా నిట్టూర్చుతూ.

కానీ కఠినంగా ఉన్నది టీపాయి కాదు, ఆమె భర్త అని నాకు తెలుసు.

"ఆయన తన ప్రేమాభిమానాలను వేరొకరికి పంచుతుంటే, నాకు మిగిలిపోయినవి దొరుకుతున్నాయి. ఒకవిధంగా చూస్తే, నీకు నాకు పెద్ద తేడా లేదు మున్నీ" అంటూ అంజలమ్మ భోరుమంది. ఆమె కన్నీరు ఆగడంలేదు.

ఆమెని సముదాయించడానికి ప్రయత్నించాను. ఆమెకో రుమాలు తెచ్చిద్దామని లేచాను. అప్పుడు నా పట్టీలు సవ్వడి చేయసాగాయి. నేను ఆమె రుమాలుని ఆమె చేతికి అందిస్తున్నప్పుడు అంజలమ్మ కూడా ఆ శబ్దం వింది. అంత దుఃఖంలోను ఆమె ముఖంపై ఓ చిరునవ్వు విసిరింది.

"ఇవేనన్నమాట, ఈరోజు నీ ఆనందానికి కారణం. మరి రేపటినుంచి రోజూ తాజా ఆహారం తీసకుంటావా?" ఆసక్తిగా అడిగింది అంజలమ్మ.

ఆమెకి నేను సమాధానం చెప్పలేదు. ఇప్పుడు నా మరో కోరిక నా కొడుక్కి ఓ పాత సైకిల్ కొనివ్వడంకోసం మరింత డబ్బు కూడబెట్టాలి. ప్రస్తుతానికి నా ఆహారం తాజా పదార్థాలు కావు. మిగిలిపోయినవే.

*(విపుల, అక్టోబరు 2004)*

**'మిగిలిపోయినవి' కథకి మూలం Leftovers అనే ఆంగ్ల కథ.**
**మూలకథ Gowanus Books పత్రిక మార్చి 2003 సంచికలో ప్రచురితమైంది.**

# సున్నాగాడు

**బెంగాలీ : ప్రసూన్‌రాయ్**

అవును నేను జీరోని. నేను శూన్య భట్టాచార్యని. ఇది నా కథ. ఇరవై ఐదేళ్లు గడిచిన తర్వాత ఇప్పుడు నా జీవితాన్ని పునశ్చరణ చేసుకుంటున్నాను.

అందరు పిల్లల్లాగే నాకూ నా తల్లితండ్రులు ఓ పేరు పెట్టారు. అది 'శూన్య' అని! ఏ ప్రబుద్ధుడు సూచించాడో కాని, మా అమ్మ నాన్నలు నాకాపేరు ఖాయం చేసేసారు. ఆ పేరులోని తియ్యదనాన్ని ఆస్వాదించకుండానే వాళ్లిద్దరూ కన్నుమూసారు. షీలా ఆంటీ దయతో నన్నో రెసిడెన్షియల్ స్కూల్లో చేర్పించారు. అసలు సమస్య ఇక్కడే మొదలైంది. నేనో సగటు విద్యార్థిని. చదువులలోనే కాదు, ఇతర రంగాలలోనూ నా ప్రతిభ అంతంత మాత్రమే. నన్ను చూసి ఎవరూ గర్వపడరు. అయినా ఒకళ్లని చూసి గర్వపడాలంటే చదువులోనైనా, ఆటలలోనైనా లేదా మరే ఇతర రంగంలోనైనా ఏదైనా సాధించి చూపాలి.

నా బాల్యం ప్రభావం నామీద ఇప్పటికీ ఉంది. అప్పటి జ్ఞాపకాలను నేనెప్పటికీ మరువలేను. నా పేరుకి సార్థకత కల్పించిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. బడిలో అందరు 'జీరో' అని పిలిచేవారు. మిగతా పిల్లలలో కొందరు 'హీరో'లు ఉండేవారు. అయితే పేరులో నేముందో నాకర్థం కాదు. గర్వపడినా, సిగ్గుపడినా నా పేరు నాదే. కాని నిజం చెప్పాలంటే నాపేరంటే నాకు అసహ్యం.

మా పాఠంలో చదివిన పద్యంలా నా జీవితం సాఫీగా సాగలేదు. నేను ఏ ఆట లోను రాణించలేదు. చదువులోను అద్భుతాలని చేయలేదు. అన్ని రంగాలలోను నేనెందుకు విఫలమవు తున్నానో నాకు తెలియలేదు. నా అపజయాలను చూసి అందరూ నవ్వేవారు. తరగతి గదిలోని పదిహేనేళ్ల అనాసక్త జీవితం, ఆటస్థలంలోని స్వేచ్ఛని తలచుకున్నప్పుడల్లా మా విద్యార్థుల చుట్టూ కనపడని కంచెలు ఉన్నట్టు నాకనిపించేది. ఈ రక్షణ కంచెలను అతి జాగ్రత్తతో ఏర్పాటు చేసినట్లు తోస్తుంది. ఈ కంచెని దాటాలని చూసినప్పుడల్లా నా తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు నన్ను హేళనచేసేవారు. "నువ్వు నిజంగా జీరోవే. ఎందుకూ పనికిరాని దద్దమ్మవి. వట్టి సున్నాగాడివి" అనేవారు.

నాకు ఆకాశమన్నా గాలిపట్టాలన్నా బాగా ఇష్టం. కిటికి గుండా స్కూలు బయట ఉన్న చెట్టు మీది పక్షుల కూతలను వింటూ కాలం గడిపేవాడిని. కాగితాలతో విమానాలని చేసి గాలిలోకి

విసరడం నాకెంతో ఇష్టం. ఎప్పుడూ స్వేచ్ఛా విహంగంలా గాలిలో ఎగరాలనే నా కలలకి అది కొనసాగింపు కావచ్చు. కాని నాతోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు నన్ను హేళన చేసేవారు. "నువ్వు నిజంగా జీరోవే. ఎందుకూ పనికిరాని దద్దమ్మవి. వట్టి సున్నా గాడివి" అని అనేవారు.

ఇతరులకి చెప్పుకోడానికిగాని, ఎవరినైనా అడగడానికిగాని, ధృవీకరించుకోడానికి గాని నాకెవరు లేరు. క్రమంగా నేను వాళ్ల మాటలను విశ్వసించసాగాను. నిజంగా నేను సున్నాగాడినే. ఎందుకూ పనికిరాని వాడినే.

కొన్నేళ్ళ తరువాత స్కూలు జీవితం ముగిసి, కాలేజిలోకి ప్రవేశించాను. కానీ ఇక్కడ కూడ తోటి విద్యార్థుల నుంచి హేళనలే ఎదురయ్యాయి. చాలా సులువుగా నన్ను జీరోని చేసేశారు. నా ప్రతిభ ఏమాత్రం మెరుగుపడలేదు. నా మనోభారం తగ్గలేదు. బహుశా గాలిలోకి ఎగరాల్సిన కాగితం విమానం బరువెక్కువైందేమో.

కాలేజీలో నాకెదురైన మంచి అనుభవమో లేక దుర్ఘటనో నాకు తెలియదుకాని కనీసం కొద్దికాలం పాటైనా నా మనసులోని బాధని చెప్పుకోడానికి 'అర్పిత' దొరికిందనుకున్నాను. కాని కొద్ది రోజులలోనే ఆమె రాహుల్‌తో జతకట్టి నన్ను వదిలించుకుంది. "నువ్వు నిజంగానే జీరోవి. పలాయానవాదివి. జీవితంలో నీకో లక్ష్యంలేదు. కనీసం అందమైన అమ్మాయితో ఎలా మాట్లాడాలో కూడా తెలియదు. నువ్వు వట్టి సున్నావి" అంటూ మా స్నేహాన్ని(?) త్రుంచేసింది.

నా తప్పు అమ్మాయిలతో ఎలా మాట్లాడాలో తెలియకపోవడమా లేక నా వద్ద డబ్బు లేకపోవడమా అన్నది నాకు తెలియలేదు. బహుశా కొంతకాలం తర్వాత నేనీ చిక్కుముడిని విప్పగల నేమో. ప్రతీ రాత్రి ఆకాశంలోని నక్షత్రాలను చూస్తూ, నా తల్లిదండ్రులను గుర్తు చేసుకుంటాను. "అమ్మా, నాన్నా మీరెక్కడ ఉన్నారు? నాకీ పేరు ఎందుకు పెట్టారు? నేను నిజంగా దద్దమ్మనా? నన్నుకూడా మీ దగ్గరికితీసుకుపోండి" అంటూ బ్రతిమాలుకునేవాడిని. ఎవరూ జవాబిచ్చేవారు కాదు.

కాలేజి చదువు తర్వాత, నాకు ఉద్యోగం దొరకడం కష్టమైంది. మనుగడ కోసం చేసే పోరాటం ఎంత దుర్భరమో నాకు అర్థమైంది. నన్ను నేనే అసహ్యించుకోసాగాను.

H H H

"నా ఆక్రోశాన్ని చెప్పుకోడానికి అక్కడ ఎవరూ లేక, ఇంత దూరం కాశ్మీరుదాకా రావల్సి వచ్చింది అంకుల్! షీలా అంటీ. మీరు తప్ప నాకీ ప్రపంచంలో ఎవరున్నారు? షీలా ఆంటీ స్వర్గస్తులయ్యాక, నాకింకా మిగిలింది మీరొక్కరే అంకుల్' అంటూ ప్రహ్లాద్ గారి పాదాల వద్ద కూర్చున్నాడు శూన్య.

ప్రహ్లాద్ గారు శూన్య తలమీద చేయివేసి జుట్టు నిమురుతూ అతడికి సాంత్వన కలిగించే ప్రయత్నం చేయసాగారు. కొన్ని క్షణాల తర్వాత ఆయన చెప్పసాగారు.

"నాయనా, నువ్వు దద్దమ్మవి కాదు. నీపేరు శూన్య. నువ్వు నిజమైన సున్నావి" అని అన్నారు. శూన్యకి ఆయనేం మాట్లాడుతున్నారో అర్థం కాలేదు.

"నీకు మా అమ్మానాన్నలు ఆ పేరు పెట్టడంలో ఒక కారణం ఉంది. శూన్యం అంటే ఖాళీ అనేకాదు. ఏమీ లేదనే అర్థం కూడా ఉంది. సున్నాని కనిపెట్టిన ఆర్యభట్ట ఏమన్నాడో తెలుసా. సున్నా అనేది మానవుల సంగ్రహణశక్తిని అభివృద్ధి చేసిన ఓ భావన. ఓ చిహ్నం అని అన్నాడు. "సున్నా లేకపోతే లెక్కలలో కేవలం ధనాత్మక విలువలే ఉండేవి. సున్నా ఆవిష్కరణతో ఋణాత్మక విలువలు కూడా చేరి గణితానికి ఓ కొత్త కోణాన్ని కల్పించాయి. నిజంగా సున్నా చాలా విలువైన అంకె చాలా ముఖ్యమైన గుర్తు" అంటూ ఆపారు. మళ్లీ మాట్లాడుతూ, "సున్నా, ధనాత్మక విలువలకి ఋణాత్మక విలువలకి, మంచికి చెడుకి మధ్య తేడాని సూచిస్తుంది. దానికంటూ ఏ విలువా లేనప్పటికీ అదెంతో అమూల్యమైనది" అని అన్నారు. ఈ మాటలంటున్నప్పుడు ఆయన కళ్లు మెరిసాయి.

"సున్నా అనేది ఓ ప్రారంభం! అంతంకాదు. సున్నా ఓటమికాదు విజయంయొక్క అగ్రభాగం. సున్నా అనేది లేకపోతే ఎక్కడినుంచి ప్రారంభించాలో ఎవరూ తెలుసు కోలేరు. నీ జీవితాన్ని నూతన ఆశలతో కొత్తగా ఆరంభించు. నీకా సామర్థ్యం ఉంది. ఎందుకంటే నువ్వు ఓ ప్రత్యేక వ్యక్తివి. సున్నావి. తొలిఅడుగుని నీలా కలలు కని, సమాజాన్ని మార్చగలిగే యువకులే దేశానికిప్పుడు కావాలి. నువ్వు నీ మార్గాన్ని ఎంచుకో. కొత్త ప్రారంభానికి కాస్త ఆలస్యమైనా ఏం ఫర్వాలేదు. అసలు ప్రయత్నమే చేయకపోవడం కన్నా, ఆలస్యంగానైనా ప్రయత్నించడం మంచిది" అంటూ ఆపారు.

వాళ్లింటి బయట చిన్నగా మంచు కురుస్తోంది. వీళ్లిద్దరు ఒకరికొకరు ఎదురెదురుగా కూర్చుని జీవితాన్ని అర్థం చేసుకోడానికి, సార్థకం చేసుకోడానికి ప్రయత్నిస్తున్నారు.

"చివరగా నేనో మాట చెబుతాను. బయట కురుస్తున్న మంచుని చూడు. అది ఎంత తెల్లగా ఉందో. ఆ తెల్లదనం మురికినంతా శుద్ధం చేసి నేలని స్వచ్ఛంగా చేస్తుంది. ఈ మంచుకి, సున్నాకి సంబంధం ఉంది. మంచు సున్నా డిగ్రీల సెంటిగ్రేడ్ వద్ద తయారవు తుంది. అంటే సున్నా అంటే స్వచ్ఛత అన్నమాట. దానికి చెడుని దూరంచేసే శక్తి ఉంది.." అని చెప్పి శూన్య నుదుటిపై చిన్నగా చుంబించి, తన గదిలోకి వెళ్లి నిద్రపోయారాయన.

కిటికీలోంచి చేతులు బయటకు చాచి, మంచుని ఆస్వాదించసాగాడు శూన్య. తన చూపులను ఆకాశం కేసి మళ్ళించాడు. పాతికేళ్ళ తర్వాత అతడి ప్రశ్నలకు జవాబు దొరికింది. బయట సన్నగా కురుస్తున్న మంచు అతడి హృదయాన్ని పరిశుద్ధం చేసింది. "ఈ క్షణం నుంచి కొత్త జీవితాన్ని ప్రారంభిస్తాను" అని అనుకుంటూ, "ఆలస్యంగానైనా ప్రయత్నించడం చాలా మంచిది" అన్న ప్రహ్లాద్‌గారి మాటలను గుర్తు చేసుకున్నాడు.

"అవును నేను నిజంగానే సున్నానే! నేనంటే నాకెంతో గర్వంగా ఉందీరోజు" అని అనుకున్నాడు.

*(నవ్య వారపత్రిక 21 జూన్ 2006)*

**'సున్నగాడు' కథకి మూలం Zero అనే కథ.**

**మూలకథ www.sulekha.com అనే వెబ్‌సైట్‌లో ప్రచురితమైంది.**

# వృత్తిధర్మం

ఆంగ్లం : మానస్ కమల్ భట్టాచార్య

"కాదనకండి డాక్టరు బాబూ! మీరిది చేసి తీరాలి" దీనంగా అర్థిస్తున్నాడతను. ముడతలు పడ్డ అతని ముసలి ముఖంపై నుంచి కన్నీళ్ళు జలజలా రాలాయి.

"అలా చేయడం తప్పు. అనైతికం. పాపం కూడా" అన్నాను నేను.

"నేను ఆమెని ఎంతగానో ప్రేమిస్తున్నాను. ఆమె ఈవిధంగా జీవించడం నేను చూడలేను" అతని వేదనాభరితమైన స్వరంలో నిరాశ చోటుచేసుకుంది.

"చూడు పెద్దాయనా, నీకేదో అయినట్లుంది. ఏ డాక్టరైనా ఈ పనికి ఎలా ఒప్పు కుంటాడనుకున్నావు?" అరిచాను నేను. కానీ అతడిపట్ల జాలేసింది.

"మేమిద్దరం నలభై ఏళ్లకు పైగా కలిసి బతికాం బాబూ. నేనిక ఆశలు వదులు కున్నాను" అంటూ మోకాళ్ళపై కూలబడి పెద్దగా ఏడవసాగాడు.

నేను తలతిప్పి ఆమెకేసి చూశాను. ఆమె ఎంతో ప్రశాంతంగా, నిశ్చలంగా ఉంది ఏదో తీవ్రమైన వ్యాకులత నా నరనరాల్లో ఆవరించింది. ఆ ముసలాయన హృదయ విదారకమైన రోదన నా చెవుల్లో ప్రతిధ్వనిస్తుండగా, నేనా ఇంట్లోంచి బయటకు నడిచాను.

H H H

నేను వేసుకునే బట్టల విషయంలో 'మీరా'కి పట్టింపు ఎక్కువ. నేను తనతో ఉన్నప్పుడు ఏదో పిచ్చిదుస్తులు ధరించడానికి ఆమె అంగీకరించదు. నేను కొత్తగా కొన్న వాన్ హూస్సేన్ చొక్కా వేసుకున్నాను. ఇటీవలే మెడిసిన్ పాసైన డాక్టర్‌కి, బహుశా వాన్ హూస్సేన్ చొక్కా ఓ అనవసరమైన విలాసమేమో. కానీ నన్ను చూసి మీరా గర్వపడాలి కదా. పైగా ఈరోజు ఆమె పుట్టినరోజు. తనతో మా పెళ్లి ప్రస్తావన తీసుకురావడానికి నాకిదో గొప్ప అవకాసం.

నేను మొదటిసారిగా మీరాను ఏదో మెడికల్ కాలేజీ పార్టీలో చూశాను. తను మా కాలేజి విద్యార్థిని కాదు. ఆ పార్టీకి ఎవరో పి.జి. స్టూడెంట్‌తో కలిసి వచ్చింది. అబ్బాయిలను తమ చుట్టూ తేనెటీగల్లా తిప్పుకునే రాణీ ఈగ మీర. ఆమె అందగత్తె, ఆకర్షణీయంగా ఉంటుంది. ధనవంతురాలు కూడా. నా పల్లెటూరి నేపథ్యంవల్ల నేను ఆమె దృష్టిలో పడలేకపోయాను. ఆమెకి నా ఉనికే పట్టలేదు. మూడురోజుల తర్వాత నేను మళ్లీ ఆమెని కలిశాను ఓసారి ఓ పుస్తకప్రదర్శనలో.

ఆ తర్వాత ఎన్నో సంఘటనలు కలలాగా జరిగిపోయాయి. మా పరిచయం పెరిగింది. ఆమెని ప్రతిరోజూ షికారుకి తీసుకువెళ్లాలని అనేది. ఆమె చెప్పే సోదంతా ఓపిగ్గా వినాలనేది. మా ఇద్దరిమధ్యా భావసారూప్యం చాలా తక్కువని గ్రహించాను. ఆమె నన్ను తరచూ వాళ్లింటికి ఆహ్వానిస్తుండేది. వాళ్ల నాన్నగారు రాయేంద్రచాలీహా ప్రముఖ టీ వ్యాపారి. నన్ను చూసినప్పుడు ఆయన ఎంతో సంతోషించారు. తన ఏకైక కూతురిచుట్టూ ఉండే విచిత్రవేషధారులైన యువకులలో నేను ఒకడిని కానందువల్ల ఆయన స్థిమితపడ్డారు. మా పరిచయమై మూడేళ్లు దాటింది. ఈ మధ్యలో మీరా చాలా మారింది. ఇప్పుడు ఆమె దాదాపుగా నాకు తగిన జోడీ అని నేను భావిస్తున్నాను.

పుట్టినరోజు పార్టీకి నేను కొంచెం తొందరగానే వెళ్లాను. నేను చాలీహా భవనం చేరేసరికి సాయంత్రం ఆరుగంటలైంది. నేను వెళ్ళగానే వాళ్ళ ఇంటి ముసలి వాచ్‌మేన్ కొకాయ్ వచ్చి తలుపు తీశాడు. అతన్నిచూసి నేను కృతజ్ఞతాపూర్వకంగా నవ్వాను. నాతో ఏదో చెప్పాలని అతడి పెదవులు తెరచుకున్నాయి. కానీ ఏమీ మాట్లాడకుండా ఉండిపోయాడు.

లోపల నేను ఊహించినట్లుగా పెద్ద ఆర్భాటమేదీ లేదు. ఓ నలుగురైదుగురు మాత్రమే ఉన్నారు. నేను, మీరా, ఆమె తల్లిదండ్రులు, ఇంకా రాజీవ్‌బారువా ఉన్నాం. రాజీవ్ మరో టీ వ్యాపారి కొడుకు. గతవారమే అతడు అమెరికా నుంచి తిరిగివచ్చాడు. ఈమధ్యే హార్వార్డ్ బిజినెస్ స్కూల్‌లో చదువు పూర్తిచేశాడు. అతనిలో నాకు చలాకితనం, డాబు, దర్పం కనిపించాయి. తన జోకులతో పార్టీలో అందరినీ తెగ నవ్విస్తున్నాడతను. మీరాతో మాట్లాడడానికి నాకేమో ఐదే ఐదు నిమిషాలు కావాలి. కానీ రాజీవ్ కథలకి అంతం లేకుండా పోతోంది. మేమంతా భోజనం చేస్తుండగా, 'బీప్ బీప్' మంటూ నా పేజర్ మోగింది. హాస్పిటల్‌లో ఏదో ఎమర్జెన్సీ కేసు.

"నేను వెళ్ళాలి" చెప్పాను నేను.

"కూర్చోండి ముకుల్, భోజనం మధ్యలో వెళ్లొద్దు. భోజనం అయిన తర్వాత నేను మిమ్మల్ని నా కార్లో డ్రాప్ చేస్తాను" చెప్పాడు రాజీవ్ నేను కుర్చీలోంచి లేస్తుండగా.

"ముకుల్, నా పుట్టినరోజుకు ఆమాత్రం విలువలేదా? నువ్వు కొంచెం ఆలస్యంగా వెడితే, మిన్నేమైనా విరిగిపడుతుందా?" అంటూ కోపంతో విరుచుకుపడింది మీరా.

"మీరా, నీతో వాదించేంత సమయం లేదు నాకు. నేను బయల్దేరాలి" అన్నాను.

"సరే డాక్టర్, నేను మిమ్మల్ని హాస్పిటల్ దగ్గర దింపుతాను" అంటూ రాజీవ్ కూడా లేవబోయాడు.

"పర్వాలేదు రాజీవ్. నేను వెళ్ళగలను" అంటూ నేను బయటకు నడిచాను. బయటకు రాగానే, గుమ్మం దగ్గర నిలుచుని ఉన్న కొకాయ్ కనిపించాడు. అతడు నాకేసే చూస్తున్నాడు. ఆ చూపులు బతిమాలుతున్నట్లుగా ఉన్నాయి.

"ఏం జరిగింది కొకాయ్?" అని అడిగాను.

కొన్ని క్షణాలవరకూ అతడేమీ మాట్లాడలేదు. తర్వాత తన ఖాకీ చొక్కాతో కళ్లు తుడుచు కుంటూ ఏడవసాగాడు.

నేను అతడి భుజంపైన చేయివేసి "కొకాయ్ నానుంచి నీకు ఏమైనా సాయం కావాలా?" అని అడిగాను.

"డాక్టర్‌బాబు, నా భార్యకి ఒంట్లో బాగోలేదు. అస్సలు బాగోలేదు" ఏడుస్తూ చెప్పాడతను.

ఒక్క క్షణంపాటు అతనికి ఏం సమాధానం చెప్పాలో నాకర్థంకాలేదు. ఓ అరవై ఏళ్ళ వృద్ధుడు, తన ముసలి భార్యకోసం అంతలా కన్నీళ్ళు పెట్టడం చాలా అరుదుగా చూస్తుంటాను.

"నేను వచ్చి నీ భార్యని పరీక్షించనా?" అని అడిగాను.

H H H

చాలీహా భవనం వెనుక ఉన్న తన గదికి నన్ను తీసుకువెళ్ళాడు కొకాయ్. గుడ్డిగా వెలుగుతున్న ఓ చిన్న బల్బు ఆ గదిలోకి చీకటిని తరమలేకపోయింది. ఆ మసక వెలుతురులోనే నేను ఆమెని చూడగలిగాను. ఓ చిన్న మంచంమీద ఆమె ప్రశాంతంగా నిద్రపోతోంది. ఏవో తీయని కలలు కంటున్నట్లుగా ఉన్నాయామె కనురెప్పలు. నెరసిన జుట్టు ఆమె ముఖానికి కళ తెచ్చింది. బహుశా ఆమె తలచుకుని ఉంటే, ఏ గొప్పింటికో యజమానురాలిగా మిగిలేదేమో. కానీ ఆమె ఓ పేదవాడిని వివాహమాడింది. వారికి పిల్లలు లేరనే విషయం నాకూ తెలుసు.

"ఈమె నా భార్య డాక్టరు బాబూ!" అంటూ నాకో పెద్ద ఫైలు అందించాడు కొకాయ్. అందులో ఆమె వైద్యపరీక్షల నివేదికలు, ఎక్సరే ఫిల్మ్‌లు ఉన్నాయి. పాపం. ఆమెకు ఊపిరితిత్తుల కాన్సర్. అది కూడా బాగా ముదిరిపోయింది. చివరిదశలో ఉంది.

"క్షమించు కొకాయ్! ఇక నేను చేయగలిగిందేమీలేదు" అన్నాను.

"ఆమె బాధను భరించలేకపోతోంది డాక్టర్ బాబూ. నొప్పి చాలా తీవ్రంగా ఉంటోంది. రోజూ సాయంత్రం పూట ఓ నర్సు వచ్చి ఓ డోసు మార్ఫిన్ ఇంజక్షన్ ఇస్తోంది. దాంతో మా ఆవిడకి బాగా నిద్రపడుతోంది. కానీ పగలంతా క్రూరమైన బాధని భరిస్తోంది. తను చనిపోతోందని నాకు తెలుసు. కానీ ఆమె పడుతున్న యాతనని చూడలేకపోతున్నాను బాబూ" విలపిస్తూ చెప్పాడు కొకాయ్.

ఒక డాక్టరుగా, చివరిదశల్లో ఉన్న ఎందరో కాన్సర్ రోగులను చూశాను నేను. ఆ బాధ ఎంత దుర్భరమో నాకు తెలుసు.

"కొకాయ్, నేను చేయగలిగింది ఒక్కటే. కావాలంటే ఆమెకు మరో అదనపు డోసు మార్ఫిన్ ఇప్పిస్తాను. కనీసం బతికినంత కాలం తక్కువ బాధతో బతుకుతుంది" అన్నాను.

"దౌర్భాగ్యమైన బతుకు. ఇంకా ఎందుకు బాబూ? ప్రతీక్షణం ఓ శాపంగా మారుతుంటే! ఆమె చావుకు దగ్గరైంది. కానీ ఆ ఘడియలు ఇంకా రావడంలేదు. ఆమె చెప్పలేకపోతోంది. కానీ ఆమె

కళ్ళల్లో తనకి విముక్తి కలిగించమనే కోరిక కనబడుతోంది" అన్నాడు కొకాయ్.

"నువ్వు ఏమంటున్నావో నాకర్థం కాలేదు కొకాయ్" అన్నాను.

"డాక్టరుబాబూ ఆమెకు ఓ ప్రాణాంతకమైన ఇంజక్షన్ ఇవ్వండి. శాశ్వతంగా నిద్ర పోనివ్వండి" చెప్పాడు కొకాయ్.

కొకాయ్ మెర్సీకిల్లింగ్ గురించి మాట్లాడుతున్నాడని గ్రహించాను. నేను డాక్టర్ డెత్ గురించి, ఆయన రూపొందించిన ఆత్మహత్యాయత్నం గురించి తరచూ చదువుతూనే ఉంటాను. ఒక డాక్టర్‌గా నేను చేసిన ప్రమాణం రోగుల ప్రాణాలు కాపాడుతానని. అంతే కాని వాళ్ళ ప్రాణాలు హరిస్తానని కాదు.

"నీకు పిచ్చెక్కింది కొకాయ్" అన్నాను.

"డాక్టరుబాబూ! ఆమె చనిపోవాలంటే ప్రశాంతంగా చనిపోనివ్వండి. అంతేకానీ ప్రతిరోజూ దుర్భరమైన స్థితిలో, దినదినగండంగా బతుకుతుండడం చూడలేకపోతున్నాను" చెప్పాడు కొకాయ్.

"అలా చేయడం పాపం" అన్నాను.

"నేను పాపపుణ్యాలను పట్టించుకునే స్థితిలో లేను. నేను ఆమెను ఎంతగానో ప్రేమిస్తున్నాను. నాకుతెలుసు. ఆమె కూడా ఇదే కోరుకుంటోంది" అన్నాడు కొకాయ్.

నాకు కోపం ఆగలేదు. "అయితే ఆ పనేదో నువ్వే చేయవచ్చుగా. ఓ మనిషిని చంపడానికి ఎన్నో మార్గాలున్నాయి" అంటూ అరిచాను. గట్టిగా అరిచినా ఆ ముసలావిడకి నిద్రాభంగం కలిగించాలనే ఉద్దేశ్యం మాత్రం నాకులేదు.

H H H

నేను ఆస్పత్రికి చేరేసరికి ఆలస్యమైంది. ఓ పన్నెండుమందికి పైగా కల్తీసారా తాగి ఆస్పత్రి పాలయ్యారు. అందులో కొందరికి ఆ రాత్రి గడవడమే కష్టం అని తెలుసు. తర్వాతి ముప్ఫై ఆరుగంటలూ నాకు నిద్రలేదు. దాదాపు ఒకటిన్నర రోజు తర్వాతే నాకు విశ్రాంతి దొరికింది. ఆస్పత్రినుంచి బయటపడ్డాను. ఇంటికి వెడుతూ మీరాకి ఫోన్ చేశాను. మర్నాడు మధ్యాహ్నం ఏదైనా హోటల్‌లో కలిసి భోజనం చేద్దామని అడిగాను. ఆమె దానికి ఒప్పుకుంది.

ఆరాత్రి నాకు నిద్ర పట్టలేదు. కొకాయ్ మాటలే నా చెవిలో ప్రతిధ్వనిస్తున్నాయి. నేను కొకాయ్‌ని అర్థం చేసుకోలేకపోయాను. భార్యను అంతగా ఇష్టపడే వ్యక్తి, ఆమె మరణాన్ని ఎందుకు కోరుకుంటున్నాడు? ఒకవైపు ప్రేమిస్తున్నానంటూ, మరోవైపు ఆమె చావును కోరడం ఎలాంటి ప్రేమ? నా విషయానికి వస్తే మీరా లేని జీవితాన్ని ఊహించ లేకపోతున్నాను. కొకాయ్ మాటలు నాలో ఆలోచనల్ని, బాధని రేకెత్తించాయి.

మర్నాడు మధ్యాహ్నం నేను హోటల్‌కి వెళ్ళేసరికి, అప్పటికే మీరా అక్కడికి వచ్చి నాకోసం ఎదురుచూస్తోంది. నేను అరగంట ఆలస్యంగా వెళ్లినందుకు ఆమె చిరాకుపడుతోంది.

"సారీ మీరా! ఓ కుర్రాడి కాలు విరిగింది. అతడిని పరీక్షించి వచ్చేసరికి కాస్త లేటయింది." అన్నాను ఆమె పక్కనే ఉన్న కుర్చీలో కూర్చుంటూ.

"అవునవును. ఈ బోడి ప్రపంచంలో నువ్వు ఒక్కడివే కదూ డాక్టరువి" హేళనగా అంది మీరా.

"ప్లీజ్ మీరా! అలా మాట్లాడకు. నేను చెప్పేది విను. నీకో ముఖ్యమైన విషయం చెప్పాలి" అన్నాను.

"నీ ఆస్పత్రి కంటే ముఖ్యమైన విషయమా?" అడిగింది వ్యంగ్యంగా.

"మీరా, ఏమైంది నీకు?" అడిగాను.

"సరే, సరే. చెప్పు వింటున్నాను" అంది.

"శుభవార్త మీరా, నాకు విదేశాలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసేందుకు ప్రభుత్వ స్కాలర్‌షిప్ లభించింది" చెప్పాను. నేను ఉత్సాహంగా.

"ఆహా, ఎంతో సంతోషకరమైన వార్త" అంది మీరా.

"విదేశాలకు వెళ్లేలోపలే పెళ్లి చేసుకుంటే బావుంటుందనిపిస్తోంది మీరా కాబట్టి మనమిద్దరం వీలైనంత త్వరగా పెళ్లి చేసుకుందాం" అన్నాను.

నా మాటల్లో పెళ్లి ప్రతిపాదన తెచ్చిన విషయం నాకు స్ఫురించకుండానే నేను ఆ ప్రస్తావన తెచ్చాను.

కొద్దిసేపు నాకేసి తదేకంగా చూసింది మీరా. ఓ చిన్న నవ్వుతో...

"డాక్టరుబాబూ! ఈ మాటలు సీరియస్‌గా అంటున్నావా?" అని అడిగింది.

"నిజంగా మీరా"

"నేను నిన్ను పెళ్ళి చేసుకుంటానని ఎలా అనుకున్నావు ముకుల్?" అడిగింది మీరా.

"మీరా, హాస్యాలొద్దు" అన్నాను నేను.

"నేనేమీ హాస్యమాడడంలేదు ముకుల్" అంది. హఠాత్తుగా ఆమె స్వరం నాకు అపరిచితంగా తోచింది.

"కానీ నువ్వు నన్ను ప్రేమిస్తున్నానని చెప్పావు కదా?" అడిగాను.

"అది ఒకప్పటి మాట ముకుల్. నేనేమీ మూర్ఖురాలిని కాను. హాస్పిటల్ లేదా నేను. ఈ రెండింటిలో ఏదో ఒకదాన్ని ఎంచుకోవాల్సి వస్తే, నువ్వెప్పుడూ హాస్పిటల్‌నే ఎంచుకున్నావు. ప్రతీసారీ నన్ను విస్మరించావు. నేనంటే నీకేమాత్రం గౌరవంలేదు" అంది మీరా. నిష్ఠూరంగా.

"అది నిజం కాదు" అంటూ ఇంకా ఏదో చెప్పబోతున్నాను. ఇంతలోనే.

"అదే నిజం. కాకపోతే ఆరోజు నా పుట్టినరోజు పార్టీలో అలా మధ్యలో వెళ్లిపోయే వాడివి కాదు" కోపంగా అంది మీరా. ఆమెను ఇంతకుముందెప్పుడూ అంత కోపంలో చూడలేదు నేను.

"మీరా, అదో ఎమర్జెన్సీ కేసు. అక్కడ మనుషుల ప్రాణాలు పోతున్నాయి. కాబట్టి నేను వెళ్ళాల్సి వచ్చింది" సంజాయిషీ ఇచ్చుకున్నాను.

"కానీ నీకు కొకాయ్ భార్యను చూడడానికి మాత్రం సమయం దొరికిందేం? నువ్వు వెళ్ళడం వల్ల ఆమెకు ఏదైనా మేలు జరిగిందా? ఎలాగూ చచ్చిపోయేదే?" అంది మీరా.

"మీరా! కాస్త అర్థం చేసుకో" అన్నాను.

"ముకుల్, మనం చాలాసేపు వాదించుకున్నాం. నీకు నా సమాధానం కావాలి అంతేకదా, అయితే విను. మన పెళ్ళి జరగదు" చెప్పింది మీరా.

నా నోరు మూగబోయింది. ఏం మాట్లాడాలో నాకు తోచలేదు. అంతా అయోమ యంగా ఉంది. ఓడిపోయాననే భావన.

నేను చేసిన తప్పేంటి? ఈ అమ్మాయిని ఎంతగా ప్రేమించానో, నా వృత్తినీ అంతే ప్రేమించాను. నా ఆలోచనలు ఇలా సాగుతుండగానే వణుకుతున్న గొంతుతో...

"సారీ ముకుల్. ఈ ప్రస్తావన మరెప్పుడూ తేకు. ఆరోజు రాత్రి నువ్వు వెళ్ళిపోయాక రాజీవ్ తనని పెళ్ళి చేసుకోమని అడిగాడు. అతడిని నా చిన్నప్పటినుంచీ ఎరుగుదును. అందుకే అతడితో పెళ్ళికి ఒప్పుకున్నాను. నీకన్నా అతడే ఎంతో నయం" అంది మీరా. ఆమె స్వరంలో అపరాధ భావం ధ్వనించింది.

ఏం మనిషిని నేను? ఆమెని ప్రేమించానని నేను మాత్రమే అనుకున్నాను. కానీ నిజమైన ప్రేమంటే నాకూ, మీరాకి ఇద్దరికీ తెలియదు. కొకాయ్ అన్న "నేను ఆమెను ఎంతగానో ప్రేమిస్తున్నాను. ఆమ బాధపడుతుంటే చూడలేకపోతున్నాను" అన్న ఈ మాటలే నా చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. అప్పుడే నాకు నిజమైన ప్రేమంటే ఏమిటో అర్థమైంది. కొకాయ్ వేదన కూడా అర్థమైంది. హఠాత్తుగా నాకు నవ్వొచ్చింది. బిగ్గరగా నవ్వుతూ, కుర్చీలోంచి లేచి తలుపు దగ్గరికి వచ్చాను. మీరా పిలుస్తున్నా వినిపించుకోకుండా బయటకు నడిచాను.

"మీరా నిన్ను క్షమించాను. నిజమైన ప్రేమంటే ఏమిటో నాకిప్పుడే తెలిసింది" అంటూ నాలో నేనే గొణుక్కున్నాను.

ఒక ప్రాణాంతక ఇంజక్షన్ చేతిలోకి తీసుకున్నాను. ఒకేఒక్క డోసు చాలు. కొకాయ్ భార్యకు బాధలనుంచి శాశ్వతంగా విముక్తి కల్గించడానికే నిర్ణయించుకున్నాను. ఈ పని చేయడానికి నాలో మనోబలం, గుండెనిబ్బరం కలిగాయని నాకు అనిపించింది.

H H H

నేను కొకాయ్ ఇంటికి వెళ్ళేసరికి అక్కడ కొద్దిమంది గుమిగూడి కన్పించారు. అంతటా నిశ్శబ్దం వ్యాపించి ఉంది. అక్కడక్కడా పోలీసులు కూడా ఉన్నారు. సబ్ ఇన్‌స్పెక్టర్ తన పుస్తకంలో ఏవో రాసుకుంటున్నాడు. తీరా చూస్తే అతడు త్రిదీప్. చిన్నప్పుడు మేమిద్దరం ఒకే గదిలో

ఉండేవాళ్లం.

"హలో త్రిదీప్, ఏం జరిగింది?" అడిగాను నేను.

"ఓ... నువ్వా ముకుల్. ఏం చెప్పాలో అర్థంకావడంలేదు. అంతా గందరగోళంగా ఉంది. రాయేంద్రచాలీహాగారి ఇంటి వాచ్‌మేన్ కొకాయ్ జబ్బుతో ఉన్న తన భార్యను చంపి, తనూ ఆత్మహత్య చేసుకున్నాడు. ఇదంతా జరిగి రెండురోజులు అవుతోంది. ఎవరికీ తెలియదు. దుర్వాసన వ్యాపించడంతో మేం తలుపులు బద్దలుకొట్టి లోపలికి వెళ్లాం" చెప్పాడు త్రిదీప్. నేను స్థాణువులా వుండిపోయాను. రెండురోజులక్రితం నేనేగా కొకాయ్‌తో.

"ఆ పనేదో నువ్వే చేయవచ్చుగా. ఒక మనిషిని చంపడానికి ఎన్నో మార్గా లున్నాయి" అని అన్నాను. నా మాటలే నా చెవుల్లో మారుమోగుతున్నాయి. ఆ మాటలు అనకుండా ఉంటే ఎంత బాగుండేది? కొకాయ్ ఎందుకిలా చేశాడు? కొకాయ్ విజ్ఞప్తికి ముందే అంగీకరించి ఉంటే కనీసం కొకాయ్ అయినా బతికి ఉండేవాడేమో... నాలో అణువణువునా అపరాధ భావం తలెత్తింది.

హఠాత్తుగా నన్ను నిస్సత్తువ ఆవరించింది. నా చేతిలోని ఇంజక్షన్ జారిపోయింది. కిందకు చూడలేదుకానీ అది నేలకు తగిలి పగిలిపోవడం వినిపించింది. దాంతో ఇక ఏం పని? దాని అవసరం ఇక ఏమాత్రంలేదు.

*(విపుల, జూన్ 2003)*

**'వృత్తిధర్మం' కథకి మూలం "Fatal Devotion" అనే ఆంగ్లకథ.**
**మూలకథ www.aslilinks.com అనే వెబ్‌సైట్‌లో ప్రచురితమైంది.**

# సందేశము × అనుభవము

**కాశ్మీరీ : డా॥ హరికృష్ణ కౌల్**

**మే**ము స్టేషన్ చేసేసరికి చీకటిపడింది. స్టేషన్లో అడుగుపెట్టగానే మా దృష్టి రిజర్వేషన్ ఛార్ట్‌పై పడింది. కాని మమ్మల్ని దురదృష్టం వెంటాడింది. వెయిటింగ్‌లిస్ట్‌లో నా మిత్రుడి కన్నా ముందున్న అదృష్టవంతులకు బెర్త్‌లు దొరికాయి. నా మిత్రుడు ఏ పాపం చేసాడో, ఏమో! దుర్భాగ్యం అతడిని, అతడి వెంట ఉన్నందుకు నన్నూ పట్టుకున్నట్లుంది. నా మిత్రుడు పూనే నుంచి వచ్చే రైల్లో జమ్మూ వెళ్ళాలి. ఆ రైలు రెండున్నర గంటలు ఆలస్యంగా వస్తోంది. దీని ప్రభావం అతడిపై కంటే, నా మీదే ఎక్కువగా పడుతోంది. ఒకవేళ రైలు సరైన సమయానికే వచ్చుంటే తొమ్మిది గంటల కల్లా నేను నా మిత్రుడికి వీడ్కోలు పలికి, పదిగంటల ఆఖరి బస్‌లో ఇంటికి వెళ్ళిపోయే వాడిని. కాని రైలు అల వాటుగా ఆలస్యంగా వస్తోంది. నాకేం చేయాలో తోచడం లేదు. స్నేహాన్ని, అతిథి ధర్మాన్ని పక్కనబెట్టి, మిత్రుడిని వదిలిపెట్టి వెళ్లిపోవాలా? లేక రాక రాక వచ్చిన పాతమిత్రుడి పట్ల నా కర్తవ్యాన్ని నిర్వహిస్తూ, బండి వచ్చేవరకు ఆగి అతడికి వీడ్కోలు పలకాలా? ఏ నిర్ణయం తీసుకోలేక, భారం భగవంతుడిపై వేసాను. దేవుడి దయ ఉంటే సుఖంగా ఇల్లుచేరుతాను. లేకపోతే అన్నిటికీ ఆయనే గతి!

"అబ్బబ్బా! ఈ దేశం ఎప్పటికీ బాగుపడదు! ఏ రైలూ సమయానికి రాదు. ఏ విమానమూ సమయానికీ ఎగరదు" అని అసహనంగా అంటూ నా మిత్రుడు బల్ల మీద నుంచి లేచి, ప్లాట్‌ఫారం మీద పచార్లు చేయసాగాడు. నేను స్టేషన్ మాస్టారు గదికి వెళ్ళాను. కంగారు పడాల్సిందేమీ లేదని, రైలు వస్తూనే, టి.టి.ఇతో మాట్లాడితే సరిపోతుందని ఆయన భరోసా ఇచ్చారు. ఏవైనా బెర్త్‌లు ఖాళీ ఉంటే మాకు కేటాయిస్తారని ఆయన అన్నారు.

ముక్కున ఆహారాన్ని కరచుకుని పిల్లల వద్దకి పరిగెత్తే కోడిపెట్టలా, నేనీ శుభవార్త మోసుకుంటూ నా మిత్రుడి వద్దకు చేరాను. ఈ వార్త విన్న నా మిత్రుడు పెద్దగా సంతోషించలేదు. ఎగతాళిగా నవ్వుతూ, "స్కూలు మాస్టర్ల నుంచి స్టేషన్‌మాస్టర్ల వరకు అందరూ బాగానే ఉపదేశా లిస్తారు. ఈ దేశాన్ని ఎవరూ బాగుచేయలేరు" అని అన్నాడు. నా ఈ మిత్రుడు కాశ్మీరులో కెల్ల సుప్రసిద్ధులైన మేధావులలో ఒకడు. 'మానవ హక్కుల'పై జరిగిన ఓ అఖిల భారత సమావేశంలో పాల్గొనడానికీ ఢిల్లీ వచ్చాడు. రెండురోజుల పాటు జరిగిన ఆ సమావేశం నిన్న సాయంత్రమే ముగిసింది. ఈ రోజు పొద్దున్న హోటల్ గది ఖాళీ చేసి, మా ఇంటికి వచ్చాడు. అప్పట్నించి

ఇప్పటిదాక మా కుటుంబంతోనే గడిపాడు. మొదట మేమిద్దరం కలసి ఇండియన్ ఎయిర్‌లైన్స్ ఆఫీసుకి వెళ్ళాం. నా మిత్రుడు అక్కడి ఉద్యోగులని బ్రతిమాలి తన విమాన ప్రయాణాన్ని రద్దు చేయించుకుని, ఆ డబ్బుల్ని జేబులో వేసుకున్నాడు. అక్కడ్నించి మేము కరోల్‌బాగ్ వెళ్ళాం. తన భార్యకి, పిల్లలకీ బట్టలు, ఇంకా ఏవో సామాన్లు కొన్నాడు నా మిత్రుడు. తర్వాత మా ఇంటికి వచ్చి, కమ్మటి కాశ్మీరీ వంటకాలతో భోజనం చేసాం. తింటున్నంత సేపు నా మిత్రుడు నా భార్య చేతి వంటని తెగపొగిడాడు. నా పిల్లలతో ఆటలాడాడు. ఇన్నేళ్ళుగా ఢిల్లీలో ఉంటున్నా, మేమంతా కాశ్మీరీ భాషలోనే మాట్లాడుకుంటున్నందుకు మమ్మల్ని అభినందించాడు. మా కబుర్లలో ఎన్నో విషయాలు దొర్లాయి. ప్రతి వ్యక్తిపైన, ప్రతి విషయంపైన అతడికి ఏదో ఒక దురభిప్రాయం ఉన్నట్లుంది. తండ్రులు తమ పిల్లల పట్ల చేసే ఫిర్యాదులా ఉన్నాయి అతని మాటలు. అతడి ఉద్దేశ్యంలో మౌలికంగా మనిషి కుక్క కన్నా హీనుడు. ఎలుగుబంటి కన్నా అనాగరికుడు. ఏ రోజైతే మనిషి నాలుగుకాళ్ళకు బదులుగా రెండు కాళ్ళతో నడవడం మొదలుపెట్టాడో, ఆ రోజు నుంచే తమ జాతిని ఉద్ధరిస్తూ, మిగతా ప్రాణికోటిని అణగదొక్కడం ప్రారంభించాడు. ఈ మాటలు అని నా మిత్రుడు దీర్ఘంగా నిట్టూర్చాడు. “ఈ ప్రపంచాన్నే ఎవరూ బాగు చేయలేరు” అని అన్నాడు విరక్తిగా.

సుమారు సాయంత్రం నాలుగు గంటల సమయంలో నా మిత్రుడి కోరిక ప్రకారం మా ఆవిడ చిక్కటి కహవా(కాశ్మీరీ టీ) తయారుచేసింది. కహవా తాగాకా, మా కబుర్లు చాలాసేపు కొనసాగాయి. రాత్రి ఏడుంపావుకి నేను అతడు కలసి టాక్సీలో రైల్వేస్టేషన్‌కీ చేరాం. ఇప్పుడు సమయం తొమ్మిదింపావు అవుతోంది.

H H H

రెండోనెంబరు ఫ్లాట్‌ఫారం నుంచి ఏదో బండి బయల్దేరింది. మూడోనెంబర్ ఫ్లాట్ ఫారంపై ఏదో బండి ఎక్కడి నుంచో వచ్చి ఆగింది. పూనే నుంచి రావల్సిన రైలు ఆగే ఒకటవ నెంబరు ఫ్లాట్‌ఫారం మాత్రం ఖాళీ పట్టాలతో బోసిగా ఉంది. రైలు త్వరగా వచ్చే సూచనలేవీ కనబడడం లేదు. నా మనసులో మాత్రం ఆలోచనల రైళ్లు పరిగిడుతున్నాయి.

“నా మిత్రుడిని అతడి మానాన అతడిని వదిలేసి వెళ్లిపోవడం భావ్యమా? లేకపోతే అతడిని సాగనంపి అప్పుడు ఇంటికి వెళ్ళడమా? లేకపోతే వచ్చే బండిలో నా మిత్రుడు సుఖంగా నిద్రపోడానికి బెర్త్‌కోసం ప్రయత్నించాలా? అతడిని పంపిన తర్వాత నేను ఇంటికి ఎలా వెళ్ళాలి? నిజమే పదిగంటలు దాటితే బస్సులు ఉండవు. కాని ‘త్రీ-వీలర్స్’ ఉంటాయిగా?” ఇలా కొనసాగాయి నా ఆలోచనలు.

ఇంతలో నా ఆలోచనలపై నీళ్లు కుమ్మరించినట్లుగా, ఓ కఠిన వాస్తవం నాకు స్ఫురించింది. త్రీ- వీలర్‌లో స్టేషన్‌నుంచి మా ఇంటికి వెళ్ళాలంటే కనీసం 15 రూపాయల దాక అవుతుంది. కాని ప్రస్తుతం నా దగ్గర ఒకే ఒక అయిదు రూపాయల నోటు ఉంది. అర్ధరాత్రి ఇంటికి చేరి,

మా ఆవిడని నిద్రలేపాలి. ఆమె దగ్గర నుంచి మిగతా డబ్బులు తీసుకోవాలి. ఇదంతా జరిగేదేనా? ఈ సమస్య నుంచి బయట పడడం ఎలా? మా ఆవిడని నిద్రలేపితే నాకు చివాట్లు తప్పవు. పైగా ఇంట్లో ఉన్న కొన్ని రూపాయలని పిల్లలపై ఖర్చు చేయకుండా, నా మిత్రుడి కోసం ఖర్చు చేసినందుకు రుసరుసలాడుతుంది. పైగా త్రీ- వీలర్ డబ్బులు ఆమెనే అడగడం ఆమెకీ జరిమానా లాంటిదే! నేను నా మిత్రుడివైపు దృష్టి మరల్చాను.

అతడు కాలక్షేపం కోసం ఓ సాయంకాలపు వార్తాపత్రిక కొని చదవడం మొదలు పెట్టాడు. అతడి దగ్గరగా వెళ్ళి, నేనూ వార్తలు చదవసాగాను.

"అయిదు కోట్లు" అన్నాను నేను ఛీత్కారంగా. పెద్ద పెద్ద తలలు ఇరుకున్న ఐదుకోట్ల రూపాయల కుంభకోణం గురించిన వార్తను చూసి.

"అయిదు కోట్లకే నువ్వు ఇంతగా ప్రతిస్పందిస్తున్నావు. ఈ రోజులలో కోటి రూపాయలు పెద్ద మొత్తమేం కాదు. నీకుతెలుసా, ఈరోజులలో జరిగే సదస్సులు, సమా వేశాలలో ఎన్ని కోట్లు వృథా అవుతాయో లేక్కేలేదు. డబ్బు నీళ్ళలా ప్రవహిస్తుందనుకో. ఈ దేశాన్ని ఎవరూ బాగుచేయలేరు" అన్నాడు నా మిత్రుడు నా అజ్ఞానానికీ చిన్నగా నవ్వుతూ.

"అంటే, నువ్వు పాల్గొన్న ఈ సమావేశపు ఖర్చులు కూడ బూడిదలో పోసిన పన్నీరేనా?" అని అడిగాను.

"కచ్చితంగా! పాల్గొన్నవారందరికీ రానుపోను రైల్లో ఫస్ట్‌క్లాస్ లేదా విమాన ప్రయాణఛార్జీలు ఇచ్చారు. ఫైవ్‌స్టార్ హోటల్లో బస ఏర్పాటుచేశారు. మధ్యాహ్న భోజనాలు, రాత్రిభోజనాలు, టిఫిన్లు, కాఫీలు, పార్టీలు....ఇలా వీటన్నింటిపై వేలల్లో కాదు, లక్షలల్లో రూపాయలు అవసరమవుతాయి. కాని ఇక్కడ జరిగేదేమిటి? వస్తారు....కూర్చుంటారు. ఏవో నాలుగు మాటలు మాట్లాడుతారు, తిరిగి వెళ్లిపోతారు. వీటికీ తోడు శుభ్రంగా తిని తాగుతారు" అంటూ వివరించాడు నా మిత్రుడు.

"ఈ దేశాన్ని ఎవరూ బాగుచేయలేరు" ఈ మాటలు ఈసారి నా నోట్లోంచి వచ్చాయి.

"ప్రజలకు ఒరిగే మేలు సంగతేమోగాని, నాకు మాత్రం గొప్పలాభం చేకూరింది" అన్నాడు నా మిత్రుడు.

"ఏంటది?" అని అడిగాను.

"పదేళ్ళ తర్వాత నేను నా పాతస్నేహితుడిని కలుసుకోగలిగాను" అని అంటూ నా మిత్రుడు నన్ను హత్తుకున్నాడు.

తర్వాత నా భుజం మీద చెయ్యివేసి, దగ్గరలోని ఓ స్టాల్‌వైపు నడిపించాడు. రెండు గ్లాసులు బత్తాయిరసం ఆర్డరిచ్చాడు. అతిథి మర్యాద ప్రకారం వాటికి డబ్బులు నేనివ్వాలి. కాని నా దగ్గర ఒకే ఒక ఐదు రూపాయల నోటు ఉంది. ఈ ఇబ్బందికర పరిస్థితి నుంచి తప్పించుకోడానికి, నా దృష్టిని మైక్ ద్వారా వినబడుతున్న ప్రకటనవైపు మరల్చాను. ఇంతలో నా మిత్రుడు డబ్బులు

చెల్లించి, ఓ గ్లాసుడు బత్తాయిరసం నా చేతిలో పెట్టాడు. చల్లటి పండ్లరసం తాగుతున్నా, సిగ్గువల్ల నాకు చెమటలు పట్టాయి. చూస్తుండగానే రెండున్నర గంటలు గడిచిపోయాయి.

H H H

దాదాపు పదిన్నర అవుతుండగా 'సిగ్నల్ డవున్' అయ్యింది. దూరంగా పట్టాల దగ్గర వెలుగుతున్న ఎర్రదీపం బదులుగా ఇప్పుడు ఆకుపచ్చ దీపం కనిపిస్తోంది. బండి వస్తోందనడానికది సంకేతం. కొద్దిసేపటికి పూర్వకాలంలోని రాకాసిబల్లిగా, పెద్దగా శబ్దం చేస్తూ వచ్చి ఆగింది రైలు. పెట్టెలు పట్టుకున్న పురుషులు, పిల్లల చేతులు పట్టుకున్న స్త్రీలు, తలమీద సామాన్లలతో కూలీలు అందరూ ఫ్లాట్‌ఫారంపై పరుగులు తీస్తున్నారు. అంతా గందరగోళంగా ఉంది. ఎక్కేవాళ్ళు దిగేవాళ్ళని దిగనివ్వకుండా లోపలికి జోరబడు తున్నారు. ఇదంతా నా మిత్రుడికి చిరాకు కల్గించింది. అతడి ముఖంపై ఎప్పుడూ తొణికిస లాడే వ్యంగ్యపు నవ్వు ఇప్పుడు లేదు.

ఇంతలో నల్లకోటు ధరించిన టి.టి.ఐ. ఫ్లాట్‌ఫారంపై ప్రత్యక్షమయ్యాడు. వెంటనే ప్రయాణీకులందరూ అతడిని చుట్టుముట్టారు. వాళ్ళని ఏ మాత్రం పట్టించుకోకుండా, ఏ బోగీలోను బెర్త్‌లు ఖాళీలేవని ప్రకటించాడు టి.టి.ఇ. నా మిత్రుడి ముఖం చిన్న బోయింది. కాని నేను మాత్రం ఆశవిడవక టి.టి.ఇ. కేసే బ్రతిమాలుతున్నట్లు చూడ సాగాను. అతడు మాత్రం తన చుట్టూ మూగినవాళ్లని కసురుతూ, అటూఇటూ చూస్తు న్నాడు. నాకేసి కూడ రెండుమూడుసార్లు అదోలా చూసాడు. అతడికి నా మీద కాదు కాదు నా మిత్రుడిపై దయ కల్గినట్లుంది. లేదా మమ్మల్ని అమాయకులనుకున్నాడో! చుట్టూ ఉన్న జనం పలచబడిన తర్వాత, అతడు ఏ మాత్రం సిగ్గుపడకుండా ఇరవైరూపాయలు ఇవ్వమని అడిగాడు. వెంటనే నా మిత్రుడు రెండు పదిరూపాయల నోట్లు నా చేతిలోపెట్టాడు. నేను వాటిని టి.టి.ఇ. కి అందించాను. అతడు వాటిని తన జేబులో వేసుకున్నాడు. నా మిత్రుడి ముఖం వెలిగిపోయింది. చిన్నగా నవ్వుతూ "ఇతగాడి ఆకలి తీరింది. నాకు బెర్త్ దొరికింది. నా సమస్య తీరింది. ఈ దేశాన్ని మాత్రం ఎవరూ బాగుచేయలేరు" అని కాశ్మీరీ భాషలో, లో గొంతుకతో నాతో అన్నాడు.

టి.టి.ఇ. ముఖంలో ఏ భావమూ కనిపించనీయకుండా, నన్ను టికెట్ అడిగాడు. నా మిత్రుడి వద్ద నుంచి టికెట్ తీసుకుని, అతడికీ అందించాను. దానిపై బోగీ నెంబరు, బెర్త్‌నెంబరు రాసిచ్చాడు టి.టి.ఇ. వెంటనే నా మిత్రుడు టికెట్‌ని అందుకుని బోగీ వెదుక్కుంటూ పరిగెత్తాడు. నేనూ అతడి వెనకే బయల్దేరాను. ఇంతలో టి.టి.ఇ. నన్ను వెనక్కి పిలిచి, "ఇంకో టికెట్ ఏది?" అని అడిగాడు.

"మా ఇద్దరిలో జమ్మూ వెళ్ళేది ఒక్కడే. వెళ్ళాల్సిన వ్యక్తి బోగీ వెదుక్కుంటున్నాడు" అని చెప్పాను నేను.

ఈ మాటలు వినగానే టి.టి.ఇ.కి ఒక రకమైన విసుగుదల వచ్చింది. అసహనంగా చూస్తూ,

"నేను సెకండ్ క్లాస్‌లో ఒక బెర్త్‌కీ ఖచ్చితంగా పదిరూపాయలే తీస్కుంటాను. అంతకంటే ఒక రూపాయి ఎక్కువా వద్దు, తక్కువా వద్దు' అంటూ జేబులో చెయ్యిపెట్టి ఓ పదిరూపాయల నోటు బయటకు తీసాడు. దాన్ని నా చేతిలో ఉంచి అక్కడ్నించి వెళ్ళిపోయాడు. ఈ మాట అందరితోనూ చెప్తాడో లేక నాకు మాత్రమే చెప్తాడో నాకు తెలియలేదు.

నేను దూరంగా ఉన్న నా మిత్రుడిని చూసాను. 'జీలం ఎక్స్‌ప్రెస్'లో తన బోగీ వెదుక్కోడంలో నిమగ్నమై ఉన్నాడతను.

నేను అటు ఇటు చూసి, ఆ పది రూపాయల నోటును నా జేబులో వేసుకున్నాను. ఇప్పుడు నా దగ్గర పదిహేను రూపాయలు ఉన్నాయి. ఇంటి దగ్గర నుంచి తెచ్చిన ఐదు రూపాయల నోటు, దైవకృపవల్ల ఇప్పుడే నా జేబులోకి చేరిన పదిరూపాయల నోటు. నేనిప్పుడు ఏ ఇబ్బంది లేకుండా, హాయిగా 'త్రీ- వీలర్'లో ఇంటికి వెళ్ళిపోవచ్చు. కాని ఇంటికి కాస్త ముందే దిగి త్రీ- వీలర్ వాడికి డబ్బులు ఇచ్చేయాలి. నేను త్రీ- వీలర్‌లో వచ్చినట్లు మా ఆవిడకీ అనుమానం రాకూడదు మరి!

నేను ఒకసారి రైలుబండి కేసి చూసాను. నా మిత్రుడు తన బోగీని కనుక్కోడంలో ఇంకా అవస్థ పడుతున్నాడు. స్నేహధర్మం, అతిథి మర్యాదా పాటిస్తూ, బోగీని వెదకడంలో సాయం చేయడం కోసం నా మిత్రుడివైపు కదిలాను.

*(జాగృతి 2, ఫిబ్రవరి 2004)*

**సందేశము × అనుభవము కథకి మూలం 'దాయేగంటే' అనే కాశ్మీరీ కథ. ఈ కథ 2000 సంవత్సరపు కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గెలుచుకున్న 'యాత్ రజ్దానే' అనే కథా సంకలనంలోనూ, 'ఆధాయి గంటే' అనే పేరుతో హిందీలో www.abhivyakti-hindi.org అనే వెబ్‌సైట్‌లో ప్రచురితమైంది.**

# మనీప్లాంట్

హిందీ : డా॥ అన్వితా అబ్బీ

ఆమెకు పక్కమీద నుంచి లేవాలనిపించలేదు. కాసేపు అటూ ఇటూ కదిలి బద్ధకంగా ఒళ్లు విరుచుకుంది. పరుపు బాగా చల్లగా ఉన్నట్లనిపించింది. కళ్ళపైన అరచేతులు పెట్టుకుంటే కళ్లు కూడా చల్లగా అనిపించాయి. కనురెప్పలు తడిగా ఉన్నట్లున్నాయి.

ఆమె రోదిస్తోందా? లేదు. ఆమె ఏడవడం లేదు. ఆమె పూర్తిగా కళ్ళు తెరవాలను కుంటున్నా ఎవరో తన రెప్పలను గట్టిగా పట్టుకున్నట్టుగా, కళ్ళు తెరవలేకపోతోంది. పక్కమీద నుంచి లేచి, వెళ్ళి ముఖం కడుక్కోవాలని అనుకుంది. కాని 'ఈరోజు' ఇంత త్వరగా మొదలవటం ఆమెకిష్టంలేదు. రాత్రి అంత తొందరగా ఎందుకు గడిచిపోయింది? ఇక ఈ పగలంతా భారంగా గడవాల్సిందే. ఆమె వీపు కింద ఏదో గుచ్చుకున్నట్లయ్యింది. చేత్తో తడిమి చూస్తే జడకి పెట్టుకునే రబ్బర్ బ్యాండ్. దాన్ని జడకు సరిగా పెట్టుకుంది. ఇంతలో ఆమెకి రాత్రి తనకొచ్చిన వింత కలలు గుర్తొచ్చాయి. కలలో ఎవరో ఆమె జుట్టును కత్తిరించేశారు. అప్పటి తన ముఖాన్ని జ్ఞాపకం చేసుకుంది. ఓహ్. ఎంత వికారంగా ఉందో. తన జుట్టుని కత్తిరించిన వ్యక్తి రూపాన్ని గుర్తు చేసుకోడానికి ప్రయత్నించింది. అతడి మఖంలో వాళ్ళ అన్నయ్య పోలికలు చాలా ఉన్నాయి. ఆ వ్యక్తి ఆమె జుట్టు కత్తిరించి, ఆమెను ఓ స్తంభానికి కట్టేశాడు. ఆమె గట్టిగా అరుస్తూ, దాన్నుంచి విడిపించుకోవాలని ప్రయత్నిస్తోంది.

కళ్ళు మూసుకుంది. కలలో జరిగిన సంఘటన తిరిగి, ఆమె ఎదుట ప్రత్యక్షమైంది. స్తంభం నుంచి విడిపించుకునేంత బలం తనకు లేనందుకు ఆమె విచారించింది. ఇంతలో తను వ్యర్థమైన విషయాల గురించి ఆలోచిస్తున్నానని ఆమెకే తోచింది. ఎంతైనా కల కలే. చాలా కలలకు అర్థాలు ఉండవు. ఉన్నా, వాటిని పెద్దగా పట్టించుకోనవసరం లేదు.

ఆమె నాలుకతో తన దవడలను తాకింది. నోరంతా వాసన వస్తోంది. లేచి పళ్లు తోముకోవాలనుకుంది. వెంటనే లేచి, నేలపై కాళ్ళు పెట్టింది. అయినా ఆ చల్లటి నేల పాదాలకు తగిలేసరికి ఆమె శరీరం చిన్నగా వణికింది. చల్లదనం ఆమెకు హాయిగా తోచింది. ఆమెకు మళ్ళీ నిన్నటి రాత్రి జ్ఞాపకమొచ్చింది. అన్నయ్య మాటలు, దిగులుగా ఉన్న అమ్మ ముఖం, దగ్గుతున్న ముసలి తండ్రి రూపం ఆమెకి జ్ఞాపకం వచ్చాయి. ఇంట్లోని అన్ని వస్తువులూ చల్లగా, నిర్జీవంగా అయిపోయినట్లు ఆమెకి అనిపించింది. ఒకవేళ ఇంకా అవకపోతే, త్వరలోనే నిర్జీవం అయిపోతాయి.

వంటింట్లో గిన్నెలు సర్దుతున్న చప్పుడవుతోంది. మరింత జాగ్రత్తగా వినడానికి ప్రయత్నించింది. బహుశా అమ్మకి కోపం వచ్చినట్లుంది. అమ్మకి రాత్రి నిద్రలా పట్టి ఉంటుంది? మధ్యరాత్రి దాహం వేసి నిద్రలేచినప్పుడు అమ్మ వాళ్ళ గదిలోంచి ఏవో మాటలు వినపడ్డాయి. ఆమెకి బాగా దాహం వేస్తుండడం వల్ల, ఆ మాటలు వినడానికి ప్రయత్నించ కుండా, రెండు గ్లాసుల నీళ్ళ తాగి వెళ్లి పడుకుంది. నిద్రపోయేముందు తన పక్కనే పడుకున్న చెల్లెలు 'మీనూ' కేసి చూసింది. ఆమెకు ఈ సంఘటన గురించి ఏమీ తెలియదు. కాబట్టి ప్రశాంతంగా నిద్రపోతోంది. అన్నయ్య నిర్ణయాన్ని గుర్తుచేసుకుంటూ, కళ్లు మూసు కోవడానికి ప్రయత్నించింది. మర్నాడు రాత్రి అన్నయ్య విమానంలో కెనడా వెళ్లిపోతున్న సంగతి. అతడి నుంచి ఇకపై ఎటువంటి ఆర్థిక సహాయం రాదన్న సంగతి ఆమెకి స్ఫురించాయి. అన్నయ్య ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నాడో తెలుసుకుందా మనుకుంది. కాని వదిన గుర్తొచ్చి ఆ ప్రయత్నాన్ని విరమించుకుంది. రాత్రి ఆలస్యంగా నిద్రపట్టింది.

ఇంతలో పక్క గదిలోంచి తండ్రి దగ్గు వినిపించింది. ఆమె తన గదిలోంచి బయటికొచ్చి, స్నానాల గదిలోకి దూకింది. గబగబా కళ్ళపై నీళ్లు జల్లుకుంది. కళ్ళ మంటలు కాస్త తగ్గినట్లనిపించింది. బయట వసారాలో అన్నయ్య ముఖం కడుక్కుంటున్న చప్పుడవుతోంది. 'రేపట్నించి ఈ చప్పుడు ఉండదు' అని అనుకుందామె.

అన్నయ్య, వదినా, మేనల్లుడు లేకపోతే ఈ ఇల్లు ఎలా ఉంటుందో?

"కేవలం అమ్మ, నేను, నాన్న, చెల్లెలు మాత్రమే ఉంటాం..." అని అనుకుంటూ ఆమె పళ్ళు తోముకోసాగింది.

"నీతూ" అంటూ అమ్మ వంటింట్లోకి పిలిచింది.

"ఏంటి?"

నీతు నోరంతా పేస్టు నురగతో నిండి ఉంది.

"నీతూ" మళ్ళీ కేక. ఈసారి అమ్మ స్వరంలో కోపం ధ్వనిస్తోంది.

అమ్మ ఎందికింత వ్యాకులపడుతోంది?

నీతు గబగబా పళ్ళు తోముకుని, ముఖం తుడుచుకుని వంటింట్లోకి వెళ్ళింది.

"టీ పెట్టు" అని చెప్పింది నీతూతో.

కిరసనాయిల్ స్టవ్ పంపు కొట్టసాగింది నీతూ. కొడుతూ అమ్మ ముఖం కేసి చూడసాగింది. అమ్మ ఏదో దీర్ఘాలోచనలో మునిగిపోయింది. రాత్రి నుంచి అమ్మ మరీ ముసలిదానిలా కన్పిస్తున్నట్లు నీతూకి అనిపించింది. సగం నెరసిన జుట్టును విరబోసుకుని ఉండడంతో అమ్మ వయసు ఓ పది – పదిహేనేళ్ళు పెరిగినట్లుగా ఉంది. నీతు పంపు కొడుతూనే, వణుకుతున్న చేతులతో అమ్మ ఆలుగడ్డల తొక్కు తీయడాన్ని చూస్తోంది.

ఇంతలో "చద్దామనుకుంటున్నావా?" అని అమ్మ గట్టిగా అరిచింది. ఆ కేకతో నీతూ

ఆలోచనల్లోంచి బయటపడింది. తీరా చూస్తే, తను పంపు అలా కొడుతూనే ఉంది. ఇంకొంతసేపైతే స్టవ్ పేలిపోయేదేమో. పేలిపోయినా బావుండేది. ఈ ఆవేదన, ఈ నిస్పృహ, ఈ యాంత్రికత, ఈ అనిశ్చిత స్థితి... అన్నీ ముగిసిపోయేవి. ఒకవేళ స్టవ్ పేలిపోయి నిప్పంటుకుంటే తనతోపాటు అమ్మ కూడా...! 'మంచిదేగా' అని అనుకుంది నీతూ. అమ్మ బాధ పడడం తను చూడలేదు. స్టవ్ మీద నీళ్ళ గిన్నె పెట్టింది.

"ఏమిటమ్మా ఆలోచిస్తున్నావు?" అడిగింది నీతూ.

"ఏం లేదు" అంది అమ్మ.

"అమ్మా, నువ్వు ఏమి అననంటే, నేను..." ఇక వాక్యం పూర్తి చేయలేకపోయింది నీతూ. ఎందుకంటే తను చెప్పబోయే విషయం వింటే అమ్మకు ఆవేశం రావచ్చు.

"నువ్వు..." అంటూ అమ్మ నీతూకేసి ప్రశ్నార్థకంగా చూసింది. బదులుగా నీతూ మౌనంగా ఉండిపోయింది.

"మాట్లాడు. ఏం చెప్పాలనుకుంటున్నావు?" అంది అమ్మ. ఆవిడకీ ఆతృతగా ఉంది.

"ఏం లేదు. వాళ్ళ బడిలో నాకేదైనా ఉద్యోగం ఇస్తుందేమోనని బల్జీత్‌కౌర్‌ను అడుగుదామను కుంటున్నాను" భయపడుతూ చెప్పింది నీతూ.

"ఏంటీ!" అమ్మ నీతూ మాటలు నమ్మలేకపోయింది.

"అవునమ్మా! ఇందులో తప్పేముంది?" అడిగింది నీతూ.

"చాల్లే. మేము ఆడపిల్ల సంపాదనపై బతకాలా?" అంది అమ్మ.

"అమ్మా, అర్థం చేసుకోవడానికి ప్రయత్నించు..." అంది నీతూ పెద్ద తరహాగా మాట్లాడుతూ. అమ్మ కళ్ళల్లో నీళ్ళు! అమ్మని చూస్తే నీతూకి జాలేసింది. ఉద్యోగం విషయం అనవసరంగా ప్రస్తావించానేమో అని అనుకుంది.

రెండు క్షణాల తర్వాత అమ్మ తేరుకుని, "నేను చచ్చాక, నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో" అంది కఠినంగా.

నీతూ స్టవ్ నుంచి వస్తున్న నీలిమంటలను చూస్తుండిపోయింది. తిరిగి అమ్మకేసి చూసింది. అమ్మ ముఖంలో నిర్లిప్తత కదలాడుతోంది. నీతూకి అన్నయ్యతో పోట్లాడాల నిపించింది. ఎప్పుడో ఏడేళ్ళక్రితం మిఠాయిల కోసం అన్నయ్యతో కొట్లాడింది.

"టీ తయారైందా?" తువాలుతో ముఖం తుడుచుకుంటూ అడిగాడు అన్నయ్య.

నీతూ, అమ్మ ఇద్దరూ మాట్లాడలేదు. అమ్మ జవాబిస్తుందేమోనని నీతూ అనుకుంది. అమ్మ గోధుమపిండి కలుపుతూ ఉండిపోయింది.

"ఇంకా ఎంతసేపు పడుతుంది?" అన్నయ్య అడిగాడు.

ఇక మాట్లాడక తప్పలేదు నీతూకి.

"తెస్తున్నాను" అంది అన్నయ్యతో.

"కొంచెం తొందరగా తే" అని చెప్పి అన్నయ్య వెళ్ళి మధ్యగదిలో కూర్చున్నాడు. నీతూ మరిగిన నీళ్ళలో టీ పొడివేసి, టీ కాచింది.

"ఆలూ పరాటా చేస్తున్నావా?" అని అడిగింది నీతూ.

"అవును, నాకు కాస్త సహాయం చేయి" అంది అమ్మ. ఆలూ పరాటాలంటే అన్నయ్యకి ఎంత ఇష్టమో నీతూకి తెలియనిది కాదు.

నీతూ ఓ పళ్ళెంలో టీ కప్పులు తీసుకుని మధ్య గదిలోకి వెళ్లింది.

"నీతూ, నా అలమారాలో బిస్కట్ పాకెట్ ఉంది. కొంచెం తెస్తావా, అన్నయ్యకి 'టీ' నేను ఇస్తాలే" అంది వదిన.

సరేనని, టీ పళ్ళెం వదిన చేతికిచ్చి, వాళ్ళ గదిలోకి వెళ్ళింది నీతూ. ఆ గదంతా ఖాళీగా ఉంది. అన్నయ్య వాళ్ళ సామాన్లన్నీ సర్దేశారు. నీతూ అలమారా తెరచి చూసింది. అందులో ఓ బిస్కట్ పాకెట్, ఓ చిన్న చేతి కుట్టుయంత్రం తప్ప మరేమి లేవు.

"ఇదిగో వదినా" అంటూ బిస్కట్ పాకెట్ అందించింది నీతూ. కప్పులోని టీ ఓ గుక్క తాగి, ముఖం చిట్లిస్తూ, "టీ చాలా ఘాటుగా ఉంది" అంది వదిన. పొద్దున్నే విమర్శలు వినడం ఇష్టంలేక అక్కడ్నించి వచ్చేసింది నీతూ. వంటింట్లోంచి నేతివాసన వస్తోంది. అమ్మ అప్పటికే నాలుగైదు పరోటాలను కాల్చింది.

"నన్నెందుకు పిలవలేదు?" అడిగింది నీతూ. ఇన్ని పరాటాలూ కాలుస్తూ కూడా అమ్మ తనని పిలవకపోవడం నీతూకి నచ్చలేదు. అమ్మని చూస్తుండిపోయింది.

"నాన్నగారికి టీ ఇచ్చావా?" అడిగింది అమ్మ.

"అయ్యో. మరిచిపోయాను..." అంటూ ఓ కప్పులో టీ తీసుకుని బయటకు నడిచింది నూతూ.

నీతూ వచ్చిన సంగతి గమనించి కూడా ఆయన తలెత్తలేదు. కప్పును దగ్గర్లోని బల్లపై పెడుతూ.... "నాన్నా, టీ తాగండి" అంది నీతూ.

"ఊఁ" అంటూ ఆయన మంచంపై నుంచి లేచారు. వార్తలు చదవడానికై ఆయన దినపత్రిక పైకి దృష్టి సారించారు.

'వెంటనే తాగండి. లేకపోతే చల్లారిపోతుంది' చెప్పింది నీతూ. పేపరు చదువుతు న్నట్లు కనిపిస్తున్నప్పటికీ, ఆయన ఆలోచనల్లో మునిగిపోవడం నీతూ గమనించింది. తన ఉద్యోగ ప్రయత్నం విషయం ఆయనతో చెప్పాలనుకుంది. కాని ఆమెకి ధైర్యం చాలలేదు.

సగం తాగిన టీ కప్పును బల్లపై పెడుతూ "విమానం ఎన్ని గంటలకి?" అని అడిగారాయన.

"రాత్రి ఏడు గంటలకి" చెప్పింది నీతూ. అప్పటిదాకా కాలమెలా గడుస్తుందో?

"విమానాశ్రయానికి నువ్వు కూడా వెడుతున్నావా?" అని అడిగారాయన.

"నువ్వు కూడా కెనడా వెళ్ళిపోతున్నావా?" అని ఆయన అడిగినట్లు అనిపించింది నీతూకి.

"ఇంకా ఏం అనుకోలేదు. అన్నయ్యని అడగాలి" అంది నీతూ. ఆయన చల్లారి పోయిన 'టీ'ని ఒక్క గుక్కలో తాగేశారు.

"ఇంకొంచెం తీసుకురానా?" అడిగింది నీతూ. ఈ ప్రశ్న అడగడం కూడా అనవసరమే. ఎందుకంటే ఆయన రోజుకి రెండు కప్పుల కంటే ఎక్కువ టీ తాగరు.

"వద్దు. తాగాలని లేదు" అన్నారాయన.

"ఎందుకని" అడిగింది నీతూ. బదులుగా ఆయనకి దగ్గు రావడంతో మాట్లాడలేకపోయారు. ఖాళీ కప్పుతో బయటకు వచ్చింది నీతూ.

H H H

'అత్తా, అమ్మ నిన్ను ఈ చొక్కాకి గుండీ కుట్టివ్వమంది" అంటూ మేనల్లుడు ఓ చొక్కా పట్టుకుని వచ్చాడు. దాన్నందుకుని గుండీ కుట్టసాగింది నీతూ. కుడుతున్నంతసేపు అత్తకేసే చూస్తూండిపోయాడా బాబు. వాడిని చూస్తే ముద్దేసి, ప్రేమగా దగ్గరికి తీసుకుంది నీతూ.

"బాబూ, నువ్వు తిరిగి ఎప్పుడొస్తావు?" అని అడిగింది.

"నాలుగు సంవత్సరాల తర్వాత" అంటూ అయిదు వేళ్ళు చూపించాడా బాబు. ఇంతలో నిన్న రాత్రి అన్నయ్య అన్న మాటలు గుర్తొచ్చాయి నీతూకి.

"పిల్లాడు పెరుగుతున్నాడు. ఇక నుంచి వాడి అవసరాలు కూడా పెరుగుతున్నాయి. అందువల్ల నేను మీకు డబ్బులు పంపే విషయం ఏమీ చెప్పలేను..." అన్నాడు అన్నయ్య.

"కాని..." ఏదో అనబోయి నాన్న మౌనంగా ఉండిపోయారు.

వర్తమానంలోకి వచ్చి నీతూ మేనల్లుడి కేసి చూసింది. ఈ గొడవంతటికీ కారణం ఈ పిల్లాడే అనిపించింది నీతూకి. కాని ఇందులో వాడి దోషం ఏముంది? చొక్కా తీసుకుని అక్కణ్నించి జారుకున్నాడా కుర్రాడు.

నీతూ పెరడులోకి చూసింది. అక్కడి మనీప్లాంట్ తీగ పైభాగంలో ఎండపడుతోంది.

"సమయం అప్పుడే పదైందా?" అని అనుకుంది నీతూ. ఆ మనీప్లాంట్ వీళ్ళకి గడియారంలా కూడా పనిచేస్తుంది. పెరడులో కూర్చుని గమనిస్తే కాలం సుమారుగా తెలుస్తుంది. పైభాగంలో ఎండపడితే పదిగంటలు, మధ్యభాగంలో ఎండపడితే ఒంటిగంట. కిందభాగంలో పడితే ఏ మూడో నాలుగో ఐనట్లు. ఎండ కొద్దికొద్దిగా తగ్గుతున్నట్లుగా ఆమెకి అనిపించింది. 'నాకే కనుక శక్తి ఉంటే, సూర్యగోళాన్ని పశ్చిమానికే తిప్పేసే దానిని' అనుకుంది నీతూ. సమయం అస్సలు గడవడంలేదు.

'అమ్మ మామూలుగా అయిపోతే బాగుంటుంది' అనుకుంది నీతూ. తను కూడా మామూలుగా ఉండడానికి ప్రయత్నిస్తోంది. 'అన్నయ్య వెళ్ళిపోయాక ఏమవుతుంది' అనే ఈ దిగులు నుంచి

వీలైనంత త్వరగా బయటపడాలి. కనీసం ఈ అనిశ్చిత పరిస్థితి నుంచైనా విముక్తి కలగాలి.

నీతూ పెరట్లోకి వచ్చి కూర్చుంది. ఆమె దృష్టి మనీప్లాంట్ ఆకులపై పడింది. వాటిమీద బాగా దుమ్ము పేరుకుపోయింది. దగ్గరకు వెళ్ళి ఓ ఆకు మీద చేత్తో ఓ గీత గీసింది. వేళ్ళకి దుమ్మంటుకుంది. 'ఛీ, ఎంత దుమ్ముగా ఉందో' అనుకుంది. వాటిని కడగాలని నిర్ణయించుకుని, లోపలికి వెళ్ళి బాల్చీతో నీళ్ళు తెచ్చింది. చెంబులో నీళ్ళు తీసుకుని పై ఆకులను శుభ్రం చేయసాగింది. ఆమె వాటిమీద వేగంగా నీళ్ళు పోస్తుంటే, అది వాటిని శుభ్రం చేసే ప్రయత్నంలా కాకుండా, వాటిపై ఉన్న ఎండని కిందికి దింపే ప్రయత్నంలా ఉంది.

"స్నేహ ఉందా?" ఎవరో అడుగుతున్నారు.

నీతూ వెనక్కి తిరిగి చూసింది. వదిన స్నేహితురాలెవరో ఉందక్కడ. నీతూ చేతిలోని చెంబును కింద పెట్టింది. నీళ్ళు పోస్తుంటే నీతూ సల్వార్-కమీజ్ తడిసింది. ఆమెకి సిగ్గేసింది. "వదిన స్నేహితురాలతో పాటు వచ్చినాయన ఏమనుకుంటాడో" అని అనుకుంది వాళ్ళని చూస్తూ...

"ఉంది. లోపలికి రండి" అంటూ పరదాను ఓ పక్కకి జరిపి వాళ్ళని లోపలికి తీసుకువెళ్ళింది.

"కూర్చోండి" అని చెప్పి ఫాన్ వేసింది.

"ఇప్పుడే పిలుస్తాను" అంటూ లోపలికి వెళ్ళింది నీతూ.

"వదినా, నీకోసం ఎవరో వచ్చారు" అని చెప్పింది నీతూ.

"ఎవరు?" అడిగింది వదిన. ఆమె అప్పుడే స్నానానికి వెళ్ళబోతోంది.

"తెలియదు. బహుశా నీ స్నేహితురాలు కావచ్చు" అంది నీతూ.

"ఇంకా ఎవరైనా ఉన్నారా?" అడిగింది వదిన.

"ఉన్నారు. బహుశా వాళ్ళ ఆయనేమో" అంది నీతూ. "అంత పొడుగ్గా, బలంగా ఉన్న వ్యక్తి ఆమె సోదరుడై ఉండడు. తప్పకుండా భర్తే అయ్యుంటాడు" అనుకుంది నీతూ. వదిన అద్దంలో ముఖం చూసుకుని, జడ సవరించుకుని మధ్యగదిలోకి వెళ్ళింది. ఇంతలో తను బాల్చీ, చెంబు పెరట్లోనే వదిలేశానని గుర్తొచ్చింది నీతూకి.

"ఈ తడిసిన బట్టలతో మధ్య గదిలోకి వెడితే బాగోదు. కాని వాటిని పెరట్లోనే వదిలేస్తే పోతాయేమో..." అనుకుంటూ మధ్య గదిలోంచి బయటకు వచ్చింది నీతూ.

"నిజంగా నువ్వెంతో అదృష్టవంతురాలివి" వదిన స్నేహితురాలు అంటోంది. ఈ మాటలు వాళ్ళాయనకి నచ్చలేదులా ఉంది. భార్య మాటలకి ఔననకుండా, పుస్తకాలకేసి చూస్తూ ఉండి పోయాడు. ఆయన అవస్థ చూసే జాలేసి 'పాపం' అనుకుంది నీతూ. చిన్నగా నవ్వుకుంది కూడా. తీరా తలతిప్పి చూస్తే, అతడు నీతూకేసి చూస్తున్నాడు.

"నేను నవ్వడం గమనించే ఉంటాడు.." అనుకుంటూ నీతూ గబగబా బాల్చీ, చెంబు తీసుకుని లోపలికి వెళ్ళిపోయింది.

వంటింట్లో అమ్మ మళ్లీ టీ పెడుతోంది. ఈ రోజంగా ఇంటికి ఎవరో ఒకరు వచ్చి పోతుంటారని నీతూకి తోచింది. 'నిజంగా నువ్వెంతో అదృష్టవంతురాలివి' ఈ మాటలే నీతూ చెవిలో ప్రతిధ్వనిస్తున్నాయి.

"ఆఁ, అదృష్టవంతురాలే" గొణుక్కుంది నీతూ.

"ఏమిటి అంటున్నావు?" అడిగింది అమ్మ.

"ఏం లేదు" అంది నీతూ. తనని కూడా ఎవరైనా నువ్వెంతో అదృష్టవంతురాలివి అని అంటే బాగుండు.

"మీనూ పరీక్ష ఫీజు ఎప్పుడు కట్టాలి?" అమ్మ అడిగింది. అమ్మ చెవులలో ఇంకా అన్నయ్య మాటలు మోగుతూనే ఉన్నట్లున్నాయి.

"వచ్చే నెల ఆఖరి వారంలో" బదులు చెప్పింది నీతూ. అమ్మ బలంగా నిట్టూర్చింది. అమ్మ ముఖం కాంతివిహీనం అవడం నీతూ గమనించింది.

"అమ్మా, ఎందుకు బాధపడుతున్నావు?" అడిగింది నీతూ.

"నేనేం బాధపడడంలేదు" అంది అమ్మ. కాని ఆమె అబద్ధం చెబుతోందని ఆమె ముఖం చూస్తేనే అర్థమైపోతోంది. వెళ్ళి అన్నయ్యని ఒక్క గుద్దు గుద్దాలనిపించింది నీతూకి.

H H H

బయట టాక్సీ వచ్చి ఆగింది. సామాన్లన్నీ అందులో సర్దారు. ఆందోళన కారణంగా నాన్నకి దగ్గు బాగా ఎక్కువైంది. వదిన, మేనల్లుడు వెళ్ళి టాక్సీలో కూర్చున్నారు. అన్నయ్య చేతిలోని పెట్టెను పక్కనపెట్టి, అమ్మ కాళ్ళకి దండం పెట్టాడు. అన్నయ్య ఇలా చేయడం నీతూకి వింతగాను, కొత్తగాను అనిపించింది. ఎందుకంటే అన్నయ్య ఇంతకు మును పెన్నడూ అమ్మకి దండం పెట్టడం నీతూ చూడలేదు. 'దండం పెట్టే పని వదినది కదా' అనుకుంది నీతూ.

"ఏదైనా అవసరమైతే నాకు రాయండి" అని చెప్పి అన్నయ్య పెట్టె చేతిలోకి తీసుకున్నాడు. 'నీకు రాసేంత అవసరాలు మాకేంఉండవులే' అని అందామనుకుంది నీతూ. ఆ మాటలు ఆమె నోట్లోంచి బయటకు వచ్చేలోపలే అన్నయ్య ఆమె బుగ్గమీద తడుతూ "నీతూ, ఉత్తరాలు రాస్తావు కదూ!" అన్నాడు.

అతడికేసి చూసింది నీతూ. ఆ మాటలు నోట్లోంచి కాక, హృదయంలోంచి వచ్చినట్లుగా ఉన్నాయి. అలాగేనన్నట్లుగా తలూపింది నీతూ. సమయం ఇంత తొందరగా ఎలా గడిచిపోయిందో ఆమెకి అర్థం కాలేదు. సమయం త్వరగా గడిస్తే బాగుండునని పొద్దున అనుకున్నద తనేనని నీతూ మర్చిపోయింది.

అందరికీ వీడ్కోలు చెప్పి, అన్నయ్య టాక్సీలో కూర్చోగానే, డ్రైవరు ముందుకి పోనిచ్చాడు. చూస్తుండగానే టాక్సీ వేగం అందుకుంది. టాక్సీ కనుమరుగు కాగానే నీతూకి హృదయం తేలికపడి

నట్లయింది. పక్కకి తిరిగి చూస్తే అమ్మ కన్నీరు మున్నీరుగా ఏడుస్తోంది. అమ్మని ఓదార్చి లోపలికి తీసుకువెళ్లింది నీతూ. అమ్మ అన్నయ్య వెళ్ళిపోయినందుకా లేక నిన్న రాత్రి అన్నయ్య మాట్లాడిన మాటలకు ఏడుస్తోందా అన్నది నీతూ తేల్చుకోలేకపోయింది.

ఒక్క రాత్రిలో అమ్మ ఎంతగా మారిపోయింది? అన్నం కూడా తినలేదు. నీతూకైతే బాగా ఆకలివేసింది. కాని ఇంట్లో ఎవరూ అన్నం తినలేదు. నీతూ మంచం మీద వాలి, పైన తిరుగుతున్న ఫాన్ కేసి చూస్తోంది. ఫాన్ చప్పుడు చేస్తూ వేగంగా తిరుగుతోంది. అయినా నీతూకి పట్టిన చెమట ఆరడంలేదు. పైన ఏదో విమానం వెళ్ళిన చప్పుడు, బహుశా అది అన్నయ్య ఎక్కిన విమానమేనేమో. ఎప్పటికో నిద్రపట్టింది నీతూకి. తెల్లవారడం తెలుస్తోంది. అమ్మ ఈరోజు పనులు తొందరగానే మొదలుపెట్టినట్టుంది. ఓ యంత్రంలా పనులు చేసుకుపోతోంది. రాత్రి నాన్న చాలాసేపు దగ్గుతూనే ఉన్నాడు. అన్నయ్య వాళ్ళ ఖాళీ గదిలో పడుకోవడం వల్ల ఆయన దగ్గులో 'ఒంటరితనం' వినబడింది.

అన్నయ్య వెళ్ళిపోతే తాము ఒంటరివారైపోతామని, అన్నయ్య లేకపోవడాన్ని తాను భరించలేనేమోనని మొదట అనుకుంది నీతూ. కాని ఇప్పుడామెకి అటువంటి భావనలేమీ లేదు. అన్నయ్య ఉన్నా లేకపోయినా పెద్ద తేడా ఏమీ లేదనుకుంది. చెల్లెలు మామూలుగానే బడికి వెళ్ళిపోయినందుకు నీతూకి సంతోషమేసింది. సమయం గడుస్తున్నా, మంచం దిగబుద్ధికాలేదు నీతూకి.

కాసేపయ్యాక, అమ్మ అలమరాలోంచి ఏవో తీసుకోవడానికి వచ్చింది. ఆమె ముఖంలో నిన్న ఉన్న దిగులు ఈ పూట కనిపించడంలేదు. పైగా ఏదో ఆలంబన దొరికి నట్లు, ధైర్యంగాను, ఉత్సాహంగాను కనబడుతోంది. ఉన్నట్టుండి అమ్మ అంత ధైర్యంగా ఎలా కనపడుతోందో నీతూకి అర్థం కాలేదు. ఫాన్ మధ్యలోని స్టీలు చక్రంపై పడుతున్న తన ప్రతిబింబాన్ని చూసింది నీతూ. అదెంత చిన్నగా ఉందో. నీతూ తన కుడిచేతిని గట్టిగా కదిలించింది. ప్రతిబింబం కూడా అలాగే చేసింది. ఇదంతా అమ్మ చూస్తోంది.

"ఏంటా ఆటలు. ఇంకా బద్దకం వదలలేదా? పదకొండవుతోంది. ఇప్పటిదాకా స్నానం – పానం ఏదీ లేదు.." అంది అమ్మ.

"తొందరేముందమ్మా..." అంది నీతూ.

"తొందరంటే తొందర ఏమీలేదు. బల్జీత్‌కౌర్ దగ్గర ఏదో ఉద్యోగం ఉందన్నావు కదా, ఆమె దగ్గరకి ఎప్పుడు వెడతావు?" అంది అమ్మ.

నీతూ ఓ క్షణం పాటు కొయ్యబారిపోయింది. అమ్మ ఈవిధంగా మాట్లాడుతుందని నీతూ అస్సలు ఊహించలేదు. ఇంత పెద్ద నిర్ణయం అమ్మ ఎప్పుడు, ఎలా తీసుకుంది?

మరేం మాట్లాడకుండా లేచి రెడీ కాసాగింది.

*(ఆదివారం అనుబంధం, ఆంధ్రజ్యోతి 7 మార్చి 2004)*

**'మనీప్లాంట్' కథకి మూలం 'రబ్బర్ బ్యాండ్' అనే హిందీకథ.**

**ఈ కథ** www.abhivyakti-hindi.org **అనే వెబ్‌సైట్‌లో ప్రచురితమైంది.**

# యమరాజు

ఆంగ్లం : డా॥ అజిత్‌హరి సింఘాని

ఇంకా పూర్తిగా సాయంకాలం అవలేదు. కాని అప్పుడే వాటి పార్టీ మొదలై పోయింది. దోమలు గుంపులుగా చేరి ఆబగా నా రక్తం జుర్రుకుంటున్నాయి. కొత్తగా మరికొన్ని దోమలు వచ్చి వాలుతున్నాయి. తామేం తక్కువ తినలేదన్నట్లుగా, రేపన్నదే లేదన్నట్లుగా యధేచ్ఛగా కుట్టేస్తున్నాయి. నాకు చికాకుగా ఉంది. ఏ పనిమీదా దృష్టి పెట్టలేకపోతున్నాను. 'నిజమే, ఇక వీటికి మరో రోజంటూ ఉండదు' అని అనుకుంటూ 'ఫట్, ఫట్' అంటూ చేతులతో నా తలపై ఉన్న దోమలను చరిచాను. మొదటి దెబ్బకి మూడు, రెండో దెబ్బకి రెండు దోమలు చచ్చి ఊరుకున్నాయి. వాటి కళేబరాలతో నా తొడ యుద్ధభూమిని తలపిస్తోంది. కాని పశ్చాత్తాప పడడానికి నేనేం అశోకుడిని కాను.

పైకి చూస్తూ, "ఓ భగవంతుడా, ఇలాంటి జీవులను ఎందుకయ్యా సృష్టించావు?" అని అడిగాను. పదిహేను నిమిషాలు గడిచినా పైనుంచి జవాబేమీ రాలేదు. 'సరే, వీటి సంగతి నేను తేల్చుకోవలసిందే' అనుకున్నాను.

ఇతర ప్రాజెక్టులలానే ఇది కూడా పరిశోధనతోనే మొదలవ్వాలి. వెంటనే నేను మా పూనే నగరంలోని ఫెర్గూసన్ కాలేజి రోడ్‌లో ఉన్న బ్రిటిష్ లైబ్రరీకి వెళ్లాను. అక్కడి లైబ్రేరియన్ని, "దోమలపై ఏదైనా పుస్తకం ఉందా?" అని ఆంగ్లేయుల యాసలో అడిగాను.

"మా దగ్గర ఇంగ్లీషు అంశాలపై బ్రిటిషువారు రాసిన పుస్తకాలు మాత్రమే ఉంటాయి. ఇంగ్లాండ్‌లో దోమలు లేవు కాబట్టి వాటిపై పుస్తకాలేవీ ఇక్కడ లేవు"అని చెప్పిందావిడ. ఆమెలో పూర్తి భారతీయత ఉట్టిపడుతోంది. నేను అదే ప్రశ్నని మళ్లీ అడిగాను. అధమ జీవులపై ఆరాలు తీస్తున్న నా అజ్ఞానానికి ఆవిడ నొచ్చుకుంది. బహుశా నా ప్రశ్నని మొత్తం ఇంగ్లాండ్‌కే అవమానంగా భావించిందేమో.

"ఇంగ్లాండులో దోమలుండవు" అని కటువుగా పలికి సంభాషణని ముగించింది. నాకు కాస్త నిరాశకలిగింది. దోమకాట్లతో నిండిన నా భుజాలని ఎగరేసి అక్కడినుంచి బయటపడ్డాను. నా అమ్ముల పొదిలో ఇంకో బాణంఉంది. పూనే యూనివర్సిటీకి చెందిన జయకర్ లైబ్రరీకి వెళ్లాను. అక్కడ బోలెడన్ని దోమలు. నాకు కావాల్సిన పుస్తకాలిక్కడ కచ్చితంగా దొరుకుతాయని నమ్మకం కలిగింది. 'ఈ అంశంపై ఇక్కడ టన్నులకొద్దీ సమాచారం దొరకవచ్చు' అని అనుకున్నాను. వెళ్లి లైబ్రేరియన్ని కలిశాను.

రిటైర్మెంట్‌కి దగ్గరగా ఉన్న ఆయన ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ... "ఏ జాతి దోమలపై

పుస్తకాలు కావాలి? ఆఫ్రికా జాతి దోమల గురించైతే ఎ3 వరుసలో చూడండి. ఇండోనేషియా – మలేషియా సంతతివైతే ఎస్8 వరుసలో ఉంటాయి. డి2 వరుసలో దక్షిణ అమెరికా జాతి దోమల పుస్తకాలున్నాయి...” చెప్పుకొచ్చాడాయన.

“కాని నాకు భారతీయ దోమలపై పుస్తకాలు కావాలి...” అని గొణుగుతూ, “చూడడానికి ఎంతో శాంతియుతంగా, ఆధ్యాత్మికంగా కనబడుతూ, సూదులతో గుచ్చినట్లుగా కుట్టే మన దోమలపై ఏవైనా పుస్తకాలుంటే ఇవ్వండి” అన్నాను నేను.

నా ప్రశ్నకి జవాబుగా ‘ఫట్, ఫట్’ అనే శబ్దం వినిపించింది. లైబ్రేరియన్ చేతులు అలవాటుగా పైకిలేచి, తలమీద ఎగురుతున్న దోమలపై దాడి చేశాయి. ఓ దోమ చచ్చిపడింది. ఆ దోమని చూడగానే నాకు ప్రాణం లేచొచ్చింది.

“ఇలాంటి దోమలపైనే నాకు పుస్తకం కావాలి..” అని చెప్పాను ఆయనతో.

ఆయన తల అడ్డంగా ఊపారు. “ఇండియన్ అనోఫిలిస్’పై రీసెర్చి జరుపుతున్న ఏకైక స్కాలర్, పరిశోధనల కోసం అస్సాం వెళ్ళి అక్కడ మలేరియా బారిన పడి ఇటీవలే మరణించాడు” అని ఆయన చెప్పుకొచ్చారు.

నాకు ఆశ్చర్యంకలిగింది. ‘దోమలను పరిశోధించడానికి అస్సాం దాకా వెళ్ళాలా? మా ఇంటికొస్తే సరిపోయేది కదా! బోలెడన్ని దోమలను ఉచితంగా సేకరించుకుని ఉండేవాడు కదా’ అనుకున్నాను. తలపై ముసురుతున్న దోమలను అదిలిస్తూ, అక్కణ్ణించి బయటపడ్డాను. ఆలోచనలో నిమగ్నమై నడుస్తున్న నేను చూసుకోకుండా ఓ సన్యాసిని ఢీకొట్టాను. నల్లటి దుస్తులలోఉన్న ఆ సన్యాసి చేతిలో చిలుంఉంది. భుజానికి ఓ తాడు కట్టిన మట్టి పాత్ర వేలాడుతోంది. సన్యాసి నాకేసి పరీక్షగాచూసి, ‘ఏదో సమస్యతో బాధపడుతున్నట్లున్నావు నాయనా?’ అన్నాడు. నా సమస్యని ఆయనకి విన్నవించుకున్నాను. అతడి ముఖంపై ఓ చిరునవ్వు వెలిసింది. నా సమస్య అర్థమైనట్లుగా, తలూపుతూ, ‘ఏం కంగారుపడొద్దంటూ’ నాకు భరోసాఇచ్చాడు. తన దుస్తులలోంచి ఓ వింతపదార్థమేదో బయటికి తీశాడు.

“గురుదేవులు ‘హాజీ మలాంగ్’ అన్ని సమస్యలను పరిష్కరిస్తారు” అన్నాడు.

అతడేమంటున్నారో నాకర్థం కాలేదు. ఆ వింతపదార్థానికి నిప్పంటించాడు ఆ సన్యాసి. ఏదో వింత పరిమళం చుట్టూ వ్యాపించింది. అంతే. అక్కడ ఎగురుతున్న చిన్నా పెద్దా దోమలు కిందికి రాలిపోసాగాయి. నాలో ఉత్సుకత పెరిగిపోయింది. “ఇదేం ధూపం స్వామి?” అని అడిగాను.

“ధూపం కాదు, నైవేద్యం కాదు. ఇది శ్రేష్టమైన గంజాయి. మనాలీలోని పొలాల్లో పండినది...” చెప్పాడా సన్యాసి.

“ఇది దోమలను చంపుతుందా?” అపనమ్మకంగా అడిగాను.

సన్యాసి బదలికగా నవ్వాడు. “ఇప్పుడు చూడు. దోమల సంగీతం లేదు. కాట్లు లేవు” అంటూ ఓ క్షణం ఆపాడు సన్యాసి. మళ్ళీ తనే మాట్లాడుతూ, “ఈ దోమలని చూడు. ఎంత ప్రశాంతంగా నిద్రపోతున్నాయో గుర్తుంచుకో. అవి చావలేదు. కేవలం నిద్రపోతున్నాయంతే. నీకేం ఇబ్బంది లేదు

కదా?" అని అడిగాడు. మౌనమే నా జవాబయ్యింది. ఆ సన్యాసి సాంగత్యం వల్లనేమో, గత పది నిమిషాలుగా నా కళ్లు అపారమైన దయని కురిపిస్తున్నాయి.

ఇంతలో మోటార్ సైకిల్‌పై వస్తున్న ఓ పోలీస్ అధికారి కనపడ్డాడు. అతడిని చూస్తూనే సన్యాసి ముఖం మాడిపోయింది. అక్కడినుండి వెళ్లిపోడానికి సిద్ధపడ్డాడు.

"పైగా ఇది పూర్తిగా అహింసాత్మకమైనది. దోమలతో సహా అందరూ సంతోషంగా ఉంటారు. ఎవరూ చావరు... జై హాజీ మలాంగ్" అంటూ అక్కడినుంచి వెళ్లిపోయాడా సన్యాసి. నేను కూడా అక్కడినుంచి హడావుడిగా బయల్దేరాను. నాకు ఓ పక్క నిరాశగాను, మరోపక్క ఉల్లాసంగాను ఉంది. ఇదంతా ఆ ధూపం మహత్యమే కాబోలు.

మర్నాడు సోమవారం. 'ఈ దోమల సంగతి అటో ఇటో తేల్చేయాలి' అని అనుకున్నాను. ఆఫీసుకి సెలవు పెట్టేశాను. ఈసారి చట్టబద్ధంగా దోమల్ని చంపాలను కున్నాను. సూపర్ మార్కెట్‌లో దొరికిన అన్నిరకాల దోమల మందులని కొని వాడాను. ఇవేవీ నాకు ఉపశమనం కలిగించలేకపోయాయి. 'ఛోడో మాస్' అయింట్‌మెంట్ నా వంటికి బంకలా అతుక్కుపోయి, అదో రకమైన వాసన వేసింది. 'హిట్ అండ్ మిస్' స్ప్రే నాకు తలనొప్పి కలిగించింది. కాయిల్స్ వెదజల్లే పొగకి ఉక్కిరిబిక్కిరి అయ్యాను.

ఇంక లాభంలేదనుకుని దోమల పీచమణచడానికి మరిన్ని కఠిన చర్యలు చేపట్టాలని నిర్ణయించుకున్నాను. ఈ అంతర్గత శత్రువుని నాశనం చేయడానికి సైన్యం తప్పకుండా ఏదో ఒక వ్యూహం పన్నే ఉంటుందని అనుకున్నాను. 'ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మస్కిటో కాలేజి'లోని మస్కిటాలజీ విభాగం అధిపతిని కలుసుకున్నాను. ఆయన గదిలోని అన్ని కిటికీలకి జాలీలు అమర్చి ఉన్నాయి. అయినప్పటికీ కొన్ని సాహసవంతమైన దోమలు ఎంతో తెగువతో గదిలోకి చొరబడి, ఆయన చెవుల వెనుక ఎగురుతున్నాయి. అప్పటికే ఆయన చెవులు దోమకాట్లతో ఎర్రబడి ఉన్నాయి.

ఎటువంటి ఉపోద్ఘాతం లేకుండా నేను నేరుగా విషయంలోకి వచ్చేశాను.

"సార్! ఈ దోమలను ఎలా ఎదుర్కోవడం?" అని ప్రశ్నించాను. ఆయన కిళ్ళీ నములుతుండడంతో నా ప్రశ్నకి జవాబివ్వలేకపోయారు.

ఇంతలో 'ఫట్, ఫట్' అనే శబ్దం వినబడింది. ఆయన తన చేత్తో తన ముఖంపై చరుచుకున్నారు. ఓ శత్రువు రాలిపోయింది. నా ప్రశ్నకి జవాబు దొరికింది. నాకు నా కర్తవ్యం బోధపడింది. స్వశక్తిని నమ్ముకోడమే మేలని గ్రహించాను. ఆయన నోరు తెరచి జవాబు చెప్పేసరికి, నేను ఆ గదిలోంచి బయటకు వచ్చేశాను. ఇంటికి చేరాక అన్ని క్రిములు, కాయిల్స్, స్ప్రేలను బయటపడేశాను. నా అరచేతులకు కొబ్బరినూనె రాసుకుని, సాయంత్రం కోసం ఎదురుచూడసాగాను.

*(విపుల, ఫిబ్రవరి 2006)*

**'యమరాజు' కథకి మూలం** 'A Reason to Kill' **అనే ఆంగ్ల కథ. మూలకథ** www.ndtv.com/ent/foodfictionstory.asp **అనే వెబ్‌సైట్‌లో ప్రచురితమైంది.**

# ఆశా నిరాశేనా?

**హిందీమూలం : ఆస్థా**

పొద్దున్నుంచి సుమిత్రగారింట్లో సందడిగా ఉంది. అందుకు కారణం లేకపో లేదు. ఆవిడ పెద్ద కొడుకు అక్షయ్, కోడలు ఆరతి, మనవడు అక్షిత్ అమెరికా నుంచి వస్తున్నారు. ప్రతి సంవత్సరంలానే, ఈసారి కూడా తమ సెలవులను స్వదేశంలో కుటుంబ సభ్యులమధ్య గడపడానికి వస్తున్నారు.

చిన్న కొడుకు అర్జున్, చిన్న కోడలు మాధవి, మనవరాలు సాక్షి ఇక్కడే సుమిత్ర గారితో ఉంటారు. అందరికీ సంతోషంగా ఉంది. కొద్దిరోజుల కోసం అందరూ కలుస్తారు. సుమిత్రగారి కాళ్ళకు చక్రాలు తగిలించినట్లుగా ఉంది. వయసు కూడా ఓ పదేళ్ళు తగ్గినట్లుగా అనిపిస్తోంది. తొందరతొందరగా పరుగులు తీస్తున్నారావిడ. కాళ్ళనొప్పులు, తలనొప్పి, బి.పి., షుగర్ మొదలైనవన్నీ ఒక్కసారిగా మటుమాయమైపోయాయి. పొద్దు న్నుంచి మందులు వేసుకోవాలన్న ధ్యాసే లేదావిడకి.

నిజమే. సంతోషం ప్రవేశించిన చోట దుఃఖము, బాధలు తమంతట తాముగా అదృశ్యమవుతాయి. లేకపోతే, తెల్లారగానే సుమిత్రగారు కనీసం ఏడెనమిది మాత్రలు వేసుకుంటేగాని, పక్కమీది నుంచి లేవలేరు. మరి ఈరోజు... ఆవిడకి ఏ మందులు అవసరం లేవులా ఉంది. మనుషులు మానసికంగా సుఖశాంతులు అనుభవిస్తే, సంతోషమే సంతోషం. అప్పుడు అన్ని జబ్బుల నుంచి, రకరకాల మందుల నుంచి విముక్తి లభిస్తుంది.

సుమిత్రగారింట్లో ఈ హడావుడంతా కనీసం రెండువారాల క్రితమే మొదలైంది. అక్షయ్ వాళ్ళు వస్తున్నారనే కబురందగానే, ఇల్లు శుభ్రం చేయడం ప్రారంభమవుతుంది. మరో ఇద్దరు పనివాళ్ళు అదనంగా చేరుతారు. ఏరోజు ఏ వంట వండాలనేది కూడా నిర్ణయమైపోతుంది. అక్షయ్, ఆరతిలకి ఇష్టమైనవే కాదు, మనవడు అక్షిత్‌కి ఇష్టమైనవీ కూడా తయారుచేయబడతాయి. ఎందుకంటే కొన్ని ప్రత్యేకమైన భారతీయ వంటకాలు వాళ్ళకు ఇక్కడ మాత్రమే లభిస్తాయి. ఇంక వంటావిడ కోసం వెదుకులాట ఆరంభమవు తుంది. వంట వండేంత సమయం ఆరతికి ఎక్కడ ఉంటుంది? సంవత్సరంపాటు వాడాల్సిన సరుకులు కొనడానికి బజార్లలో తిరగడానికే ఆమె సమయమంతా గడిచిపోతుంది. దర్జీ దగ్గరికి, కంసాలి దగ్గరికీ వెళ్లడంతోను, అమెరికాలోని మిత్రులకు ఏవైనా చిన్నచిన్న కానుకలు కొనడంతోను, మధ్యమధ్య బంధువులవు, ఇరుగుపొరుగువాళ్లను కలవడం కోసం ఆమె సమయమంతా గడిచిపోతుంది. పైగా సంవత్సరానికి ఒకేసారే కదా వచ్చేది. అందుకే ఎంత

ఎక్కువసేపు వీలైతే అంతసేపు కుటుంబ సభ్యులతో కలిసి గడపడానికి ఇష్టపడతారు. బయటపనులన్నీ ఆరతి ఒక్కర్తే చూసుకోవాలి కాబట్టి ఆమె అత్తగారో, తోటికోడలో వంట చేయాల్సి వస్తుంది. ఇది వాళ్ళకి కూడా ఇబ్బందే. ఐనా మాధవికి మాత్రం తీరిక ఎక్కడిది? ఆమె ఆరతితోపాటు తిరుగుతుంది. ఆరతికి కారు నడిపే అలవాటు తక్కువ. పైగా ఈ అహ్మదాబాద్ నగరంలోని రద్దీలో తను కారు నడపడం మరీ కష్టం. దాంతో మాధవికి డ్రైవర్ అవతారం ఎత్తక తప్పదు. సుమిత్రగారు ఒక్కరూ ఏం చేయగలరు? అందుకే మధ్యేమార్గంగా ఒక నెలరోజుల కోసం వంటమనిషిని పెట్టుకుంటారు.

H H H

అన్ని ఏర్పాట్లూ సక్రమంగా జరిగిపోయాయి. పాపం సుమిత్రగారికి సమయం గడవడం లేదు. ఈ పూట ఆవిడ కాస్త పరధ్యానంగా ఉన్నారు. “ఈ గడియారం ఏమిటో ఇంత మెల్లిగా తిరుగుతోంది?” అని అనుకుంటూ, రెండుమూడుసార్లు గోడ దగ్గరగా వెళ్ళి గడియారం ఆగిపోయిందేమోనని చూశారు. కాని అది సరిగానే పనిచేస్తోంది. సెకన్ల ముల్లు కదలడం తెలుస్తోంది. కాని ఆవిడ తృప్తి చెందలేదు. తన చేతి గడియారాన్ని చెవి దగ్గర పెట్టుకుని శబ్దాన్ని విన్నారు. అది కూడా బాగానే పనిచేస్తోంది. కాని ఆవిడ కాలం స్తంభించినట్లుగా భావించసాగారు. బహుశా భగవంతుడు ఆవిడ ఓపికని పరీక్షిస్తున్నాడేమో.

కాలం ఎవరికోసం ఆగదు. నిరంతరాయంగా తన ప్రయాణాన్ని కొనసాగిస్తూనే ఉంటుంది. కాలం త్వరగా గడవడం, లేదా సమయం అస్సలు గడవకపోవడం అనేవి పూర్తిగా మనోకల్పితాలు. ఎదురుచూస్తున్నప్పుడు కాలం అనంతంగాను, ఆనందంతో ఉన్నప్పుడు కాలం త్వరగా గడిచిపోయినట్లు మనుషులు భావిస్తారు. ఆనందపు క్షణాలని శాశ్వతం చేసుకోవాలనుకుంటారు. కాని కాలం ఒకరికోసం ఆగేది కాదు.

H H H

అక్షయ్ అమెరికా వెళ్ళి పదేళ్లు గడిచాయి. కాని నిన్న మొన్న వెళ్లినట్లుంది. సుమిత్ర గారి కళ్ళముందు గడిచిన సంవత్సరాలన్ని వరుసగా ప్రత్యక్షమయ్యాయి. పాతజ్ఞాపకాలు తలెత్తాయి. పిల్లలిద్దరూ చిన్నవాళ్లుగా ఉన్నప్పుడు ఆవిడ ఈ ఊరికి వచ్చారు. పిల్లలు చిన్నవయసులోనే తండ్రిని కోల్పోయారు. సుమిత్రగారు తనకు ఉన్నంతలో, పిల్లల్ని బాగా చదివించి, చక్కటి సంస్కారాలను నేర్పారు. వాళ్లకు పెళ్ళిళ్ళు చేసి కూతుర్ల వంటి కోడళ్ళను తెచ్చుకున్నారు. ఈవిధంగా అన్ని బాధ్యతలను ఒంటరిగానే నెరవేర్చారావిడ. అందుకే తల్లిని చూసి ఆ కొడుకులు గర్వపడతారు. అక్షయ్‌కి అమెరికాలో ఉద్యోగం వచ్చినప్పుడు, కొడుకు దూరంగా వెళ్ళిపోతున్నందుకు బాధకల్గినా, అతడి భవిష్యత్తుదృష్ట్యా దాన్ని సహించారు. అక్షయ్ ఆరతి అమెరికా వెళ్లిపోయారు. అర్జున్, మాధవి మాత్రం ఇక్కడే ఉండిపోయారు. ఒకేచోట లేరన్న బాధేగాని, రెండు కుటుంబాలు సుఖంగా ఉన్నాయి. ఇలా కొన్నేళ్ళు గడిచాయి. అక్షయ్, ఆరతి సెలవులతో మనదేశానికి వచ్చేవారు. సుమిత్రగారికి ఎంతో సంతోషం

వేసేది. ప్రతి ఏడాది సెలవుల కోసం ఆవిడ ఆత్రుతగా వేచిచూసేవారు. ఒకనెల కలిసి ఉంటే, మిగతా పదకొండు నెలలపాటు ఆ జ్ఞాపకాలతో మనసు నింపుకునేవారు. ఈవిధంగా సెలవులు, జ్ఞాపకాల ఆసరాతో ఆడవి జీవితాన్ని వెళ్ళదీస్తున్నారు.

మొదటి సంవత్సరం అక్షయ్ అమెరికా నుంచి వచ్చినప్పుడు అతడిలోను, ఆరతి లోను ఏ మాత్రం మార్పు రాలేదు. వాళ్ళలో తను నేర్పిన సంస్కారాలు ఇంకా మిగిలి ఉన్నందుకు సుమిత్రగారు ఆనందించారు. సుమిత్రగారిని, అర్జున్‌ని, మాధవిని కొన్నాళ్ళు ఉండేలా అమెరికాకు రమ్మని అక్షయ్, ఆరతి ఇద్దరూ బ్రతిమిలాడారు.

రెండో ఏడు వచ్చినప్పుడు వీరి ముగ్గురిని అమెరికా రమ్మని పట్టుపట్టారు. అర్జున్ కంటే మాధవికి అమెరికా వెళ్లాలనే కోరిక ఎక్కువగా ఉంది. ఆరతితో పోల్చుకున్నప్పుడల్లా, ఆమెకు తన జీవితం వెలితిగా అనిపిస్తుంది. ఆరతిలా తన కోరికలను తీర్చుకోలేకపోతున్నాననే బాధ మాధవిలో ఉంది. ఆరతిలా హాయిగా విశ్రాంతిగా కూర్చోవాలని, ఆమెలా డబ్బు ఖర్చుచేయాలని, భవిష్యత్తుపై ఏమాత్రం బెంగ లేకుండా వుండాలనేది మాధవి కోరిక.

“అక్క జీవితం వడ్డించిన విస్తరి కదా” అని అనుకునేది మాధవి. “మేము కూడా అమెరికాకు వెడితే బాగుంటుంది. జీవితాన్ని హాయిగా గడపొచ్చు. మాదీ ఓ జీవితమైనా? ఎక్కడ వేసిన గొంగళి అక్కడే. ఏవో ఇబ్బందులు, ఎన్నెన్నో చిక్కులు... వీటన్నింటికీ తగిన పరిష్కారం అమెరికాకు వెళ్లిపోవడమే...” అని అనుకునేది మాధవి.

మూడో ఏడు అక్షయ్‌వాళ్ళు ముగ్గురయ్యారు. మనవడు అక్షిత్‌ను చూసి సుమిత్రగారు పొంగిపోయారు. సమయమంతా వాడితోనే గడిపేవారు. పొద్దున్న స్నానం చేయించడం, తర్వాత అన్నం తినిపించడం, రాత్రి జోలపాటలు పాడి నిద్రబుచ్చడం... ఇవన్నీ ఆవిడ నిత్యకృత్యాలలో భాగమైపోయాయి. కొడుకులిద్దరూ పెద్దవాళ్ళైపోయిన తర్వాత... చాలా కాలానికీ తిరిగి ఇంట్లో పసివాడి కేరింతలు వినిపిస్తున్నాయి. అక్షిత్ బాల్యంతో తన కొడుకుల చిన్ననాటి రోజులను పోల్చుకునేవారు సుమిత్ర. నెలరోజులు ఇట్టే గడిచిపోయాయి. అక్షయ్‌వాళ్ళు తిరిగి అమెరికా వెళ్లిపోయారు. మనవడి జ్ఞాపకాలు సుమిత్రగారిని అలరించేవి. అర్జున్‌కి మాధవికి సాక్షి పుట్టేవరకు సుమిత్రగారు మనవడి స్మృతులలోనే మునిగి ఉండేవారు. పాపాయి పుట్టాక, సుమిత్రగారి ఆనందానికి అంతేలేదు. మనవడు మనవరాళ్లే ఆమె లోకం. వాళ్ళిద్దరూ నానమ్మ నాదంటే నాది అని పోట్లాడుకునే వారు. ‘మీ ఇద్దరూ నావాళ్ళు’ అని అనేవారు సుమిత్ర.

ఈవిధంగా నాలుగేళ్ళు గడిచాయి. మొదట్లో ఆరతి, మాధవి కలిసి కొత్తకొత్త వంటకాలు చేసేవారు. అందరూ కలిసి ఒకేసారి తినేవారు. అవెంతో ఆనందకరమైన రోజులు. ప్రతి ఒక్కరు ప్రతిక్షణం ఆనందం పంచడానికి ప్రయత్నించేవారు. ఏ మాత్రం వీలు కుదిరినా, అందరు కలిసి సంతోషంగా కాలం గడిపేవారు. అక్షిత్‌కైతే ప్రతిరాత్రి నిద్రపోయే ముందు నానమ్మ కొత్త కథ

చెప్పాల్సిందే. పగలంతా ఆటపాటలలో మునిగి, రాత్రి ఎప్పుడవుతుందా, ఎప్పుడు నానమ్మ చేత కథ చెప్పించుకుందామా అని చూస్తాడు అక్షిత్. కాని వీళ్ళ సంతోషాలకి ఎవరిదో దృష్టిదోషం తగిలింది. మెల్లిమెల్లిగా ఆనందం అడుగంటిపోసాగింది. ఇప్పుడు వాళ్ళు అమెరికానుంచి వచ్చినా, ఉండేసమయం తక్కువ, పనులు బోలెడు. కుటుంబసభ్యులందరు కనీసం కలిసి కూర్చుని కబుర్లు చెప్పుకునే అవకాశం కూడా లేకుండాపోయింది.

H H H

కొంత కాలానికి అర్జున్ కూడా అమెరికా వెళ్లాలని నిశ్చయించుకున్నాడు. "అసలంటూ వెళ్లిచూద్దాం. మొదట సరదాగా అన్ని స్థలాలు చూస్తాను. తర్వాత ఏదైనా ఉద్యోగం దొరికితే, తిరిగివచ్చి అందరిని తీసుకువెళ్ళవచ్చు. అందరం కలిసి ఉండవచ్చు. విడిగా ఉండడంవల్ల మా మధ్య ఏర్పడిన వియోగంతొలగిపోతుంది. పిల్లలలో కూడా ఎటువంటి తేడాలు లేకుండా ఉంటాయి. అన్నిటికంటే ముఖ్యంగా 'అందరం కలిసి ఉండాలనే' అమ్మ కోరిక తీరుతుంది" అని అనుకున్నాడు అర్జున్.

అంతదూరం ప్రయాణించి, చికాగో నగరం చేరాడు అర్జున్. అన్నగారి అందమైన అపార్ట్‌మెంట్‌లో దిగాడు. ఆరోజు శనివారం. వారాంతం కావడంతో అందరూ కులాసాగా కాలం గడిపారు. సోమవారం ఉదయం అక్షయ్ ఆరతి ఇద్దరూ ఆఫీసులకి వెళ్లిపోయారు. అక్షిత్ బడికి వెళ్లిపోయాడు. వీరంతా సాయంత్రం నాలుగు, ఐదు గంటల మధ్య తిరిగి ఇల్లు చేరుతారు.

ఆరతి వెడుతూ వెడుతూ... "అర్జున్, ఫ్రిజ్‌లో అన్నం ఉంది. మధ్యాహ్నం వెచ్చబెట్టు కుని తినేయ్" అని అంది. అన్నా వదినల కోసం తాము స్వదేశంలో చేసే ఏర్పాట్లేవీ ఇక్కడి అర్జున్‌కి అనుభవం కాలేదు. నిజమే. ఎక్కడి పద్ధతులు అక్కడ ఉంటాయి. కాని మనుషులు ఇక్కడివాళ్ళేగా? అక్కడి ఆచార వ్యవహారాలు అర్జున్‌కి నచ్చలేదు.

మర్నాడు మాటల సందర్భంలో "అర్జున్, నువ్విక్కడికి విహారయాత్రగా వస్తే సరే. లేదంటే ఏదైనా పని వెతుక్కో. నీ వంట నువ్వే వండుకో. నేను ఆఫీసుకు వెళ్ళాలి. వచ్చేసరికి సాయంత్రమై పోతుంది. అలసిపోతాను. ఇంక నీకోసం కూడా వంట చేయాలంటే నావల్ల కాదు. మాకోసం వండుకునే వంటే అతికష్టంమీద వండుతాను. నాకిక్కడ పని మనుషులు లేరు. ఐనా పనివాళ్ళను పెట్టుకోవాలంటే బోలెడు ఖర్చవుతుంది. అందుకని మా పన్లని మేమే చేసుకుంటాం..." అంది ఆరతి.

'మాకోసం వండుకునే వంటే అతికష్టంమీద వండుతాను' అని వదిన అన్న మాటలతో, తాను అక్కడ పరాయివాడినని అర్జున్ గ్రహించాడు.

'అహ్మదాబాద్‌లో వీళ్ళకోసం నేను, అమ్మ, మాధవి పనులన్నీ మానుకుని వీళ్ళకు అందుబాటులో ఉన్నామే, మరిప్పుడు నేను వీళ్ళకీ భారమైపోయాను. వీళ్ళు అక్కడికి వచ్చి నప్పుడు

మేము ఎందుకంత ప్రేమగా చూసుకున్నాం? కొద్దిరోజుల కోసమే వచ్చారనా? వీళ్ళకు సమయం తక్కువనా? ఇవేవి కావు. వారిపట్ల మాకున్న ఆపేక్ష, అభిమానం వల్ల. ఇప్పటికీ వీళ్ళంటే మా అందరికీ ఎంతో అభిమానం ఉంది...” అని అనుకున్నాడు అర్జున్.

సాయంత్రంపూట ఆరతేకాదు, అక్షయ్ కూడా అలసిపోయి వస్తాడు. అక్షిత్ తన లోకంలో తానుంటాడు. ఒక్కోసారి అన్నావదినలు అక్షిత్‌తో సమయం గడుపుతారు. ఒక్కోసారి టి.వి.చూస్తూ కూర్చున్నప్పుడు అర్జున్‌ని ఒంటరితనం ఆవహిస్తుంది. అమెరికాలో పదిహేనురోజులు గడపడం కూడా అతనికి కష్టమైపోయింది. ‘మనవాళ్ళు, మనవాళ్ళంటూ ఇంతదూరం రావడం ఎంత వ్యర్థమో’ అని అనిపించింది అతడికి.

అన్నావదినలు ఇంతగా మారిపోతారనిగాని, వాళ్ళ ఆలోచనలు కూడా మారిపోతాయనిగాని అర్జున్ ఊహించలేదు. ఎక్కడ తప్పు జరిగింది? ఏమైపోయాయి ఆ అభిమానాలు, ఆప్యాయతలు? అమెరికా జీవితంపై అర్జున్ కన్న కలలన్నీ చెదిరి పోయాయి. అక్కడి జీవితపు మరో పార్శ్వం కనిపించింది అర్జున్‌కి. ఎలాగోలా కాలం గడిపి, కొత్త అనుభవాలతో స్వదేశం చేరాడు.

H H H

అక్షయ్, ఆరతి ప్రతి ఏడాది ఇండియాకి వస్తున్నారు. ప్రతీ ఏడు ఇక్కడ సుమిత్ర, అర్జున్, మాధవి మనసుని అదుపులో పెట్టుకుంటూ, సాదరంగా ఆహ్వానిస్తున్నారు. తగిన ఏర్పాట్లు చేస్తునే ఉన్నారు. అంతా మామూలుగానే ఉంటోంది. కాని అక్షిత్‌కే ఇక్కడ ఉండబుద్ధి కావడంలేదు. వాడు వేరేదేశంలో పుట్టాడు. కాబట్టి ఇక్కడి పద్ధతులన్నీ వింతగాను, కొత్తగాను ఉంటాయి. సొంత కొడుకే మారిపోయాడు. ఇక మనవడు ఇలా ప్రవర్తించడంలో దోషమేముంది?” అని సుమిత్ర అనుకున్నారు. “పైగా వాళ్లుండేది ఒక నెలరోజులేగా. సర్దుకుపోదాం” అని అనుకున్నారు సుమిత్ర. మునుపు కేవలం మాటలలోనే భేదాలుండేవి. ఇప్పుడైతే రోజూవారీ వ్యవహారాలలోను తేడాలు కనబడుతున్నాయి. అక్షయ్ “మా ఇంట్లో ఇలా చెయ్యం. నేను ఇలాంటి భోజనం తినను టీ ఎందుకు ఇంత ఘాటుగా ఉంది” అంటున్నాడు.

“సరైన వంటావిడ దొరక్కపోతే, నువ్వే వంట చేయాల్సింది మాధవీ. ఇందులో తప్పేముంది? ఇలాంటివి తిని అక్షిత్ ఆరోగ్యం పాడైతే ఏం చేయాలి? అదే జరిగితే తట్టుకోవడం నా వల్ల కాదు. మా అమెరికాలో అయితే ఇంత చెత్త చెదారం ఉండవు” అంది ఆరతి.

సుమిత్రగారు, అర్జున్, మాధవి మౌనంగా విని ఊరుకున్నారు. ప్రస్తుతం బాంధవ్యాలు కేవలం పనులు జరిపించుకునే స్థాయికి దిగజారిపోయాయి. కలిసి భోజనం చేయడం, సంతోషాలు పంచుకోవడం, కలిసి సమయాన్ని గడపడం.. లాంటివి కలలాగా మిగిలి పోయాయి. ఆపేక్షలు, ప్రేమాభిమానాలు మరిచిపోయేంతగా మనుషులు మారిపోతారా?

కొన్నాళ్ళకీ అక్షయ్, ఆరతి దగ్గరనుంచి ఉత్తరాలు రావడం కూడా తగ్గింది. ఒకటి రెండుసార్లు

సుమిత్రగారు ఫిర్యాదుచేస్తే "అమ్మా, మనం తరచూ ఫోన్లో మాట్లాడుకుంటూనే ఉన్నాం కదా" అని అక్షయ్ అన్నాడు.

"ఒరే, ఉత్తరాన్ని ఎప్పుడైనా, ఎన్నిసార్లైనా చదువుకోవచ్చు కదా" అని సుమిత్ర అంటే, అక్షయ్ జవాబివ్వలేదు.

ఓసారి సుమిత్రకి బాగా జబ్బుచేసింది. ఆవిడ ఆరోగ్యం ఎలా ఉందని అడగక, "ఆసుపత్రి ఖర్చులు మొత్తం ఎంతయ్యాయో చెబితే నేను పంపిస్తాను" అని అర్జున్‌తో అన్నాడు అక్షయ్. "వచ్చి కొన్నిరోజులు ఉండచ్చు కదా" అని అర్జున్ అడిగితే, కుదరదన్నాడు అక్షయ్.

ఒకప్పటి ఆప్యాయతలేవి? తమవాళ్ళతో కలిసి కష్టసుఖాలను పంచుకున్న ఆ రోజులేవి? ప్రతి విషయాన్ని డబ్బుతో ముడిపెడతారెందుకు? కాలం గడుస్తోంది. ప్రతి ఏడాది వాళ్లు వస్తారు. అందరూ కలుస్తారు. వాళ్ళేమో తమతమ పనులు చూసుకుంటారు. నెలరోజులు పూర్తవగానే వెళ్లిపోతారు. ఒకప్పుడు వాళ్ళు అమెరికాకు బయల్దేరడానికీ పదిరోజులు ముందు నుంచే అందరి మనసులు భారమైపోయేవి. కాని ఇప్పుడు వాళ్ళమధ్య అంతటి గాఢమైన అనుబంధం లేదు.

H H H

కాని అమ్మ ఎప్పుడూ అమ్మే. అందుకే గతకాలపు బాధలన్నీ మరచిపోయి, మరోసారి కొడుకుని, కోడలిని సాదరంగా ఆహ్వానించడానికీ సిద్ధమవుతున్నారు సుమిత్ర. ఆమె అంతరాలలో... "కనీసం ఇప్పటికైనా అక్షయ్ హృదయంలోని భారతీయ సంస్కారం మేలుకుంటే బావుండు. ఈ ఉదాసీనత దూరమై, అందరం ప్రేమతో ఉండచ్చు. ఇంటి పెద్ద కొడుకుగా వాడి బాధ్యతలను గుర్తించి, కుటుంబం పట్ల తన కర్తవ్యం నిర్వహిస్తే బాగుంటుంది..." అని అనిపించేది.

"మనుషుల మధ్య దూరం పెరగడం వల్ల, మమతలు దూరమవుతాయనుకోవడం భ్రమ. అలవాట్ల ప్రభావం వల్ల అలా అనిపిస్తుందంతే. ఈ అలవాట్లు జన్మతః వచ్చిన సంస్కారాలు నశించవు" అని ఆవిడ నమ్మేవారు. ఈ నమ్మకంతోనే ఆవిడ కొన్నాళ్ళు కాలం గడిపేశారు.

బయట కారు ఆగిన శబ్దం వినబడింది. ఆవిడ హృదయ స్పందన పెరిగింది.

"అర్జున్, మాధవి, బయటకు రండి. వాళ్ళు వచ్చేసారు. పాపా సాక్షీ, చూడు ఎవరొచ్చారో. అక్షిత్ వచ్చాడమ్మా..." అంటూ పిలిచారు. ఆమె కళ్ళనిండా నీళ్ళు. పనివాళ్ళని సామానులు లోపలికి తీసుకు వెళ్ళమని చెప్పారు.

"ఏడాది తర్వాత మళ్ళీ చూస్తున్నాను. అక్షిత్ పెద్దవాడై ఉంటాడు. ఈసారి భారతదేశాన్ని, ఈ నానమ్మని ఇంటిని తప్పకుండా ఇష్టపడుతాడు.." అనుకుంటూ అక్షిత్ కోసం చూసారు సుమిత్ర. కాని వాడెక్కడా కనిపించలేదు. అక్షయ్ ఆరతి మాత్రం లోపలి కొస్తూ కనబడ్డారు. వాళ్ళిద్దరూ ముందుకొచ్చి సుమిత్రగారి పాదాలకు నమస్కరించారు.

"పోనీలే, ఈ మాత్రం సంస్కారమైనా మిగిలింది" అని అనుకున్నారు సుమిత్ర. "అక్షిత్

ఏడి?" అని అడిగారు.

"అమ్మా, ఈసారి వాడు రాలేదు. వాడి స్కూల్లో 'ప్రపంచయాత్ర'కి తీసుకువెడుతు న్నారు. ప్రతీ ఏడాది ఇండియాకి వస్తున్నాం కదా అని ఈసారి ప్రపంచయాత్రకి పంపాం" చెప్పాడు అక్షయ్.

"అత్తయ్యా, మేము ఈసారి వారం రోజులే ఉంటాం. చాలా పన్లని మధ్యలోనే వదిలేసి వచ్చాం. వెళ్లి వాటిని పూర్తి చేయాలి" చెప్పింది ఆరతి.

"అదేంటమ్మా, సంవత్సరానికీ ఒకసారి వస్తారి. కనీసం నెలరోజులైనా సెలవు పెట్టలేరా?" అడిగారు సుమిత్ర.

"కుదరదమ్మా. పైగా ఇక్కడ మేము చేసే పనులేవి లేవు. ఇంతకుముందు సంగతి వేరు. అక్షిత్ పెద్దవాడవుతున్నాడు. వాడి చదువుపై, భవిష్యత్తుపై దృష్టిపెట్టాలి. అందుకని తిరుగుళ్ళు తగ్గిస్తాం. ఇకపై మేము ఇండియాకు రెండు మూడేళ్ళకు ఒకసారే వస్తాం" అన్నాడు అక్షయ్.

"నీ ఇష్టం నాయనా! నీకు ఎలా తోస్తే, అలా చెయ్యి" అన్నారు సుమిత్ర నిర్లిప్తంగా. పెద్దకొడుకు మాటలను ఆవిడ ఇప్పటిదాకా కాదనలేదు. ఎప్పుడూ "నీ ఇష్టం నాయనా" అని అనేవారు.

ఆవిడ బాధని అక్షయ్ ఆరతిలు ఇప్పుడు కాదు, తర్వాత... అక్షిత్ పెరిగి పెద్దవాడైన తర్వాత... అర్థం చేసుకుంటారు.

సుమిత్రగారు అలసిన కాళ్ళతో, మందుల డబ్బాకోసం, అలమారావైపు అడుగులు వేశారు.

*(జాగృతి, 1 డిసెంబరు 2003)*

**'ఆశా నిరాశేనా' కథకి మూలం 'మోహ్‌భంగ్' అనే హిందీ కథ.**
**ఈ కథ** www.abhivyakti-hindi.org **అనే వెబ్‌సైట్‌లో ప్రచురితమైంది.**

# కట్టుకథ

**ఆంగ్లం : సురజిత్‌బసు**

సాయంత్రం పార్టీ నుంచి తిరిగొచ్చాక, సోఫా ముందు నిలబడి ఆలోచనలలో మునిగిపోయిన అతడిని, "రవీ, ఏమిటంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావు?" అని అతడి భార్య అడిగింది.

రవి భుజాలెగరేసి, "ఏం లేదు" అని అన్నాడు.

"ఈ రోజు పార్టీలోను నువ్వు ఏ మాత్రం ఉత్సాహంగాలేవు. ఏంజరిగింది? ఇంతకు ముందెప్పుడు నువ్విలా లేవు. ప్రతి పార్టీలో నువ్వెంతో సందడి చేస్తావు. జోకులు వేస్తావు. తెగ నవ్విస్తావు. నాకేవో కథలు చెప్పి, తమాషాలు చేసేవాడివి. అసలేమయింది నీకు?" అని అడిగింది.

రవి మౌనంగా ఉండిపోయాడు. ఆమె కుతూహలం చల్లారలేదు.

"చక్రవర్తి వాళ్ల కుటుంబం పరిచయమైనప్పటి నుంచి నువ్విలా తయారయ్యావు. వాళ్లని కలిసిన ప్రతిసారీ నువ్విలా మౌనంగా, ఏదో కోల్పోయిన వాడిలా కనిపిస్తు న్నావు. పైగా నువ్వా షర్మిలాను కలిసినప్పుడల్లా, ఇది మరీ ఎక్కువైతోంది. ఏంటి విషయం?" అని అడిగింది కొంచెం అనుమానంగా.

"ఓహ్, అరుణా! నీ దారుణమైన అనుమానాలు మొదలయ్యాయా? నీకు తెలుసు – షర్మిలా, నేను ఒకే కాలేజిలో కలిసి చదివామని. మా ఇద్దరిది ఒకే బ్యాచ్. కాని అది చాలా ఏళ్ళ క్రితం సంగతి. గత ఇరవై ఏళ్ళుగా మేమ సలు కలుసుకోనే లేదు. కనీసం మాట్లాడుకోనైనా లేదు. కొన్ని నెలల క్రితం సూపర్ మార్కెట్‌లో యాధృచ్ఛికంగా కలిసాం. అంతే! నువ్వే కదా, ఆమెని మన మిత్రులందరికి పరిచయం చేశావు. పైగా ప్రతి పార్టీకి ఆహ్వానిస్తున్నావు" అని అన్నాడు రవి చిరాకుగా.

ఇవేవీ విననట్లుగా, తన పొడవాటి జడని దువ్వుకుంటూ.... "ఇరవై ఏళ్ళ క్రితం ఆమె చాలా అందంగా ఉండి ఉంటుంది" అని అంది అరుణ.

"నిజమే. చాలా అందంగా ఉండేది" అన్నాడు రవి నెమ్మదిగా.

అతడి స్వరంలో విచారం ధ్వనించినట్లై, అతడికేసి చూసింది అరుణ. సోఫాలో వెనక్కి జారిపడి, నుదుటిపై అరచేయి పట్టుకుని, గదిలోని టేబుల్ వంక చూడసాగాడు రవి. అతడిలో కాలేజి రోజుల జ్ఞాపకాలు మేలుకోసాగాయి.

"నేనేమో ఆమెని ప్రేమించాను" అని అంది అరుణ, రవి గొంతును అనుకరిస్తూ.

అతడి ఆలోచనలకు భంగం కలిగింది. రవి తల తిప్పి అరుణకేసి చూసాడు. అతడి నుదురు ముడతలు పడింది. గతంలోని మధురస్మృతులకు, వర్తమానంలోని ఎగతాళికి మధ్య చిక్కిన గొంతుతో... "అవును. నేనామెని ప్రేమించాను" అని అన్నాడు రవి.

అరుణ అవాక్కయింది. జడ దువ్వుకోవడం ఆపి, "కాదు. కాదు, నువ్వలా చేసుండవు" అని అంది నమ్మ లేనట్టుగా.

'ఈ మాటలు అని తప్పు చేసానా?' అని రవి ఒక్క క్షణం పాటు అనుకున్నాడు. కాని అప్పటికే ఓ నిర్ణయం తీసేసుకున్నాడు. భుజాలెగరేసి గట్టిగా శ్వాస పీల్చుకున్నాడు.

"అప్పట్లో మేము యవ్వనంలో ఉండేవాళ్ళం. ఆమె అందంగా ఉండేది. మా ఇద్దరి అభిరుచులు కలిసాయి. ఇద్దరికి ఒకే రకమైన సంగీతమన్నా, సాహిత్యమన్నా ఇష్టంగా ఉండేది. స్వర్గంలో నిర్ణయించినట్లుగా, మా జంట చక్కగా కుదిరింది..." ఉత్సాహంగా చెప్పుకొచ్చాడు రవి.

అరుణకి ఇదంతా చికాకు కలిగిస్తోంది. వారిద్దరి వ్యవహారం గురించి ఇంకా తెలుసుకోవాలనుకుంటోంది. "వీళ్ళ సంబంధం ఏ స్థాయి వరకు వచ్చిందో? తరచూ కలుసుకునేవారా? మరి నాకిన్నాళ్ళు చెప్పలేదేం?" ఇలాంటి ప్రశ్నలెన్నో ఆమె మనసులో ఉదయించాయి.

రవి మెల్లగా తన కాలేజి రోజుల గురించి, షర్మిలాతో తన స్నేహం గురించి చెప్పసాగాడు. డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతూండగా, ఎం.ఎస్.సిలో కెమిస్ట్రీ కలసి చదవాలని ఇద్దరు నిశ్చయించుకున్నారు. కాని డిగ్రీ పూర్తవగానే, అమెరికాలో ఉంటున్న ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగితో షర్మిలాకి పెళ్ళయి పోయింది. అతడిప్పుడు ఇండి యాకి వచ్చి, ఇక్కడే సొంతంగా ఓ కంపెనీని ప్రారంభించాడు. షర్మిలా ఎం.బి.ఏ. చేసి భర్తకి ఆఫీసు వ్యవహారాలలో సహాయం చేస్తోంది. రవేమో తను మొదట అనుకున్నట్లుగా కాకుండా బయోకెమిస్ట్రీలో ఎం.ఎస్‌సి చేశాడు. ప్రస్తుతం యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా స్థిరపడ్డాడు. సాయంత్రాలను ఏకాంతంగా, యూనివర్సిటీ లైబ్రరీలో గడుపుతాడు.

"ఇదంతా నాకు తెలుసు" అని అంది అరుణ నిరుత్సాహంగా.

"ఇంట్లో ఉన్న పుస్తకాలు చాలవన్నట్లు, ప్రతి ఆదివారం పబ్లిక్ లైబ్రరీకి వెళ్ళి పుస్తకాలు తెచ్చుకుంటావు" అని అంది అరుణ ఫిర్యాదు చేస్తున్న ధోరణిలో.

తను తెచ్చే పుస్తకాలలో ఎన్నింటిని ఆమె చదువుతుందో రవికి తెలియనిది కాదు. అతడు లైబ్రరీ నుంచి తెచ్చేవి టెక్నికల్ పుస్తకాలేం కావు. మామూలు నవలలు, వారపత్రికలే తెస్తుంటాడు.

"షర్మిలాకి, నాకు సాహిత్యమంటే బాగా ఇష్టం" అన్నాడు రవి అరుణని ఉడికించాలని.

అరుణ పెదవి విరిచి, "ఎప్పుడూ ఆ పెద్ద పెద్ద టెక్నికల్ పుస్తకాలు తేకపోతే, కొన్ని చిన్న పుస్తకాలు - కథ లవి తెస్తే నేను చదువుతాను కదా...." అని అంది అరుణ.

'మొన్న తెచ్చిన పుస్తకం కథల సంకలనమే' అని చెబుదామనుకున్నాడు రవి. కాని అనవసరమనుకుని మౌనంగా ఉండిపోయాడు. ఎందుకంటే ఆ పుస్తకం ప్రస్తుతం అదే గదిలో ఓ బల్లపైన ఉంది. అరుణ అసలు దాన్ని చూసే ఉండదు.

"పుస్తకాల సంగతి సరే, ముందు షర్మిలా విషయం చెప్పు. ఆ తర్వాత ఏమైంది? మీరు ఎందుకు విడి పోయారు?" అని అడిగింది అరుణ. వారిద్దరి వ్యవహారం ఎంత దూరం వచ్చిందో అని తెలుసుకోవాలన్న ఆతృత ఆమె గొంతులో ధ్వనించింది. రవి నవ్వాడు.

"మా ఇద్దరి మధ్య ఉన్నది స్నేహం మాత్రమే. ఆమెని ప్రేమించానని నేను మాత్రమే అనుకున్నాను. కాని చాలా కాలం వరకు ఆ విషయాన్ని ఆమెకి చెప్పడానికి కూడా భయపడ్డాను. కొన్ని నెలలు గడిచాక, నేను మాటలు కూడదీసుకున్నాను. తగిన స్థలాన్ని నిర్ణయించాను. అంద మైన జీవితాన్ని ఊహించుకున్నాను. డిగ్రీ ఆఖరి సంవత్సరం పరీక్షలయ్యాక, కాలేజి క్యాంటిన్‌లో కూర్చుని ఉన్నప్పుడు, ధైర్యంచేసి నా ప్రేమ సంగతి షర్మిలాకి చెప్పదలచుకున్నాను. ఎందుకంటే కాలేజి జీవితం ముగిసిపోతోంది. తర్వాత ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదు. క్యాంటిన్ లాన్‌లో మేమిద్దరం కలసి నడుస్తున్నప్పుడు, నా మనసులోని మాటని మృదువుగా చెప్పాను. షర్మిలా నివ్వెరబోయింది. నన్ను ఆమె – కెమిస్ట్రీ గురించి, సాహిత్యం గురించి చర్చించే ఓ స్నేహితుడిగానే చూసిందట. 'కాలేజి అంటే స్నేహితులు దొరికే చోటు. అంతే కాని, ప్రేమికులను వెదుక్కునే స్థలం కాదు' అని అంది. 'నేను ఎవరితోను ప్రేమలో పడను' అని అంది. 'నాకు సరైన జోడిని వెదికే బాధ్యత మా అమ్మా నాన్నలదే' అని అంది. పైగా ఆమెకి అప్పటికే ఓ సంబంధం కుదిరిపోయిందట. కాబోయే భర్త అమెరికాలో సాఫ్ట్‌వేర్ నిపుణుడు. ఇంకో రెండు మూడునెలల్లో ఇండి యాకి వచ్చి షర్మిలాను చూశాకా, పెళ్ళి చేసు కుంటాడట. 'మా అమ్మా నాన్నల హృదయాలను గాయ పరచలేను. ఇంక ఈ విషయంలో మరో మాట లేదు' అని అంది.

నాకు నోట మాట రాలేదు. నా ఈ ప్రేమ ఆమె పెళ్ళికి ఆటంకం కావచ్చని ఆమె అనుకుంది. కాబట్టి ఈ ప్రస్తావన మళ్ళీ తేవద్దని కోరింది. మరో మగాడితో స్నేహంగా ఉండడం పుకార్లకు దారితీస్తుందని నాకు దూరంగా మెలగసాగింది. ప్రేమ విషయాన్ని ఆలస్యంగా బయటపెట్టి, వైఫల్యాన్ని మూటకట్టుకున్నందుకు నాకూ సిగ్గనిపించింది. నేను కూడా ఆమెకి దూరంగానే ఉండి పోయాను. కాలేజి రోజులతో పాటే మా స్నేహమూ ముగిసి పోయింది. కాలేజిలో విడిపోతున్నప్పుడు, 'కలుస్తూ ఉండు' అని ఒకరికి ఒకరం చెప్పుకున్నా, అది జరిగేది కాదని ఇద్దరికీ తెలుసు." అంటూ చెప్పడం ఆపి నిట్టూర్చాడు రవి.

"ఇదీ జరిగింది. ఇప్పుడు నీకు నా పూర్వజీవితపు రహస్యంతో సహా అంతా తెలుసు. నీ అనుమానాలు నిజమే. కాని అరుణా, దీని గురించి నువ్వు బాధపడాల్సిన అవసరం లేదు. ఇదంతా ముగిసిన, మరచిపోయిన వ్యవహారం" అని చెప్పాడు రవి. ఇదంతా చెబుతున్నప్పుడు

రవి ఆమెకేసి చూడ లేదు. ఆమె చూపులను తప్పించుకోవాలని తన దృష్టంతా అక్కడున్న బల్లపై లగ్నం చేసి చెప్పాడు. అరుణలో అనుమానం, కోపం, బాధ లాంటి భావాలు తలెత్తి మనస్తాపం కలిగించడాన్ని అతడు గ్రహించలేదు.

ఆమె మాత్రం నిశ్శబ్దంగా కూర్చుని రవి చెప్పిన దంతా, ప్రతి పదం ఎంతో శ్రద్ధగా వింది. ఇంకా ఏం చెబుతాడా అన్నట్లుగా చూస్తోంది. ఉన్నట్టుండి ఆమె ముఖంలో కోపం మాయమై, ఓ చిరునవ్వు విరిసింది.

"రవీ, ఇదంతా నాకు చెప్పి ఎంతో మేలు చేసావు. నేనో పిచ్చిదాన్ని. నీ గురించి ఏదేదో ఊహించుకున్నాను. నన్ను క్షమించు" అని అంది అరుణ, గొంతులో నిజాయితీ ధ్వనించడానికి ప్రయత్నిస్తూ.

ఆమె వెటకారాన్ని రవి గ్రహించలేదు.

"ఇందులో నీ తప్పేం లేదు, అరుణా. తప్పంతా నాదే. ఈ విషయమంతా నీకు ఎప్పుడో చెప్పి ఉండాల్సింది. ఎప్పటికి కుదిరింది." అన్నాడు రవి. హఠాత్తుగా ఆమె బిగ్గరగా నవ్వింది. "మిస్టర్ రవి, ఇక నన్ను మోసం చేయలేవు. ఈ కథ నువ్వు ఎలా అల్లావో నాకు తెలుసు" అని అంది అరుణ.

రవి ఏదో చెప్పబోయాడు. ఆమె అతడిని వారించింది. "ఈ కథంతా నిజమని నన్ను నమ్మించాలని చూడకు. నువ్వు కొని తెచ్చిన పుస్తకంలో చదివాను. అందులో అచ్చం ఇదే కథ ఉంది. ఉండు, నీకిప్పుడే చూపిస్తాను" అంటూ లేచింది అరుణ.

"నువ్వు ఇంత ఆసక్తికరంగా కథలు చెబుతావని తెలిస్తే, నీ బయో – కెమిస్ట్రీ వ్యాసాలు కూడా చదివేదాన్ని" అని అతడిని వెక్కిరిస్తూ, బల్లపై ఉన్న ఆ పుస్తకాన్ని అందుకుంది. "ఇదిగో, ఇదే" అని అంటూ, ఆ పుస్తకంలోని 'కట్టుకథ' అనే పేరుగల ఓ కథను చూపించింది అరుణ.

"ఈ కథ నువ్వు చదివావని నాకు తెలుసు. ఇదే కథ నాకు చెప్పి నన్ను ఏమార్చాలని చూశావు. భర్తకు పాత స్నేహితురాలితో సంబంధం ఉందేమో అని అనుకునే అనుమానపు భార్య, అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి.... ఇదంతా ఈ కథలో ఉంది. ఈసారి నువ్వు నాకు దొరికి పోయావు రవి" అని అంది అరుణ విజయగర్వంతో.

మళ్ళీ తనే మాట్లాడుతూ, "నేను దాదాపుగా నమ్మేసాను. నువ్వు కొంచెం అటు ఇటు మార్చి ఉంటే పూర్తిగా నమ్మేసేదాన్ని. ఎంత ఆసక్తికరంగా చెప్పావు? కాని పూర్తిగా ఈ కథలో ఉన్నదున్నట్టుగా చెప్పావు. నువ్వు గొప్ప కథకుడివి" అని అంది. రవి కాదనకుండా, మౌనంగా ఉండిపోయాడు. భుజాలెగరేసి, ఆ బల్లపైన ఉన్న పుస్తకాన్ని చూపిస్తూ "వాస్తవం నీ కళ్ళ ఎదురుగానే ఉంది" అని అన్నాడు నాటకీయ ఫక్కీలో.

అరుణ నవ్వింది. రవి దగ్గరికి వచ్చి, “చూసావా? నీ దిగులుపోయి, మళ్ళీ నువ్వు ఉత్సాహంగా ఉన్నావు” అంటూ మురిపెంగా అతడి బుగ్గపై చిన్న ముద్దు పెట్టింది. అరుణని బ్రతిమాలుతున్నట్టుగా, మోకాళ్ళపై కూర్చుని, “దయచేసి ఈ విషయాన్ని షర్మిలాకి చెప్పకు. ఆమె నన్ను చంపేస్తుంది” అని అన్నాడు రవి.

“సరే, సరే నిన్ను క్షమించాను. షర్మిలాకు చెప్పను. ఆమె భర్తకి మాత్రమే చెబుతాను” అని అంది అరుణ.

“వద్దు. వద్దు. అంత పని చేయకు” అంటూ ప్రాధేయపడ్డాడు రవి. అరుణ నవ్వుకుంటూ, జడ దువ్వ కోసాగింది. రవి గుంభనంగా నవ్వుకుని, ఆ పుస్తకాన్ని తీసి, తన ముద్రిత రచనలు ఉంచిన చోట పెట్టాడు.

**(జాగృతి, 25 అక్టోబరు 2004)**

**‘కట్టు కథ’ కథకి మూలం** A little Piece of Fiction **అనే ఆంగ్ల కథ.**
**మూల కథ** www.wilmingtonblues.com **అనే వెబ్‌సైట్‌లో ప్రచురితమైంది.**

# ఆత్మావలోకనం

**ఆంగ్లం : దీపాంకర్ బసు**

ఇ-మెయిల్!

నేటి కంప్యూటర్ యుగంలో, చాలామంది జీవితాలు ఇ-మెయిల్ అనే ఈ అద్భుతంపై ఆధారపడి ఉన్నాయి. మనుషుల జీవితాలలోని ఎన్నో కీలకమైన నిర్ణయాలను ఈ ఆధునిక సందేశాలు తమలో ఇముడ్చుకుంటున్నాయి. ఉద్యోగ నియామకాలు, ప్రేమలేఖలు.... ఇంకా అనేక సందేశాలు కంప్యూటర్ ద్వారా ప్రసారం చేయబడుతున్నాయి. మనుషులలోని సున్నితమైన భావోద్వేగాలు కొన్ని 'కిలోబైట్స్ మెమొరీ'లలో నిక్షిప్తమై పోతున్నాయి.

నావిషయంలో అటువంటిది ఏదీ జరగలేదు. నాటకీయత అసలే లేదు. నాకు వచ్చిన ఇ-మెయిల్‌ను 'జాయ్' పంపాడు. అతడు స్కూల్లో నా సహ విద్యార్థి. మా పాత విద్యార్థుల సంఘం వెబ్‌సైట్ నుంచి ఇ-మెయిల్ ఐడి సంపాదించాడు. అంతే! ఇంకేముంది! నాకో ఇ-మెయిల్ వచ్చింది. అతడు ప్రస్తుతం ఓ రసాయనాల కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడట. అతడు నాకు గుర్తున్నాడో లేదో తెలుసుకోవాలనుకుంటున్నాడు. మా పాత విద్యార్థుల సంఘం కార్యదర్శిగా అతడు కొత్తగా బాధ్యతలు తీసుకున్నాడు. సెంట్రల్ కలకత్తాలోని మా 'సెయింట్ పాట్రిక్ స్కూల్' పాత విద్యార్థులందరినీ ఒకచోట సమావేశపరచాలని అతడు నిర్ణయించాడు. ప్రస్తుతం నేను నగరంలోనే ఉంటున్నందున, పాత విద్యార్థుల సంఘంలో చేరమని బ్రతిమాలాడు. ఇదీ ఆ ఇ-మెయిల్ సారాంశం!

'బావుంది' అని అనుకుంటూ, నేను మా స్కూల్ వెబ్‌సైట్‌పై క్లిక్ చేశాను. కాలం చెల్లిన 'జావా లింకు'లతో, పెద్దగా ప్రావీణ్యం లేనివారు రూపొందించినట్లుగా ఉందా వెబ్‌సైట్. నేను నవ్వుకున్నాను.

"ఏమీ మారలేదు. మా స్కూల్ ఇప్పటికీ పాతకాలంలోనే ఉండిపోయింది" అని అనుకుంటూ, 1989 బ్యాచ్‌లోని మా తరగతిని సూచించే 'హైపర్‌లింక్'పై క్లిక్ చేశాను. వెంటనే తెరపైన ఓ గ్రూప్ ఫోటో ప్రత్యక్షమైంది. ఆ ఫోటో చాలా పాతగాను, దాని స్కానింగ్ సరిగా లేనట్టు అనిపించింది. అది మా ఆరో తరగతి ఫోటో. కల్మషం లేని తాజా ముఖాలు నన్ను పలకరించాయి. వెంటనే నేను ఆ ఫోటోని ప్రింట్ తీసుకుని మరింత జాగ్రత్తగా పరిశీలించసాగాను. ఆ ముఖాలన్నీ నాకు

చిరపరిచితమే! వాళ్ళలో కొందరు నన్ను ఇప్పటికీ కలుస్తూనే ఉన్నారు. సన్నీ, దేబాంజన్ అందులో ఉన్నారు. రెండవ వరుసలో, కొంచెం పిరికిగా కనబడుతున్నది నేను. అందరం పదేళ్ళ వయసువాళ్ళం! ఆఖరి వరుస చివర్లో నిలుచున్న ఓ పొడుగాటి కుర్రాడిపై నాదృష్టి నిలిచిపోయింది. అతడు జేమ్స్ డిసౌజా.

హఠాత్తుగా నా హృదయాంతరాలలో ఎక్కడి నుంచో జ్ఞాపకాలు వెల్లువలా పొంగాయి. నాకు తలనొప్పి మొదలైంది. వేరే ఇ-మెయిల్స్ చూడకుండా, నా పనులన్నీ వదిలేసి, కుర్చీలో జారబడి, కణతలు నొక్కుకుంటూ కూర్చున్నాను. 'తల బద్దలై పోతుందా' అని అనిపించేంత నొప్పి! ఇంతగా నొప్పి వచ్చి చాలా కాలమైంది. నేను మెల్లగా గతంలోకి జారుకున్నాను.

H H H

నేను బాలుర పాఠశాలలో చదివాను. ఆరోజుల్లో మా స్కూల్ చాలా ప్రసిద్ధి చెందింది. చదువుకి, క్రమశిక్షణకి పెట్టింది పేరు. స్థానిక ఆంగ్లో-ఇండియన్లకు విద్యాబోధన చేయడానికి ఈ పాఠశాలను వందేళ్ళక్రితం క్రైస్తవ మిషనరీలు స్థాపించారు. కాలక్రమంలో పాఠశాల ఉద్దేశ్యాలు మారాయి. కలకత్తాలోని మధ్యతరగతి కుటుంబాల పిల్లలు చాలామంది ఆ స్కూల్లో చేరసాగారు. గతించిన సామ్రాజ్యవాద పాలనకు చిహ్నంగా కొద్దిమంది ఆంగ్లో ఇండియన్లు మాత్రం ఇంకా ఈ స్కూల్లో చదువుతున్నారు. వాళ్లల్లో జేమ్స్ ఒకడు. మేము అతడిని 'జిమ్మీ' అని పిలిచేవాళ్ళం! అతడు మా బడిలో ఎప్పుడు చేరాడో నాకు సరిగ్గా గుర్తులేదు. బహుశా నాలుగో తరగతిలోనేమో. అతడు వార్షిక పరీక్ష పాసవలేదు. అందుకని స్కూలు తిరిగి ప్రారంభించిన రోజున వెనుక బెంచీలో తలొంచుకుని కూర్చున్నాడు. మా మాటల్ని పట్టించుకోకుండా, ఆలోచనల్లో మునిగిపోయాడు.

అదో చిత్రమైన దశ! అప్పటికి అమ్మాయిలు మా సంభాషణల కేంద్రమింకా కాలేదు. ఎటువంటి మానసిక జాడ్యాలు మాకులేవు. ఉద్యోగాల ఊహలు మా మనసుల్లోకి ఇంకా ప్రవేశించలేదు. మేము అమాయకంగా ఉంటూ, మార్గదర్శకుల కోసం చూస్తుండేవాళ్ళం! గుర్తింపు కోసం తపిస్తూ, ఆదర్శ నాయకుల కోసం వెదుకుతుండేవాళ్ళం!

ఆ శూన్యంలోకి జిమ్మీ సులువుగా ప్రవేశించాడు. మాలో లేని అంశాలెన్నో అతడిలో ఉన్నాయి. లేదా ఉన్నాయని మేము భావించాము. జిమ్మీ ప్రిన్సిపాల్‌గారంటే లెక్క లేకుండా, పొగరుగా ఉండేవాడు. చదువంటే ఆసక్తిలేని అతడి వైఖరి మా పై తరగతి పిల్లలను కూడా విశేషంగా ఆకర్షించేది. అతడు మా క్రికెట్ టీంకి, ఫుట్‌బాల్ టీంకి, చివరికి మా క్లాసుకి కూడా నాయకుడై పోయాడు. ఈ సంఘటన స్కూలు అధికారులను ఆశ్చర్యపరచినా, క్రమశిక్షణ నెలకొల్పడంలో జిమ్మీ సహాయపడతాడని వారు నమ్మారు. మా క్లాసులో ఎప్పుడూ మొదటిర్యాంకు తెచ్చుకునే రాహుల్ తప్ప, మిగిలిన అందరం జిమ్మీని ఎంతగానో ఆరాధించేవాళ్ళం. అప్పటివరకు మేము తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఒత్తిడి వల్ల రాహుల్‌ని ఆదర్శంగా తీసుకోవాల్సి వచ్చేది. ఎప్పుడూ పొందే మొదటి

ర్యాంకు కన్నా, ఈ ముఖస్తుతే రాహుల్‌కి ఉత్సాహం కల్గించేది. జిమ్మీ రాకతో, రాహుల్‌ని బలవంతంగా ఆదర్శంగా తీసుకోవాల్సిన అగత్యం మాకు తప్పింది.

మేము జిమ్మీని బాగా గౌరవించేవాళ్ళం! మైదానంలో అతడిని ప్రోత్సహించేవాళ్ళం. అతడి దృష్టిలో పడాలని ప్రయత్నించేవాళ్ళం. అతడి కుటుంబం గురించి, వైమానిక దళంలో పైలట్‌గా పనిచేస్తున్న అతడి తండ్రి గురించి ఎన్నో కథలు ప్రచారంలో ఉండేవి. కాని చాలా రోజుల తర్వాత తెలిసింది – భార్య కష్టపడి సంపాదించిన డబ్బును జిమ్మీ వాళ్ళ నాన్న తన తాగుడికి తగలేస్తాడని! జిమ్మీ కూడా రాయితీలు పొంది చదువుతున్నాడు.

మొదటి సంవత్సరం జిమ్మీకి నేను తెలియదు. పైగా నేను ఆటల్లోను, చదువులోను, ఆఖరికి అల్లరిలోను వెనుకబడి ఉండేవాడిని. క్లాసు లీడర్‌కి నన్ను గమనించే అవకాశమే నేను కల్పించను. జిమ్మీని నేను శ్లాఘించేవాడిని. అతడితో కలిసి ఆటలాడినట్లు, ఒకే బల్లపై కూర్చున్నట్లు, కలిసిమెలసి తిరుగుతున్నట్లు ఊహించుకునేవాడిని. మా వార్షిక ఫలితాలు ప్రకటించే రోజున మాకందరికి ఒకటే ఆత్రుత. జిమ్మీ పాస్ అవుతాడా లేదా అని. అతడు పాసవ్వాలని నేను దేవుని ప్రార్థించాను. జిమ్మీ పాసయ్యాడు – అదీ బొటాబొటీ మార్కులతో. ఉపాధ్యాయులు అతడి గురించి పట్టించుకోవడం మానేశారు. కాలం గడుస్తోంది.

అతడు ఇబ్బందులలో ఉన్నప్పుడు ఆదుకోవాలన్న నా ప్రయత్నాలు నాకు సమస్యలు సృష్టించాయి. ఆ ఏడాది, మా ఐదో తరగతి చివరి పరీక్షలలో అనుకుంటా – నిక్కచ్చిగా ఉండే ఉపాధ్యాయుడొకరు మమ్మల్ని గమనిస్తుండగా, నేను కొన్ని జవాబులు జిమ్మీకి చెప్పాను. మరుసటిరోజు నా ధైర్యం నాలుగింతలైంది. ఏకంగా నా జవాబు పత్రాలలో ఒకదాన్ని జిమ్మీకి ఇచ్చేశాను. ఏదో తప్పు జరిగిందని అనుమానించిన ఉపాధ్యాయుడు మాకేసి నడిచారు. నా గుండె అదురుతుండగా, ఆయన నా కాగితాలన్ని పరిశీలించారు. తర్వాత జిమ్మీతో సహా నా చుట్టుప్రక్కల కూర్చున్న పిల్లలందరి కాగితాలను పరిశీలించారు. నాకెంతో భయమేసింది. మా నాన్న కఠినమైన ముఖం, మా అమ్మ నిరాశాపూరితమైన చూపులు నాకు జ్ఞాపకం వచ్చాయి. మోసంచేసి మార్కులు సంపాదించడం ఎంత తప్పో ప్రిన్సిపాల్ గారు నాకు హితబోధ చేస్తున్నట్లుగా అనిపించింది. ఏదో దేవుడి దయవల్ల. నా పత్రాన్ని కూడా జిమ్మీ పత్రంగానే భావించారాయన. దాంతో బ్రతికిపోయాను. "మీకిదే ఆఖరి హెచ్చరిక" అని చెప్పి ఆయన వెళ్ళి తన స్థానంలో కూర్చున్నారు. నేను బాగా బెదిరిపోయి, తల తిప్పకుండా పరీక్ష పూర్తిచేశాను.

తర్వాత పరిస్థితులు మారిపోయాయి. అంతకు ముందెన్నడు నన్ను పట్టించుకోని పిల్లలు సైతం నన్ను పలకరించసాగారు. పై తరగతి పిల్లలు నన్ను హీరోగా చూసేవారు. ప్రాక్టీసు చేస్తున్నప్పుడు రెండు మూడు క్యాచ్‌లు వదిలేసినా, నన్ను క్రికెట్ టీంలో చేర్చుకున్నారు. ఆరోజు

నాకింకా గుర్తుంది. పరీక్షలు అయిపోయాక, జిమ్మీ బయటకు వచ్చి, నాతోపాటు నడుస్తూ, ఏకాంతంలో నాకు కృతజ్ఞతలు తెలిపాడు. నా వెనుకగా నా మిత్రబృందం అసూయపడడం నేను గమనించాను. తర్వాత కొద్దిరోజులపాటు నా ఆనందానికి పట్టపగ్గాలు లేవు.

H H H

వర్తమానంలోకి వచ్చిన నేను, “ఆరోజులు తిరిగి రావు” అని అనుకుంటూ లేచి కాఫీ మిషన్ దగ్గరికి వెళ్ళాను. ఈ చిన్న విరామంలోను, ఆ జ్ఞాపకాలు నన్ను వదల్లేదు. తిరిగి నన్ను చుట్టుముట్టాయి. కప్పులో కాఫీ నింపుకుంటుండగా నాకా దుర్దినం గుర్తొచ్చింది.

H H H

ఆ రోజున దసరా సెలవుల అనంతరం స్కూలు తిరిగి ప్రారంభమైంది. అందరికీ ఎంతో ఉత్సాహంగా ఉంది. సెలవులలో తనకొచ్చిన కానుకలను రాహుల్ అందరికీ చూపించసాగాడు. వాటిల్లో ధనవంతుడైన వాళ్ళ మావయ్య ఇచ్చిన యాభై రూపాయల నోటు కూడా ఉంది. ఆ నోటుని రాహుల్ సగర్వంగా ప్రదర్శించసాగాడు. ఆరోజులలో యాభై రూపాయలంటే చాలా పెద్ద మొత్తం! మేమంతా ఆ నోటుని నోరు వెళ్ళబెట్టి చూడసాగాము. ఆ సంవత్సరమే కొత్తగా ప్రారంభించిన ఓ హోటల్‌కి తనొక్కడే వెడుతున్నట్లు ప్రకటించాడు రాహుల్. కొద్దిగా సిరా మరకలు అంటిన ఆ నోటుని నా కళ్ళముందు చాలాసార్లు ఊపాడు. మా ఇద్దరిమధ్య సామరస్యం ఎటూ లేదు. పైగా నేనీమధ్య బాగా ప్రాచుర్యంలోకి రావడం రాహుల్‌కి కంటకప్రాయంగా ఉంది.

విరామం తర్వాత పిల్లలందరం తరగతి గదిలోకి వచ్చాక, తన యాభైరూపాయలు నోటు పోయిందని రాహుల్ మాస్టారుకి ఫిర్యాదు చేశాడు. నిజాయితీ గురించి, దానివల్ల కలిగే లాభాల గురించి మాస్టారు గొప్పగా వివరించినా, లాభం లేకపోయింది. చివరికీ విషయం ప్రిన్సిపాల్‌గారి దాకా వెళ్ళింది. అందరి సంచులు వెదకమని ఆయన ఆజ్ఞాపించారు. ఓ యాభై రూపాయల నోటుని జిమ్మీ సంచిలోంచి తీయడం నాకు గుర్తుంది. ఆ నోటు తనదేనని జిమ్మీ వాదించాడు. బదులుగా రాహుల్ పెద్ద గొంతుతో అరవసాగాడు.

తర్వాత జిమ్మీ మాకెన్నడు కనబడలేదు. ఆరోజు జిమ్మీ ప్రిన్సిపాల్‌గారి గదిముందు నిలబడి ఉండగా చూడడమే ఆఖరు. ఏదో అంతుబట్టని వ్యాధి రావడంతో నేను తర్వాత రెండు వారాల పాటు స్కూలుకి వెళ్ళలేదు. నేను కోలుకుని స్కూలుకి వెళ్ళాక జిమ్మీ పేరే వినబడలేదు. ఓ నాలుగు అయిదు నెలలు గడిచేసరికి అందరూ జిమ్మీని దాదాపుగా మరిచిపోయాం. నేను జిమ్మీని కలవడానికి మొక్కుబడిగా ఏవో ప్రయత్నాలు చేశాను. కాని అవేవీ ఫలించలేదు.

H H H

గతంలోంచి బయటపడ్డ నాకు, జిమ్మీని చూడాలనిపించింది. పాత విద్యార్థుల సమావేశానికి

తప్పకుండా వెళ్ళాలనుకున్నాను. మా స్కూలు చదువులు పూర్తయ్యి కూడా పన్నెండేళ్ళవుతోంది. మా 1989 బ్యాచ్‌లో ఎవరెవరు ప్రస్తుతం కలకత్తాలో ఉంటున్నారో? వాళ్లలో ఎందరు శనివారం మండుటెండలో పడి తమ పాత మిత్రులను కలుసుకోవడానికి వస్తారు? కాని జొయ్ తన పట్టువీడలేదు. రెండు దినపత్రికలలో ప్రకటనలు వేయించాడు. కొందరికి ఫోన్ చేశాడు. మరికొందరికి ఇ-మెయిల్ చేశాడు. వీటి ఫలితంగా ముప్ఫై మంది తప్పక వస్తామని హామీ ఇచ్చారు. జొయ్ ఏర్పాటు చేసిన ఓ క్లబ్‌లో అందరం కలవాలని అనుకున్నాం. శనివారం మధ్యాహ్నం మూడున్నరకీ, నేను సన్నీ క్లబ్ బయట కలిసాం.

"నువ్వు ఎక్కువదూరం నడవక్కర్లేదు. నీకో హీరోహోండా ఉండాలి కదా?" అంటూ హాస్యమాడాడు సన్నీ.

మోటార్‌బైక్ పైన అస్తమిస్తున్న సూర్యుడి దిశగా దూసుకుపోవాలనేది ఆరోజులలో నా కోరిక. నేనిప్పటికీ నా సంపాదనలో కొంతభాగం బైక్ కోసం దాస్తున్నాను. మేము నవ్వుకుంటూ క్లబ్ ఆవరణలోకి ప్రవేశించాం. మా సమావేశం గురించి మైక్‌లో ప్రకటన చేశారు. అప్పటికే అక్కడికి చాలామంది వచ్చి ఉన్నారు. వాళ్ళలో చాలామంది నాకు గుర్తున్నారు. ఒకే ఊర్లో ఉంటున్నా, దాదాపుగా పన్నెండేళ్ళ తర్వాత నేను మళ్లీ నా మిత్రులను చూస్తున్నాను. పలకరింపులు అయ్యాయి. నా మిత్రులలో కొంతమంది కార్పొరేట్ నిచ్చనలెక్కి జీవితంలో ఉన్నతస్థాయికి ఎదిగారు. ఉపన్యాసాలు ముగిసాక, నేను జిమ్మీ కోసం వెదికాను. జిమ్మీ కనబడ్డాడా అని ప్రతి ఒక్కరిని అడిగాను. మా మిత్రులు కొంతమంది అందుకున్న ఉన్నతస్థానాలకు జిమ్మీ చేరగలిగాడా?

జిమ్మీతో స్నేహసంబంధాలు కొనసాగించిన మిత్రుడొకడు దొరికాడు. స్కూలు నుంచి బహిష్కరించిన తర్వాత, జిమ్మి జీవితం క్రమంగా అధోగతి పట్టింది. ఓ బట్టల కొట్లో చేరాడట. కానీ, ఆ ఉద్యోగాన్ని నిలుపుకోలేకపోయాడు. తర్వాత ఎన్నో ఉద్యోగాలు మారాడు. చెడు సావాసాలకి లోనై, మాదకద్రవ్యాలకి బానిస అయ్యాడు. పునరావాస కేంద్రంలో చేర్చినా, అక్కడ ఉండలేపోయాడట. చివరికి ఏదో ప్రమాదకరమైన జబ్బు చేసిందట. కనీసం బ్రతికి ఉన్నాడో లేదో కూడా తెలియదట - ఇవీ జిమ్మీ వివరాలు. నేను తిరిగి జిమ్మీని చూడగలుగుతానా?

H H H

తర్వాత కొద్దిరోజుల పాటు నేనేపనిమీద దృష్టి పెట్టలేకపోయాను. జిమ్మీని కలిస్తేగాని నాకు మనశ్శాంతి లేదనిపించింది. అతడి కుటుంబం ఎక్కడుందో కనుక్కొని, వాళ్ళ ఇంటికి వెళ్ళాను. అదొక చిన్న, పాడుబడ్డ ఇల్లు. వాళ్ళమ్మ నన్ను చూసి ఆశ్చర్యపోయింది. వాళ్ళని దురదృష్టం వెంటాడింది. జిమ్మీని స్కూల్ నుంచి తీసేసాక, కొన్నాళ్ళకే ఆమె భర్త చనిపోయాడట. ఆ ఒంటరి మహిళ తన ఇద్దరు చిన్నపిల్లలతో ఎన్ని కష్టాలు పడుతుందో నేను ఊహించగలను. ఆమె జిమ్మీ

ఆరోగ్యం గురించి చెప్పసాగింది. అతడి పరిస్థితి బాగా విషమించింది. క్షయతో బాధపడుతూ, ప్రస్తుతం ప్రెసిడెన్సీ జనరల్ హాస్పిటల్‌లో ఉన్నాడు. అతడికోసం ఏమీ చేయలేకపోతున్నామని ఆమె విలపించింది. లేకపోతే ఈరోజులలో క్షయరోగం ఏపాటి? దాన్ని సులువుగా నివారించవచ్చు. కాకపోతే కాస్త ఖర్చవుతుంది. యాభైవేల రూపాయలుంటే జిమ్మీకి నయమవుతుంది. ఇంతలో ఆమె రెండో కొడుకు రావడంతో ఆమె వాగ్రవాహానికి అడ్డుకట్ట పడింది. తైల సంస్కారంలేని జుట్టుతో, చొక్కా లేకుండా ఉన్న అతడు నన్ను ఆకట్టుకోలేకపోయాడు. మిశ్రమ భావాలతో నేను బయటకు నడిచాను.

మర్నాడు నేను జిమ్మీని కలవాలనుకున్నాను. వానాకాలం ప్రారంభమైన రోజులవి. నల్లని, దట్టమైన మబ్బులు ఆకాశాన్ని కమ్మేశాయి. బస్‌స్టాపు నుంచి ఆసుపత్రి వైపు నడవసాగాను. ఆసుపత్రిలోని ఏదో అంతస్తులో ఓ మూలగదిలో జిమ్మీని చూసాను. అతడిని చూసి విస్మయానికి గురయ్యాను. పొడుగాటి, కండలు తిరిగిన ఒకప్పటి అతని శరీరం, ఇప్పుడు వడలిపోయి నీరసంగా కనబడుతోంది. అతడిముఖం భావరహితంగా ఉంది. శ్వాస పీల్చడం కూడా కష్టంగా ఉందతనికి. వాళ్ళమ్మ అతడి చెవిలో నా పేరుని గట్టిగా చెప్పింది. కాని అతడికేది జ్ఞాపకం వచ్చినట్లు లేదు.

"ఈమధ్య వీడు నన్ను కూడా గుర్తుపట్టడంలేదు" అని సంజాయిషీగా అంటూ, "అంతా మా తలరాత! దేవుడు దయచూడడంలేదు" అని అంది వాళ్ళమ్మ విచారంగా. నేను జిమ్మీ కళ్ళలోకి సూటిగా చూశాను. కాని అతడి నుంచి ఎటువంటి ప్రతిస్పందనా లేదు. సమయం గడుస్తోంది. ఇంతలో జిమ్మీ సోదరుడు అక్కడికి వచ్చాడు – ఒంటరిగా కాదు, తన ప్రియురాలితో జంటగా. నేనక్కడ ఉండడం చూసి విస్తుపోయి, నాకక్కడ ఏంపని అన్నట్లుగా వాళ్ళమ్మని కళ్ళతోనే అడిగాడు. ఇక నేను ఆలస్యం చేయదలచుకోలేదు. న్యాయం చేయడం ఆలస్యమైతే, న్యాయం జరగదన్న లోకోక్తి నాకు గుర్తొచ్చింది. కాని న్యాయం చేయడం ఆలస్యమైనా, అది అన్యాయం కంటే మెరుగని నా అభిప్రాయం. వెంటనే నేను యాభైవేల రూపాయలకి చెక్కు రాసి వాళ్ళమ్మ చేతిలో పెట్టాను. ఆమె నివ్వెరపోయింది. రెండు క్షణాల మౌనం తర్వాత, కళ్ళు తుడుచుకుని దేవుడిని ప్రార్థించసాగింది. జిమ్మీ సోదరుడు ఆ చెక్కు వంక ఆశగా చూడసాగాడు. ఆ డబ్బును చేజిక్కించుకోవడం కోసం అతడి ప్రియురాలు అప్పుడే ఏదో పథకం వేస్తున్నట్లు గ్రహించాను.

ఇంకొక్క పని మిగిలిపోయింది. నా జేబులోంచి సిరా మరకలు పడ్డ ఓ పాత యాభై రూపాయల నోటు తీసి జిమ్మీ పిడికిలిలో దూర్చాను. చివరిసారిగా అతడి కళ్ళలోకి చూసాను. ఒక్క క్షణంపాటు అతడికేదో జ్ఞాపకం వచ్చినట్లుంది (లేక అది నా భ్రమేనా?) అతడి పెదాలపై ఓ చిరునవ్వు కదలాడింది. అతడి చూపులను తట్టుకోలేకపోయాను. చెమ్మగిల్లిన కళ్ళతో, వెనక్కి తిరిగి బయటకు వచ్చేశాను.

మెట్లు దిగేసరికి నా హృదయభారం కొంత తగ్గింది. బయట పెద్దగా వాన పడుతోంది. జనాలందరు వరండాలో నిల్చుని ఉన్నారు. నేనా వర్షంలోనే బస్‌స్టాండ్ వైపు నడిచాను. తొలకరి జల్లుల వల్ల అక్కడి చెట్లన్నీ పచ్చగా కళకళలాడుతున్నాయి. నేను బస్‌స్టాండ్‌కి చేరేసరికి మబ్బులు విడిపోయి, ఆకాశం నిర్మలంగా, నీలంగా మారింది. బస్‌కోసం ఎదురుచూస్తూ, గట్టిగా ఊపిరిపీల్చుకున్నాను.

ఎప్పుడో చిన్నప్పుడు చదివిన ఓ కథలో ఇద్దరు స్త్రీలు మాట్లాడుకునే సంభాషణలు గుర్తొచ్చాయి.

“కాలం మాన్పలేని గాయమేదీ లేదు” అని అంటుంది ఒకామె.

“నిజమే. కాలము, ఓర్పు గాయాలను తప్పక మాన్పుతాయి” అంటుంది మరో స్త్రీ.

నాకు నవ్వొచ్చింది. “కాలము, ఓర్పు మాత్రమే సరిపోవు. నీలోకి నీవు చూసుకోవటం కూడా ఉండాలి” అని అనుకుంటూ, అటుగా వచ్చిన బస్‌లోకి గెంతాను.

**(జాగృతి 14 జూన్ 2004)**

**‘ఆత్మావలోకనం కథకి మూలం** 'The Confession' **అనే ఆంగ్ల కథ. మూల కథ** www.indiacurrents.com **అనే వెబ్‌సైట్‌లో ప్రచురితమైంది.**

# విషవలయం

**ఆంగ్లం : బ్రియన్ కోటే**

**జా**ర్జికి హఠాత్తుగా మెలకువ వచ్చింది. దూరంగా గోడపై కాంతి ప్రసరిస్తోంది. అది ఆరుతూ, వెలుగుతూ వుంది. ఒక్కోసారి కనబడుతోంది. మరోసారి కనబడటంలేదు. జార్జి కంగారు పడ్డాడు. అతడికి ఏమీ అర్థం కాలేదు. మంచం మీద నుంచి లేచాడు. మెల్లగా గోడవారగా నక్కినక్కి వెళ్ళి, కిటికీలోంచి తొంగిచూశాడు. వీధి దీపం వెలుతురులో తన ఇంటిముందున్న ఓ పార్కు చుట్టూ ఒక పాత మోడల్ కాడిలాక్ కారు ప్రదక్షిణం చేయడం గమనించాడు. దాని హెడ్‌లైట్ వెలుతురు ప్రతి రెండు సెకన్లకొకసారి కిటికీ గుండా పరదాలను దాటి వచ్చి గోడలపై క్రీనీడను ఏర్పరుస్తోంది. వీధిలో ఒకే దీపం ఉంది. చుట్టుపక్కల ఇళ్లన్నీ చీకటిలో ఉన్నాయి. ఈ నిశ్శబ్ద వాతావరణంలో చలిస్తున్నది ఆ కారు ఒకటే.

జార్జి ఇల్లు చాలా వరకు ఖాళీ. ఒకే కుర్చీ, ఒక టీవీ ఉన్న లివింగ్ రూమ్ దాటి, ఇంటి బయటకు వచ్చాడు. తన ఇంటి తలుపులని దగ్గరగా వేసి, మెట్లు దిగి గట్టిగా శ్వాస పీల్చుకుని చీకటిలోకి అడుగుపెట్టాడు. కాళ్లకి చెప్పులు లేకుండా, మంచులో తడిసిన పచ్చికపై నడవసాగాడు. పైజమాలో చేతులు పెట్టుకుని, వృత్తాకారంలో తిరుగుతున్న కారుని గమనించసాగాడు. పరీక్షగా చూస్తే, స్టీరింగ్ వీల్ వెనుక ఓ నల్లటి ఆకారం కనిపించింది. బహుశా ఆ డ్రైవరు జార్జిని చూసి ఉండడు. ఎందుకంటే ఆ కారు ఆగలేదు.

జార్జికి కోపం ఆగలేదు. కారు తన వైపు వచ్చినప్పుడు, దాని తలుపు మీద గట్టిగా కొట్టాడు. "ఏయ్" అంటూ అరిచాడు. కారు ఆగలేదు. 'సరే మళ్లీ వస్తుందిగా' అని అనుకున్నాడు. మళ్లీ ఈసారి తనవైపు వచ్చినప్పుడు దానితోపాటూ పరిగెత్తి, దాని పైభాగాన గట్టిగా కొట్టాడు. "ఏయ్" అంటూ అరిచాడు. కాని కారు ఆగలేదు. మూడోసారి కారు తనవైపు తిరిగినప్పుడు, దానికి అడ్డంగా నిలుచుని బలవంతంగా ఆపాడు. కారు బాయ్‌నెట్‌పై చేతులు వేసి, "ఏం నాయనా, ఏంటి సంగతి, ఎందుకిలా కారు నడుపుతూ అందరి నిద్రా పాడుచేస్తున్నావు?" అని అడిగాడు. ఇంజను వేడికి జార్జి చేతులు కాలాయి. అయితే మసకగా కనిపిస్తున్న డ్రైవరు ఏమీ మాట్లాడలేదు. జార్జిని లోపలికి రమ్మన్నట్లుగా ముందు తలుపు తీసి పట్టుకున్నాడు. ఒక నిమిషం పాటు ఆలోచించి, జార్జి కారు లోపల కూర్చున్నాడు.

డ్రైవరు ఏమీ మాట్లాడకుండా గేరు మార్చి మళ్లీ గుండ్రంగా తిప్పసాగాడు. అతడిని పరిశీలనగా చూశాడు జార్జి. చిన్నవాడే. వయసు 25-25 సంవత్సరాలు ఉండచ్చు. వేసుకున్న బట్టలు ముతగ్గా, మాసిపోయి వున్నాయి. కట్టుకున్న టై ఎప్పటిదో. కొద్దిగా గడ్డం పెరిగింది. అలసినట్లుగా కనబడుతున్నా, అతడి కళ్లలో ఏకాగ్రత కనబడుతుంది. అతడి బాహ్యరూపానికి పూర్తి వ్యతిరేకంగా, కారు లోపల అన్నీ దాదాపుగా సక్రమంగా అమర్చి ఉన్నాయి. 'డోర్ మాట్'ల క్రింద దుమ్ము ఏమాత్రం లేదు. సరిగ్గా లేనివి రెండే రెండు. దినపత్రిక వెనుకసీట్లో విసిరేసి ఉంది. కోడిగుడ్లతో వున్న ఒక అట్ట పెట్టె డాష్‌బోర్డుకి, ముందు కిటికీ అద్దానికి రాసుకుంటోంది. డ్రైవరుకేసి ఆందోళనగా చూశాడు జార్జి.

"నీ సమస్య ఏంటి మిస్టర్? ఈ సమయంలో..." అంటూ డాష్ బోర్డులోని గడియారంకేసి చూశాడు. సమయం తెల్లవారు జామున మూడు గంటలవుతోంది. "జనాలందరూ నిద్రపోయే సమయంలో ఈవిధంగా కారు నడపడంలో నీ ఉద్దేశ్యం ఏమిటి? అని అతడిని అడిగాడు జార్జి. డ్రైవరు మౌనంగా ఉండిపోయాడు.

"నేను అడిగేది వినిపిస్తోందా మిస్టర్?" అంటూ చికాకుగా రెట్టించాడు జార్జి.

"నీ మాటలు నాకు వినబడ్డాయి. కాని ఇక్కడి నుంచి బయటపడడానికి నాకు మరో మార్గం కనబడటంలేదు. నాకు దారి తెలిస్తే ఇలా తిరగను. నన్ను నమ్ము" అన్నాడు ఆ డ్రైవరు.

"నువ్వు ఏం మాట్లాడుతున్నావో నాకు అర్థం కావడంలేదు" చెప్పాడు జార్జి.

"ఇక్కడ, ఇలా రోడ్డు మీద గుండ్రంగా తిరగడం గురించి మాట్లాడుతున్నాను. ఈ వలయం నుంచి బయటపడగలిగితే, ఇలా పిచ్చిగా కారు నడపాల్సిన అవసరంలేదు" అన్నాడా డ్రైవరు.

"కాని నువ్వు నిజంగా పిచ్చివాడిలాగే కారు నడుపుతున్నావు" అన్నాడు జార్జి.

"నేను చిక్కుకుపోయాను" చెప్పాడు. ఆ డ్రైవరు.

"చిక్కుకుపోయావా? ఎక్కడ? అసలిక్కడ ఎందుకున్నావు? తెల్లవారుఝామున మూడు గంటలకి మా ఇంటి ముందు కారెందుకు తిప్పుతున్నావు? ఎందుకు అందరికీ నిద్రాభంగం కలిగిస్తున్నావు? రేపు ఉదయమే అందరు పనులకి వెళ్లాలి రేపేమీ ఆదివారం కాదు. బుధవారం. ఇంతకీ నీ సమస్య ఏమిటి?" అంటూ అసహనంగా అడిగాడు జార్జి. తికమకగా వున్న ఓ చిన్నపిల్లాడిని చూసినట్లుగా జార్జిని చూశాడా డ్రైవరు.

"విషవలయం అనేమాట ఎప్పుడైనా విన్నావా?" అని జార్జిని అడిగాడతడు.

"విన్నాను. ఒక వాదనని మనం ఊహించినప్పుడు, దానిలో నిజం వుందని నమ్ముతాం. ఉదాహరణకి "నేను దేవుడిని నమ్ముతాను" అనే వాదనని తీసుకుంటే, దేవుడు ఉన్నాడని పవిత్రగ్రంథం చెబుతోంది కాబట్టి దాన్ని నిజమని నమ్ముతాం. పవిత్ర గ్రంథం నిజమెలా అయింది? దీనికి

జవాబుగా 'దాన్ని సృష్టించింది స్వయంగా దేవుడే' అని వాదిస్తాం కదా. ఇక్కడ నిజానికి మనం చెప్పింది ఏమీ లేదు. కొత్తగా నిరూపించిందీ ఏమీ లేదు. ఇదంతా తర్కపు వలయం" అన్నాడు జార్జి.

"నిజమే" అంటూ తలూపాడు డ్రైవరు. మళ్లీ తనే మాట్లాడుతూ, "జీవితంలో నేను కూడా ఇక్కడే ఇరుక్కుపోయాను. నేను అన్నింటిని చక్కగా ఊహించుకున్నాను. అయితే నేను బయటపడలేని వలయంలో చిక్కుకుపోయాను. కాని బయటపడాలి. ఈమధ్యే నా వివాహం నిశ్చయమైంది. కాని రెండురోజుల క్రితం నా ఉద్యోగం పోయింది. మిత్రులని, కుటుంబాన్ని వదులుకోవాల్సి వచ్చింది. విధి నన్ను సుడిలోకి లాగేసింది. దీన్నుంచి ఎలా బయటపడాలో నాకు తెలియడ లేదు. నా జీవితం ఛిన్నాభిన్నం అవుతోంది. ఆప్తమిత్రులు సైతం సహాయం చేయడంలేదు. బంధువులు ఆసరా ఇవ్వలేదు. అయితే ఒక్కోసారి నాకు దేనిని గురించీ పట్టించుకోకూడదనిపిస్తుంది. ఇలాంటి సంఘటనలకు కుంగిపోకూడదనిపిస్తోంది. ఇదే వింతగా వుంది. ఎందుకంటావు" అని అడిగాడు.

"నాకు తెలియదు" చెప్పాడు జార్జి.

"నాక్కూడా తెలియదు. కాని నేను సుడిలో ఇరుక్కుపోయాను. నేను తలచుకుంటే, ఈ వలయం నుంచి బయటపడగలను. నేనిక్కడే వుండిపోయి, నా కాబోయే భార్యకి దూరం కాగలను. లేదా వివాహ నిశ్చయాన్ని రద్దు చేసుకోగలను. కాని అది సమస్యలని మరీ తీవ్రం చేస్తుంది. ఇక్కడే నేను ఇరుక్కుపోయాను. నేనేం చేసినా, సమస్య మరీ జటిలమవుతుంది. ఇదే నన్ను కుంగదీస్తోంది. ఏ అవకాశాన్ని పరిశీలించినా, కష్టంగానే తోస్తోంది. నేనేం చేయాలిప్పుడు?" అడిగాడా డ్రైవరు.

"నాకేం తెలుసు?" అన్నాడు జార్జి.

"ఎవరికీ తెలీదని నాకు తెలుసు. అందుకే ఇలా ఒంటరిగా, కారుని గుండ్రంగా తిప్పుతూ వలయంలో తిరుగుతున్నాను. పైగా ఈ వలయాన్ని సృష్టించిందే నేను కదా. నిజానికిదే ముఖ్యం. నేను సృష్టించిన వలయంలోంచి సులువుగా బయటపడవచ్చని అనుకున్నాను. కారుని చాలాసేపు గుండ్రంగా తిప్పితే, కొంతసేపయ్యాక చాలాసేపు గుండ్రంగా తిప్పితే, కొంతసేపయ్యాక మనం స్టీరింగ్ తిప్పకపోయినా, కారు దానంతట అదే నడుస్తుంది అంటే విధి దాన్ని తన చేతులలోకి తీసుకుంటున్నమాట" అన్నాడు ఆ డ్రైవరు.

"నువ్వు ఏమంటున్నావో నాకర్థం కావడంలేదు" చెప్పాడు జార్జి.

"నా మాటలు తికమకగా వున్నాయా? ఇవాళ కాకపోతే రేపైనా జరగబోయేదదే. ఈ కారుని వలయంలోంచి బయటకు తేగలిగితే నా సమస్యల సుడి నుంచి కూడా నేను బయటపడగలనని నాకు తోస్తోంది. తర్కపు లంకెలని తెంచగలనని అనిపిస్తోంది. నా జీవితంలోని ముఖ్యమైన నిర్ణయాలని విధికి వదిలేయక. స్వయంగా నేనే తీసుకోగలగుతాను" చెప్పాడా డ్రైవరు.

"ఇలా గుండ్రంగా గిరగిరా తిరగడం ద్వారానా?" వ్యంగ్యంగా అన్నాడు జార్జి.

"నా కష్టాలన్నీ నీకు విసుగ్గా ఉండవచ్చు" అంటూ జార్జి ఉంటున్న రెండంతస్తుల భవనం కేసి చూశాడు. "మంచి ఇంట్లో వుంటున్నావు. నీకేమీ సమస్యలు వున్నట్లు లేవు" అని అన్నాడా డ్రైవరు.

"లేకేం, సమస్యలు నాకున్నాయి" చెప్పాడు జార్జి.

"ఎలాంటి సమస్యలు?" ప్రశ్నించాడు డ్రైవరు.

"అసలు నువ్వెవరు? నీకు అన్నీ నేనెందుకు చెప్పాలి?" అడిగాడు జార్జి.

"నేనో కారు నడిపే వ్యక్తిని" చెప్పాడా డ్రైవరు.

"నాకు బోలెడు సమస్యలున్నాయి. కాని నేను వాటిని పరిష్కరించుకోగలను" చెప్పాడు జార్జి.

"ఓహో. అయితే నువ్వు నాకైనా మెరుగైన స్థితిలో ఉన్నావన్నమాట. నీకు నిజంగానే నీ సమస్యలని చెప్పుకోవాలని లేదా?" అన్నాడా డ్రైవరు.

"లేదు" అని బదులిచ్చాడు జార్జి. ఇంతలో కారు కుదుపులకి కోడిగుడ్లున్న అట్టపెట్టె జారిపోయింది. జార్జి గబుక్కున దాన్ని పట్టుకున్నాడు. డ్రైవరు చిన్నగా నవ్వి, "ఇవి చాలా సున్నితమైనవి. బాగా పట్టుకున్నావు" అని అన్నాడు డ్రైవరు. అట్టపెట్టె నుంచి ఒక గుడ్డుని బయటకు తీసి తన ముఖం ముందు ఆడించసాగాడు.

"ఇదీ గుండ్రంగానే ఉంది. నీకు తెలుసా? ఈ రోజులలో ఎవరూ అసలైన కోడిగుడ్లని వాడటంలేదు. ఇష్టం లేక కాదనుకో! ఆశ్చర్యమేమిటంటే, ఈ గుడ్లు కోడినుంచే వస్తాయి. కాని వీటిలోంచి కోడిపిల్లలు రావు. ఎందుకంటే వీటిలో పిండం ఉండదు. విచిత్రంగా లేదూ?" అన్నాడు.

"అవును" అన్నాడు జార్జి. ఇద్దరూ కాసేపు మౌనంగా ఉండిపోయారు.

"సరే, నేను నా ప్రయాణాన్ని కొనసాగించాలి. మనం తర్వాత కలుద్దాం" అన్నాడా డ్రైవరు. జార్జి కిందికి దిగి తలుపు వేయబోతుండగా... "ఒక్క నిమిషం" అన్నాడు డ్రైవరు. ఏమిటన్నట్లు డ్రైవరుకేసి చూశాడు.

"ఇదిగో, ఈ గుడ్డు తీసుకో" అంటూ అప్పటి దాకా చేతిలో పట్టుకున్న గుడ్డుని జార్జికి అందించాడు డ్రైవరు.

"థాంక్స్, బై" అంటూ ఆ గుడ్డుని చేతిలో వుంచుకుని తన ఇంటివైపు నడవసాగాడు జార్జి. కారు మళ్లీ గుండ్రంగా తిరగసాగింది. దాని హెడ్‌లైట్ కాంతి చుట్టుపక్కల ఇళ్లపై పడసాగింది. జార్జి తన చేతిలోని గుడ్డుని ఎగరేసి పట్టుకున్నాడు. వున్నట్లుండి ఆ గుడ్డిని కారు అద్దంకేసి గట్టిగా విసిరాడు. అది అద్దానికి తగిలి పగిలిపోయింది. లోపలి సొన అంతా కారు అద్దాలపై పడింది.

“వలయం నుంచి బయటపడాలంటే, దాంట్లోనే తిరగకూడదు. దాన్ని ఛేదించాలి” అంటూ గట్టిగా అరచి, తలుపు తీసుకుని లోపలికి వెళ్లిపోయాడు. గుమ్మం దగ్గర నిలుచుని డ్రైవర్ ఏమంటాడో అని వినసాగాడు.

డ్రైవరు నవ్వుతున్నాడు. “నువ్వు నాకన్నా మెరుగైన స్థితిలో ఉన్నావు మిత్రమా!” అని అరిచాడు డ్రైవరు. తర్వాత మూడుసార్లు హారన్ గట్టిగా మ్రోగించాడు. వాతావరణంలోని నిశ్శబ్దం ఒక్కసారిగా బద్దలైంది. కారు చీకటిని చీల్చుకుంటూ, వీధిలోంచి వెళ్లిపోయింది.

**(నవ్య వారపత్రిక, 28 డిసెంబరు 2005)**

**‘విష వలయం’ కథకి మూలం** 'Vicious Circle' **అనే ఆంగ్ల కథ.**
**ఈ కథ** www.literarypotpourri.com **అనే వెబ్‌సైట్‌లో ప్రచురితమైంది.**